**ఇంద్రకీలాద్రి, మే 24, ప్రభాత'వార్త' :** శ్రీమాతా వైభవం గురించి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతాన్ని భక్తులు ఆసాంతం ఆస్వాదించారు. విజయవాడ లోని క్షేత్రయ్య కళాక్షేత్రంలో శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి వైభవం అంశంపై సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు ప్రవచనామృతం కొనసాగింది. ముందుగా ప్రాంగణానికి విచ్చేసిన బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వేదికపై వుంచిన శ్రీ దుర్గ అమ్మవార్లకు పూజలు నిర్వహించిన అనంతరం ఆధ్యాత్మిక ప్రవచనం కొనసాగింది. ముఖ్యంగా దుర్గమ్మ అవతార విశేషాలు, రాక్షస సంహారం, లోకరక్షణ తదితర అంశాలను భక్తుల మనస్సులు చూరగొనేలా చాగంటివారి ప్రసంగం ఆకట్టుకుంది.

**బంగారు తాపడం పనులకు విరాళం:**

దుర్గమ్మ ఆలయంలో జరిగే బంగారు తాపడం పనులకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన మేరుగు గోపాల్ రు.1,01,116ల విరాళాన్ని అందించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన మర్రి కృష్ణమూర్తి దంపతులు రు.1,01,116ల విరాళాన్ని అందించారు.

వారికి దుర్గమ్మ దర్శనం కల్పించిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అధికారులందించారు. వేద పండితులు వేదాశీర్వచనం పలికారు.

# హు'షార్'గా ముగిసిన యువికా-2024 కార్యక్రమం

## - వర్చువల్ విధానంలో ప్రసంగించిన ఇస్రో ఛైర్మన్ సోమనాథ్




యువికా ముగింపు కార్యక్రమం షార్‌లో బహుమతి ప్రదానం చేస్తున్న డైరెక్టర్ రాజరాజన్

**శ్రీహరికోట (తడ), మే 24 ప్రభాతవార్త** విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన కల్పించడానికి రూపొందించిన యువికా 2024 కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. రెండు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని దేశంలోని వివిధ ఇస్రో కేంద్రాలలో నిర్వహించారు. చివరి రోజు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులతో వర్చువల్ ద్వారా ఛైర్మన్ ఎస్. సోమనాథ్ మాట్లాడారు. యువ తరాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మరల్చడానికి యువికా కార్యక్రమం ఎంతో ఉపయోగపడు తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో త్రివేండ్రంలోని విఎస్ఎస్‌సి, బెంగళూరులోని యుఆర్ఎస్‌సి, హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఎస్‌సి, డెహ్రాడూన్‌లోని ఐఐఆర్ఎస్, అహ్మదాబాద్‌లోని ఎస్ఎసి, షిలాంగ్ లోని ఎన్ఇఎస్ఎసి, శ్రీహరికోట షార్‌లోని ఎస్‌డిఎస్‌సి కేంద్రాలలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం 355 మంది విద్యార్థినీ విద్యార్థులను యువికా 2024కు ఎంపిక చేశారు. శ్రీహరికోటకు సంబంధించి 51 మంది విద్యార్థినీ విద్యార్థులకు కేటాయించగా, వీరిలో ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్‌ల నుంచి పదిమంది చొప్పున స్పేస్‌సెంట్రల్ స్కూలు నుంచి ఒక విద్యార్థి పాల్గొన్నారు. వీరందరికీ శ్రీహరి కోటలోని వివిధ అంతరిక్ష పరిశోధన ప్రయోగ కేంద్రాలను చూపించి ఉత్సాహ పరిచారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో డైరెక్టర్ రాజరాజన్ సర్టిఫికెట్లు అందజేశారు. పలువురు షార్ అధికారులు, సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ బెంగళూరులోని యుఆర్ రావు స్పేస్ సెంటర్ నుంచి వర్చువల్ పద్ధతితో మాట్లాడుతూ యువికా కార్యక్రమం యువ శాస్త్రవేత్తలను వెలికి తీయడమే లక్ష్యంగా చెప్పారు. విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన ఆధునికతను ఆయన వివరించారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకొని ఆ రంగంలో రాణించాలని పిలుపునిచ్చారు.

# శ్రీకాళహస్తిలో నిత్యకల్యాణోత్సవానికి విశేషస్పందన

**శ్రీకాళహస్తి,మే 24 ప్రభాతవార్త** తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి నిత్యపూజలు, అభిషేకాలు ప్రత్యేక అలంకారాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారికి 116 బంగారు పుష్పాలతో అభిషేకించారు. అంతేకాక శుక్రవారం అమ్మవారికి బంగారు చీరతో ముస్తాబు చేసి వజ్రకిరీటాన్ని అలంకరించారు. ఇటీవల ఆలయానికి అతిథుల తాకిడి అధికంగా ఉంటుంది. సాధారణంగానే శుక్రవారం అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. మహిళా భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబఅమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించటం



ఆనవాయితిగా ఉంది. ఈ సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. శ్రీకాళహస్తీశ్వరాలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి. కుడివైపు చూస్తే మృత్యుంజయస్వామి ప్రతిష్టిత లింగం దర్శనమిస్తుంది. ఎడమవైపు నిత్యకళ్యాణోత్సవం దర్శనమిస్తుంది. ఇక శుక్రవారం ఆలయంలో నిత్యోత్సవం ప్రత్యేక ఆకర్షణ. భక్తులకు పండగే పండగ అన్నట్లు ఉంటుంది. ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం, మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది. శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి బంగారు చీర, వజ్రకిరీటంతో పాటు సాయంత్రం బంగారు పుష్పాలతో అభిషేకం ప్రత్యేకార్షణగా మారింది. ఈ సేవలకు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారు. అయితే అమ్మవారికి బంగారుపుష్పాల అభిషేకానికి దేవస్థానం అధికారులు అంతగా ప్రచారం చేయలేదు. దాంతోఈ సేవలకు స్థానికులు మాత్రమే హాజరౌతున్నారు.

# తిరుమల సమాచారం

## జీయంగార్ల నమ్మాళ్వార్‌శాత్తుమొర



**తిరుమల,మే 24 ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లో కపిలతీర్థం సమీపంలోని ఆళ్వార్‌తీర్థంలో వేంచేసి ఉన్న నమ్మాళ్వార్ సన్నిధిలో శుక్రవారం నమ్మాళ్వార్ శాత్తుమొర జీయంగార్ల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ ఆలయం 1500 సంవత్సరాల పురాతన మైనది, భగవద్ రామానుజులు మొదటిసారి తిరుపతికి వచ్చినపుడు మొట్టమొదట ఈ ఆలయాన్ని సందర్శించి ఒక సంవత్సరంపాటు ఈ ఆలయంలో వేంచేసినట్లు శాసనాలద్వారా తెలుస్తోంది. అలిపిరి పాదాల మండపం వద్ద రామాయణ కాలక్షేపం, అధ్యయనం చేసే వారని అర్చకులు తెలిపారు. ఈ ఆలయంలో నమ్మాళ్వార్, తిరుమంగై ఆళ్వార్, భగవద్ రామానుజులు, తిరువరంగత్తు అముదనార్ విగ్రహాలను ప్రతిష్టించి ఉన్నారు. ఈ శాత్తు మొరలో పెద్దజీయంగారు, చిన్న జీయంగార్లు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆళ్వార్‌తీర్థంలో గోవిందరాజుని చక్రస్నానమహోత్సవం



**తిరుపతి,మే 24 ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి అన్న తిరుపతిలో కొలువైన గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపుతో శుక్రవారం ఉదయం కపిలతీర్థంలోని ఆళ్వార్‌తీర్థంలో చక్రస్నానమహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుపతిలో టిటిడి అను బంధంగా ఉన్న గోవిందరాజస్వామికి జరిగిన తొమ్మిది రోజుల వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపుకు చేరుకున్నాయి. చివరిఘట్టంగా చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు. యజ్ఞాంతంలో ఆచరింపబడే అవభృథస్నానమే చక్రస్నాన మహోత్సవం. తొమ్మిదిరోజులు ఒక యజ్ఞంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఉదయం ఆళ్వార్‌తీర్థం పుష్కరిణిలో చక్ర త్తాళ్వార్‌కు చక్రస్నానం ముందు గోవిందరాజస్వామి, ఉభయదేవేరులకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం చక్రత్తాళ్వార్‌కు చక్ర స్నానసమయంలో భక్తులు, అర్చకులు, అధికారులు అందరూ పుణ్యస్నానాలాచరించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా మంచి జరగాలి

**- కేంద్రసమాచార ప్రసారశాఖ కార్యదర్శి సంజయ్‌బాజు**

**తిరుమల,మే 24 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా మంచిజరగాలని వేడుకున్నట్లు కేంద్రసమాచార ప్రసారశాఖ కార్యదర్శి సంజయ్‌బాజుతెలిపారు. శుక్రవారం వేకువ జామున శ్రీవేంకటేశ్వరస్వామి అభిషేకసేవలో సంజయ్‌బాజు దంపతులు పాల్గొన్నారు. ఆలయంలో ఎంతో విశిష్టమైన స్వామివారి అభిషేకం వీక్షించి ఆధ్యాత్మిక ముగ్ధులయ్యామన్నారు. ఆలయంలోపల స్వామివారి దర్శనం తరువాత వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అదికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఇక్కడ ఉన్న ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రం అధికారులుతో సమీక్షించారు. ఇక్కడ స్థానిక,



ప్రజల సమస్యలు ,ప్రధాన వార్తలు వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట లైజాన్ అధికారి బాలకొండయ్య ఉన్నారు.

# వేసవి సెలవులతో భక్తజనసంద్రంగా తిరుమల

## - వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల,మే 24 ప్రభాతవార్తప్రతినిధి:** దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియడం.. విద్యార్థులకు పరీక్షల ఫలితాలు వెలువడటం.. మొక్కులు తీర్చుకునేందుకు అనేక రాష్ట్రాల నుండి తిరుమలకు భక్తులు భారీగా చేరుకుంటున్నారు. వేసవిసెలవులు కొనసాగుతుండటంతో వారాంతం శని, ఆదివారాలు సెలవులు కూడా కావడంతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారింది. శుక్రవారం ఉద యానికి లక్షమందికిపైగాభక్తులు తిరుమలలో ఉండటంతోకొండ కిటకిటలాడు తోంది. ఉదయం 6గంటలకే వైకుంఠం-1,2 క్యూ కాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల రెండు కిలోమీటర్లు వరకు చేరాయి. వెలుపల క్యూ లైన్లలో భక్తులు వేలాదిమంది బారులుతీరి నిలబడ్డారు. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టే సూచనలు ఉన్నాయి. టిటిడి అధికారులు కూడా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంత రాయంగా సేవలందిస్తున్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 53వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. కాగా సామాన్యభక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారాంతం శుక్ర, శని, ఆది వారాల్లో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. ప్రముఖులు, సామాన్యభక్తులు ఈ మార్పును గమనించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

सेन्ट बैंक होम फायनेन्स लिमिटेड
Cent Bank Home Finance Limited
सेन्ट्रल बैंक ऑफ इण्डिया की अनुषंगी Subsidiary of Central Bank of India

**కార్యాలయానికి భవన ప్రాంగణం కావాల్సివున్నది**

సెంట్ బ్యాంక్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు హైదరాబాద్ మరియు విశాఖపట్నం శాఖకు అద్దె ప్రాతిపదికన సుమారు 600 చ.అడుగులు నుండి 800 చ.అడుగుల కార్పెట్ ఏరియా విస్తీర్ణంగల సిద్ధంగా స్వాధీనం లేదా ఒక నెలలో పూర్తిగా సమకూర్చగల భవన ప్రాంగణం కావాల్సి వున్నది. అది సాధ్యమైనంతగా తగిన పార్కింగ్ స్పేస్‌తో గ్రౌండ్ లేదా 1వ అంతస్తుపై వుండాలని మా ఉద్దేశ్యం. కోట్ చేసిన అద్దెలో అన్ని పన్నులు మరియు నిర్వహణ ఛార్జీలు కలిసి ఉండాలి. దయచేసి బ్రోకర్‌లు లేదా మధ్యవర్తులు వద్దు. సవివర నియమాలు మరియు నిబంధనలకు మరియు నమూనాల డౌన్‌లోడ్‌కు మా వెబ్ సైట్ www.cbhfl.com పై 'Tender' సెక్షన్ దర్శించండి.

గమనిక: టెండర్ దాఖలుకు చివరి తేది 17/06/2024 సా॥ 5:00గం॥చే. కార్పొరేట్ కార్యాలయం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా MMO బిల్డింగ్, 6వ అంతస్తు, ఫోర్ట్, ముంబై-400023 కు రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా లేదా tender@cbhfl.com వద్ద ఇ-మెయిల్ ద్వారా పంపవచ్చును. సంప్రదించవలసిన నం - 7024267166.

**తదుపరి చేర్పు మరియు/లేదా సవరణ ఏవైనా వెబ్‌సైట్‌పై మాత్రమే ప్రచురింపబడును. మరియు ఏ వార్తా పత్రికలో కాదు.**

వార్త

ఐకమత్యం ద్వారా చిన్నచిన్న రాజ్యాలు అభివృద్ధి చెందుతాయి. కాని విభేదాలు జనిస్తే పెద్ద పెద్ద దేశాలే సర్వనాశనమవుతాయి.

-సాలస్ట్

# పర్యావరణ ముప్పు!

తల్లి మలపాకుతో నువ్వట్లంటే తలుపు చెక్కతో నేనిట్లంటా అన్నట్లుగావ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. విశ్వవ్యాప్తంగా మానవతప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ,ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో అనూహ్యమైన మార్పులు తలెత్తి విపత్తు వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి విపత్తులకు కారణం అవుతున్నాయని ఎన్నోఅధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్‌లో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన చేస్తున్నా పట్టించుకునే వారే లేకుండాపోయారు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు చేస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలను తొలచి రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిఎకరాల పంట పొలాలను జనావాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. ఇంకొకపక్క భూగర్భ జలాలను విపరీతంగా తోడివేయడంతో భూమి కుంగడం, ఉష్ణోగ్రతలు పెరిగి మంచుకొండలు కరగడంతో సముద్ర మట్టాలు పెరిగి నగరాలను ముంచి వేస్తాయని తాజాగా పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వెలిబుచ్చారు. దాదాపు డెబ్బైఐదుకుపైగా నగరాలు ముంపునకు గురవుతాయని స్పష్టం చేస్తున్నారు. ఇక ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం మరో పదేళ్లలో ఇండియా జనాభా 145 కోట్లకుపైగా చేరుకుంటుందని అందుకు తగినట్లుగా దేశంలోని సహజ వనరులపై ఒత్తిడి పెరుగు తుందని, ప్రధానంగా అటవీ సంపద వేగంగా హరించుకు పోతుందని స్పష్టం చేసింది. భారత్‌లో రోజూ దాదాపు మూడువందల ముప్పై ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్య సమితి నివేదికలో వెల్లడించింది. బొగ్గు గనులు, థర్మల్, విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. అనాదిగా మానవాళి జంతుజాలం అడవులపై ఆధారపడి మనుగడ సాగిస్తూ వస్తున్నాయి. నదుల పుట్టుకకు అపారమైన సహజవనరులకు అడవులే నిలయాలు. జీవవైవిధ్యాన్ని పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంలో అడవులుఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రెండువందల కోట్ల మందికిపైగా అటవీ వనరులపై జీవనం సాగిస్తున్నారు. యేటా అటవీ ఉత్పత్తుల విలువ దాదాపు డెబ్బైవేల కోట్ల డాలర్లకుపైగా ఉంటుందని ఇటీవలే ప్రపంచబ్యాంకు నివేదిక స్పష్టంచేస్తున్నది. భూమిపై లభిస్తున్న ప్రాణవాయువులో అధికశాతం అడవుల నుంచే వస్తున్నది. జాతీయ అటవీ విభాగం 1952నాటి నివేదిక ప్రకారం దేశ భూభాగంలో మూడ్పైమూడు శాతంవిస్తీర్ణంలో అడవులుండాలి. ఎత్తైన పీఠభూముల ప్రాంతాల్లో అరవైశాతం, మైదాన భూముల్లో ఇరవైశాతం ఉండాలి. ఈశాన్యభారతం మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, అండమాన్ నికోబార్ ప్రాంతాల్లో మాత్రమే ఈ విధానాలకు లక్ష్యాలకు అనుగుణంగా అడవులున్నాయి. మిగిలిన నష్టాల్లో ఇప్పటికే కనీసస్థాయి నుంచి తగ్గుముఖం పట్టాయి. 2019నాటి నివేదిక ప్రకారం దేశంలో అటవీ విస్తీర్ణం 21.67శాతం అధికంగా ఉన్నరాష్ట్రాల్లో మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, తదితర రాష్ట్రాలున్నాయి. దక్షిణ భారతంలో కేరళలో 54 శాతం పైగా అడవులు ఉండగా తమిళనాడులో 20.17 శాతం, కర్ణాటకలో 20.11 శాతం, తెలంగాణలో 18.36 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 17.88శాతానికి మాత్రమే పరిమితమై ఉన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే అటవీవిస్తీర్ణం మరింత పడిపోయే ప్రమాదం ఉంది. ఈ కారణంగానే భూతాపం పెరిగిఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పర్యావరణ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణులు కొనసాగితే మరో డెబ్బైఐదేళ్లనాటికి వాతావరణంలో ఊహించని మార్పులు చోటుచేసుకొని సమస్త ప్రాణకోటి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని శాస్త్రజ్ఞులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత్‌లోనే కాదు ప్రపంచంలో ఎక్కడైనా అడవులు తరిగి కొండలు మైదానాలుగా మారితే వన్యప్రాణుల ఉనికి కూడా ప్రమాదంలో పడుతుంది. భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను దృష్టిలో పెట్టుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఐక్యరాజ్యసమితి ప్రపంచస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నది. అందులో భాగంగానే 2015లో జరిగిన పారిస్ వాతావరణ ఒప్పందం సదస్సులో అనేక తీర్మానాలు చేశారు. ప్రపంచ సరాసరి ఉష్ణోగ్రత పెరుగుదల, పారిశ్రామికీకరణ, పూర్వస్థాయి కంటే రెండు డిగ్రీల సెంటిగ్రేడ్‌లకు తక్కువ ఉండేలా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. దాని ప్రకారం భారత్‌లో2030 నాటికి 250కోట్ల నుంచి 300కోట్ల టన్నుల బొగ్గుపులుసు వాయువుకు సమానమైన ఉద్గారాలను తగ్గించడానికి వీలుగా విస్తరణ చేపట్టాల్సి ఉంది. అందుకోసం దేశంలో అటవీ విస్తీర్ణత 33శాతానికి పెరగాల్సిన అవసరంఉంది. కానీ ఆ కోణంలో అడుగులు పడుతున్నట్లు కన్పించడం లేదు. ఏదిఏమైనా అడవుల సంరక్షణకు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సిన తరుణమిది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా జీవకోటి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది.

నిరంతరం నేర్చుకుంటూ ఉంటే తప్ప ఉపాధ్యాయుడనే వాడు నిజంగా మరొకరికి విద్య నేర్పలేడు.



రాగూర్

పొగిడేవారు లేనప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.



శామ్యూల్ జాన్సన్

# ప్రజావాక్కు



## ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలి

రాష్ట్రంలో 125మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉండే పాలిథిన్ కవర్లపై కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు పూర్తిగా నిషేధంవిధించినా ఆచరణలోమాత్రం అదికనిపించడం లేదు. పాలిథిన్ సంచుల వినియోగం మరీ ఎక్కువగా ఉంది. ఎప్పుడో నిషేధించిన 75మైక్రాన్ల మందం కలిగిన సంచులు కూడా నేటికీ వినియోగిస్తున్నారు. కూరగాయలు, టిఫిన్, కిరాణా, పెద్ద దుకాణాలు, హోల్‌సేల్ దుకాణాల్లో పెద్దసంఖ్యలో పాలిథిన్‌కవర్లు వినియోగిస్తున్నారు. పాలిథిన్ కవర్లను నిషేధించడంలో అధికారులు విఫలమవ్వడంతో రహదారులు, కాలువలు ఇలా ప్రతి చోటా అవి దర్శనమిస్తున్నాయి. ఇళ్ల ముందుర, రోడ్డుపై ఈ కవర్లలో పారేసిన వ్యర్థాలను పశువులు తిని అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇన్ని అనర్థాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ సంచులపై అధికారులు ఉక్కుపాదం మెపాలి.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

## మద్యాన్ని నిషేధించాలి

హైదరాబాద్ సహా పలునగరాల్లో, కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడే మద్యం దుకాణాలు ఉండడం వల్ల ప్రజలందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్సైజ్‌శాఖ నిబంధనల ప్రకారం జనవాసాలు, పాఠశాలలు, కళాశాలలు ఉన్న చోట వైన్స్‌షాపులు, బెల్ట్‌షాపులు ఉండకూడదు. కానీ ఈ నిబంధనలను కొంతమంది వ్యాపారులు పట్టించుకోకుండా వారివ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అలాగే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఈ దుకాణాలు ఉండడంవల్ల అక్కడగొడవలు, ప్రమాదాలుజరిగే అవకాశముంది.

-ఇట్టబోయిన రాజు, కొండాపూర్

## క్రీడా మైదానాల ఏర్పాటు

విద్యాహక్కు చట్టంప్రకారం అన్నిప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లల్లో ఆడుకోవడానికి ఆటస్థలాలు, క్రీడాపరికరాలు ఉండితీరాలి. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్ వంటిదేశాలు పోటీపడుతూ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించే దిశగా ముందుకు దూసుకెళ్తున్నాయి. కావునా మనదేశంలో కూడా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలి.

-ఎన్.రాజేష్, వరంగల్

## సినిమా థియేటర్ల మూత

వినోదంతోపాటు విజ్ఞానాన్ని, సంగీత జ్ఞానాన్ని ఆహ్లాదకరమైన కుటుంబ వ్యవస్థ రూపాన్ని, సామాన్యుల మనస్సుల్లో సజీవ శిల్పంగా నిల్పిన సినిమాపరిశ్రమ ఒకనాటి మాట. మారుతున్న జనరేషన్‌కు అనుకూలంగా కొత్త సాంకేతికతను జోడించడం ప్రారంభించడం అసహజం, అతిశయోక్తి చోటుచేసుకుని ప్రేక్షకులకుఈరంగం దూరమైంది. రాజకీయ నటుల జీవితాలు సినిమా కథల్లో బలవంతపు బయోపిక్‌లై, మరోపక్క సినిమా రంగం వారు తమ ఉనికికోసం రాజకీయాల్లో కలగాపులగమై వీటిల్లోనే చట్టాలు, న్యాయాలుభాగమై, ఒకరినొకరు విమర్శించుకుంటున్న కారణం కూడా వాస్తవాలకు, అవాస్తవాలకు హద్దులు చెరిగిపోయి అదికూడా కొంతసినిమా రంగంవిలువ తగ్గడానికి కారణమవుతోంది. లక్షలాది మంది కార్మికులకు జీవనాధారమై, కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి తీస్తున్న సినిమాలు థియేటర్లలో పట్టుమని పదిరోజులు కూడా ఆడకపోవడానికి కారణాలు ఇప్పటికైనా నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు విశ్లేషించుకోకపోతే భవిష్యత్తులో ఇప్పటికే కుదేలైపోయిన నాటకరంగానికి నకలుగా మిగులుతుంది సినీ పరిశ్రమ.

-జోస్యుల వేణుగోపాల్, హైదరాబాద్

## చైనాతో సవాళ్లు

భారత ప్రధాని మార్చిలో ప్రారంభించిన తన్నెల్ చాలా వ్యూహాత్మకమైంది. అవసరమైంది. అంత మాత్రమే కాదు చైనా నుండి ఎదుగుతున్న సవాళ్లను తట్టుకోవడానికి గౌహతి మీదుగా తవాంగ్ వరకు నిర్మించిన ఈ సొరంగం అత్యవసర పరిస్థితులలో తొందరగా లక్ష్యం చేరడానికి ఉపయోగపడుతుంది. అంతే కాదు తవాంగ్‌లో వేళ్ల విరిసిన సాంస్కృతిక వైవిధ్యం గొప్ప చరిత్ర ఉన్న నేపథ్యం ఒకవైపు, బ్రహ్మపుత్ర నది అడ్వాంటేజ్ ఈ సొరంగాన్ని బహుళ ఉపయోగంగా మారుస్తున్నాయి.

-భారత అవినాష్, జనగామ

## పేదరికం తగ్గిందా?

పేదరికం నిజంగా తగ్గిందా అని అనిపిస్తుంది. ప్రపంచ ఆకలి సూచిలో 111వస్థానంలో ఉన్నదంటే పేదరికం తగ్గినట్టేనా లేక పెరిగినట్టా? దేశంలో 47శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దేశంలో పేదరికం తగ్గింది అని చెప్పడానికి అనుసరించిన ప్రామాణికాలు ఏమిటనేది స్పష్టత లేకుండానే పేదరికం తగ్గిందంటున్నారు. దేశంలో మానవవనరుల అభివృద్ధి జరగకుండాపేదరికంఎలా తగ్గుతుంది?

-ఎం.నాగరాజు, కర్నూల్‌జిల్లా

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు e-mail: editpage@vaartha.com

# రాబడి కోసం భద్రతకు నీళ్లు

**మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించినా, మహాప్రసాదంగా మారిన మద్యాదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కల్లోకి తీసుకోవడం లేదు. ఫలితంగా లక్షలాది కుటుంబాలు ఆత్మీయులను కోల్పోయి తల్లడిల్లిపోతున్నాయి. లక్షల సంఖ్యలో అంగవైకల్యంతో జీవనాధారం కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకులీడుస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లుతెరవాలి. ఈ మారణహోమాన్ని ఆపాలి. ప్రధానంగా మద్యం సేవించో, అలక్ష్యంతోనో వాహనాలను నడిపి ఎంతమందిని చంపినా జరిమానా చెల్లిస్తే సరిపోతుందనే భావన పోగొట్టాలి. కొన్ని పాశ్చాత్య దేశాల్లోలాగా మరణాలకు కారణమైన వాహనచోదకులు జీవితంలో స్టీరింగ్ పట్టకుండా పటిష్టమైన చట్టానికి రూపకల్పన చేయాలి.**

దామెర్ల సాయిబాబ

యుద్ధానికి వెళ్తున్న వీరుడు విజయమో, వీరస్వర్గమో అన్నట్లుగా కదనరంగంలోకి దూకుతారు. అయితే యుద్ధంలో విజయం సాధించి తిరిగిరావడమో లేక పోరులో అమరుడుకావడమో జరుగుతుంది. అలా యుద్ధంలో అసువులు బాసినా, దానికి ఒక లక్ష్యం, అర్థం పరమార్థం ఉంటుంది. వీటన్నింటిని మించి దేశంకోసం ప్రాణాలు త్యాగం చేశాడనే మాటలకు అందని సంతృప్తి ఉంటుంది. మనదేశం కోసం యుద్ధంలో అసువులు బాసిన వీరజవానులను ఇప్పటికీ మననం చేసుకుంటూనే ఉంటాం. అలాగే దేశంకోసం పోరాటాల్లో అసువులు బాసిన మన నేతలకు జోహార్లు అర్పిస్తూనే ఉంటాం. కానీ ఏ లక్ష్యం లేదు. పోరాటమూ లేదు. ఏ కార్యసిద్ధి సాధించే ప్రయత్నమూ లేదు. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు రోడ్డుప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తూ జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నారు. ఒకరోఇద్దరో కాదు. ఒక రోజో, రెండు రోజులో కాదు. యేటా వేలాదిమంది అసువులు బాస్తున్నారు. నిత్యం రోడ్లు రక్తసిక్తం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే 2001 నుంచి 2020 వరకు తొంభైఆరులక్షల అరవైరెండువేల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే ఇరవైమూడు లక్షల ఇరవైఐదువేల మంది మృత్యువాతపడినట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రుల సంఖ్య ఎన్ని లక్షల్లో ఉంటుందో అంచనాకే అందదు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా గత నాలుగేళ్లలో ఇరవైతొమ్మిదివేల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీనికితోడు ఇటీవల కాలంలో రోడ్లపక్కన నిలుపుతున్న వాహనాలు భారీ ప్రమాదాలకు చోటు ఇస్తున్నాయి. కేంద్ర, రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం రోడ్లపై నిలిపిన వాహనాల కారణంగా 2021లో పదకొండువేల ఆరువందలకు పైగాప్రమాదాలు జరిగితే దాదాపు నాలుగువేలతొమ్మిది వందల మందికిపైగా అసువులు బాసారు. 2022నాటికి అవి పద్నాలుగువేల నూటముప్పైకిపైగా ప్రమాదాలు పెరగగా ఆరువేల మందికిపైగా మృతిచెందారు. గత పదేళ్లలో ఇలాంటి ప్రమాదాలు యాభైవేలకుపైగా ఉండవచ్చునని అధికార అంచనాలను బట్టే తెలుస్తున్నది. వాహనాలు నిర్లక్ష్యంగా, నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ కారణంగా ప్రధానంగా తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాల్లో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో రోడ్లపక్కన ఎలాంటి సంకేతాలు లేకుండా నిలిపిన వాహనాలు కన్పించక చోదకులు నేరుగా పోయిఢీకొడుతున్నారు. ఈ ప్రమాదాలు ఇంతగా పెరుగుతున్నా అధికారులు ఏమాత్రం స్పందనలేక, చర్యలు తీసుకోలేకపోవడం దురదృష్టకరం. బెంగళూరు జాతీయ రహదారిలో ఇటీవల గస్తీ బృందాలతో పర్యవేక్షణ చేస్తూ నిర్లక్ష్యంగా రోడ్డుపక్కన పార్కింగ్‌చేసే వాహనాల సమాచారం సేకరించి చర్యలు ప్రారంభించారు. జాతీయ రహదారులపై వాహన చోదకుల కోసం ప్రతి యాభై కిలో మీటర్ల దూరానికి నిర్మించిన విశ్రాంత గదులు నిరుపయోగంగా ఉన్నాయి. ఇలా రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన వాహనాలు రోడ్లపైన గుంతలు, అధిక వేగంతో దూసుకువెళ్లడం, వీటన్నింటిని మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నది. కేంద్ర, రోడ్డు రవాణా హైవేల మంత్రిత్వశాఖ ఇటీవల ప్రకటించిన నివేదిక ప్రకారం 2022లో దేశవ్యాప్తంగా నాలుగు లక్షలఅరవైవేలకు పైగా ప్రమాదాలు చోటుచేసుకొని లక్షాఅరవై ఎనిమిదివేల మంది ప్రాణాలుకోల్పోగా దాదాపు నాలుగున్నర లక్షలమంది గాయపడ్డారు. 2021తో పోలిస్తే 2022లో రోడ్డు ప్రమాదాలు దాదాపు పన్నెండు శాతం, మరణాలు 9.4 శాతం మేర పెరిగాయి. క్షతగాత్రుల సంఖ్య పదిహేనుశాతం పెరిగింది.

## ఒక్క మాట

భారతదేశంలో సగటున నిత్యం రోజూ పన్నెండు వందలకు పైగా ప్రమాదాలు జరుగుతుండడం, వాటిల్లో ప్రతిరోజూ నాలుగువందల అరవైమందికిపైగా ప్రాణాలు వదులుతున్నారు. 2022లో ముప్పైమూడు శాతం రహదారి దుర్ఘటనలు జాతీయ రహదారిపైనే చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నవారిలో అరవైశాతం దాకా పద్దెనిమిది నుంచి ముప్పైఐదేళ్లు ఉన్నవారే. ఈ ప్రమాదాలను నియంత్రించి మరణాల సంఖ్యను తగ్గించేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2010- 2021 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా రోడ్డుప్రమాదాల మరణాలు ఐదుశాతం మేరతగ్గాయి. సగటున యేటా పదిలక్షలకు పైగా దిగివచ్చినట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికలు వెల్లడిస్తున్నాయి. మొత్తం 108 ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల్లో రహదారి ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నాయి. కానీ భారత్‌లో మాత్రం అదేకాలానికి పదిహేను శాతానికి పెరిగిపోయాయి. ఇక రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రజలను చైతన్యవంతులను చేయాలని, నిబంధనలను అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలనే లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నారు. 2024నాటికి రోడ్డు ప్రమాదాల మరణాలు యాభై శాతం మేర తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నా అది సాధ్యం కాదని ఆ తర్వాత గ్రహించి ఆ లక్ష్యాన్ని 2030వరకు పొడిగించారు. ప్రమాదాలకుగురై ప్రాణాపాయస్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు వదులుతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార వర్గాలు అంగీకరిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రమాదాల సంఖ్య అంతకంతకు పెరుగుతున్నాయి. నిత్యం రోడ్లు రక్తసిక్తం అవుతున్నాయి. సంపాదన చేస్తున్న భర్తో, కుమారుడో, లేక చేతికి అందివస్తున్న బిడ్డలను కోల్పోయిన ఆ కుటుంబాల పరిస్థితిని మనసు పెట్టి పెద్దలుఆలోచించాలి. ఒక్కోసారి ఆ కుటుంబాల విషాద గాథలు వింటుంటే ద్రవించని హృదయం ఉండదు. ప్రకృతి బీభత్సంతో వందోరెండు వందల మందో అసువులు బాస్తే భూమి, ఆకాశం దద్దరిల్లే టట్లు కేకలు వేసే నాయకులు ఈ ప్రమాదాల్లో ఇలా వేలాదిమంది మరణించినా, మరణిస్తున్నా వారి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరం. ప్రకృతి బీభత్సానికి గురవుతున్న వారిని ఆదుకోవద్దని చెప్పడంలేదు. ఆపన్నహస్తం అందివ్వొద్దని అనడం లేదు. యేటా వేలాదిమంది రోడ్డు ప్రమాదాల్లో అసువులు బాస్తుంటే పట్టించుకోకపోవడం క్షంతవ్యం కాదు. ఈ ప్రమాదాల గుర్చిపాలకులకు తెలియంది కాదు. ప్రముఖులు ఎవరైనా చనిపోయినప్పుడు పెద్ద ఎత్తున మరణాల సంభవించినప్పుడు చేసే హడావుడి అంతా ఇంతాకాదు. సమీక్షలు, సమావేశాలు ఏర్పాటుచేసి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపడతామని ప్రకటించడం, ఆ తర్వాత మరచిపోవడం సర్వసాధారణమైంది. ఈ ప్రమాదాల నివారణకు ఏ చర్యలు తీసుకోవడం లేదని చెప్పడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి రోడ్డుభద్రతా సంస్థను ఏర్పాటుచేశారు. కొన్ని మార్పులు, చేర్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షణ చేసేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్‌హోదా కలిగిన అధికారిని నియమించారు. రెండు రాష్ట్రాల్లో రెండు సేఫ్టీ అథారిటీలున్నాయి. దాదాపు మూడు దశాబ్దాల కాలంగా ఆ కార్యాలయాలకు పని కల్పించకుండా కేవలం సంతకం పెట్టే పరిస్థితి కల్పించారు. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా 2005లోనే రహదారి భద్రత ట్రాఫిక్ నిర్వహణ అంశంపై ఎస్ సుందర్ నేతృత్వంలో కమిటీని నియమించింది. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను సమగ్రంగా అధ్యయనం చేసి ఆ కమిటీ 2007లో ఒక నివేదికను సమర్పించింది. అప్పుడే ఎనభైశాతం డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించడం ద్వారా జరుగుతున్నాయని ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొంది. ఆ తర్వాత కూడా కమిటీలెన్నో వచ్చాయి. చట్టంలో కూడా మార్పులు చేశారు. అధికశాతం ప్రమాదాలు మద్యం మత్తువల్లనే జరుగుతున్నాయి. మద్యంద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించినా, మహాప్రసాదంగా మారిన మద్యాదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కల్లోకి తీసుకోవడంలేదు. ఫలితంగా లక్షలాది కుటుంబాలు ఆత్మీయులను కోల్పోయి తల్లడిల్లిపోతున్నాయి. లక్షల సంఖ్యలో అంగవైకల్యంతో జీవనాధారం కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకులీడుస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ఈ మారణహోమాన్ని ఆపాలి. ప్రధానంగా మద్యంసేవించో, అలక్ష్యంతోనో వాహనాలను నడిపి ఎంతమందిని చంపినా జరిమానా చెల్లిస్తే సరిపోతుందనే భావన పోగొట్టాలి. కొన్ని పాశ్చాత్య దేశాల్లో లాగా మరణాలకు కారణమైన వాహనచోదకులు జీవితంలో స్టీరింగ్ పట్టకుండా పటిష్టమైన చట్టానికి రూపకల్పన చేయాలి. •

# విసిల నియామకంలో తొందరపాటు వద్దు!

డా.కాటేపాగ యుగంధర్

యూనివర్సిటీలలో వైస్‌ఛాన్సలర్ పదవీకాలం మొన్న 21వతేదీన ముగియడంతో సీనియర్ అధికారులతో తాత్కాలికంగా విసి పోస్టులను భర్తీ చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కొత్త వైస్‌ఛాన్సలర్ నియామకం కసరత్తుకు శ్రీకారం చుట్టబోతున్నట్లు సమాచారం. తెలంగాణలోని వివిధ యూనివర్సిటీలకు నియమించిన విసిల పనితీరును ప్రభుత్వం పరిశీలించి అందులో జరిగిన లోటుపాట్లను సరిదిద్దాలి. యూనివర్సిటీలు అంటే ఉన్నత విద్యావ్యవస్థలు. ఎంతోమంది విద్యార్థులను విద్యావంతులుగా తయారు చేసి దేశ, విదేశాలలోని వివిధ రంగాలలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడం జరిగింది. కావున ప్రభుత్వం పతనమవుతున్న విశ్వవిద్యాలయాలను పవిత్రమైన విశ్వవిద్యాలయాలుగా తీర్చిదిద్దాలి. ఏ ప్రభుత్వం అయినా యూనివర్సిటీలను కాపాడకుంటే ఆ ప్రభుత్వాలు పతనమవుతాయి. ఎందుకంటే యూనివర్సిటీలలో చదువుకునే వారు గ్రామీణ ప్రాంతాలలో ఉండే పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, అగ్రకులాల పేద బిడ్డలు. ఈ వర్గాలకు చెందిన బిడ్డలు చదువుకుని బాగుపడాలంటే ప్రభుత్వం నాణ్యమైన విద్యనందించాలి. నాణ్యమైన విద్యతోపాటు వారి బంగారు భవిష్యత్‌కు పునాది వేయలి. విసిలు అంటే యూనివర్సిటీ నియమ నిబంధనలను పాటించి వాటినే అమలు పరిచే విధంగా నిర్ణయాలు ఉండాలి. యూనివర్సిటీ విద్యా ప్రమాణాలను, శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాన్ని పెంచి పటిష్టమైన విద్యను అందించాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్య కావాలంటే వాటికి సంబంధించిన బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి తోడ్పడాలి. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు, అసోసియేట్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించుకోవాలి. వీటి




నియామకంలో ఏవిధమైనటువంటి రాజకీయ పలుకుబడి లేకుండా ఆర్థిక లాభార్జన కోసం (ఆర్థిక దోపిడీ, అవినీతి) కోసం పాటుపడకుండా అర్హులైన వారిని నియామకం చేసుకోవాలి. అలాగే అనుభవం కలిగిన ప్రొఫెసర్లతో పేద విద్యార్థులకు వివిధ రంగాల్లో, ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి అవగాహన, శిక్షణ ఇప్పించాలి. 'కార్పొరేట్ విద్య' పడగ విప్పి కోరలు చాచి బుస కొడుతుంది. పేద విద్యార్థులు వాటిని అందుకోలేరు. కనుక కార్పొరేట్ శక్తుల కంటే దీటుగా యూనివర్సిటీ విద్యార్థులను తీర్చిదిద్దాలి. విద్యార్థుల భవిష్యత్‌తోపాటు యూనివర్సిటీల భవిష్యత్‌ను కూడా కాపాడాల్సిన బాధ్యత విసిలదే. యూనివర్సిటీల్లో విద్యార్థులను రాజకీయ, ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతికపరమైన మేధోసంపత్తి కలిగిన మేధావులుగా తీర్చిదిద్దాలి. కాని రాజకీయ పార్టీలకు, నాయకులకు కాని వారి ప్రలోభాలకు లొంగకుండా రాజకీయ ప్రమేయంలేని విద్యావ్యవస్థను నిర్మించుకోవాలి. యూనివర్సిటీ విద్య అంటే సిసి కెమెరాల ఫుటేజీలతో నిఘాపెట్టి పరిశీలించడం కాదు. విశ్వవిద్యాలయాలు అంటే విశ్వ పరిజ్ఞానాన్ని కలిగిన 'జ్ఞాన' సంపాదన పంపిణీ సంస్థలుగా వాటిని మెరుగుపరచాలి. విసిలు అంటే యూనివర్సిటీ రూపురేఖలను మార్చేవిధంగా ఉండాలి. కానీ యూనివర్సిటీలను పతనం చేసి విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసి ప్రభుత్వానికి ఏజెంట్‌గా పనిచేసే అధికారిగా ఉండకూడదు. విసిలను నియమించేటప్పుడు అన్ని విధాలుగా ఆలోచించి అనుభవజ్ఞులు అయిన మేధోసంపత్తి కలిగిన వారిని ఏ విధమైన రాజకీయ పార్టీకి సంబంధం లేని వ్యక్తులను యూనివర్సిటీలకు విసిలుగా నియమిస్తే విద్యార్థుల భవిష్యత్‌తోపాటు యూనివర్సిటీల భవిష్యత్ కూడా బాగుపడుతుంది. కనుక ప్రభుత్వం తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా ఆలోచించి అనుభవజ్ఞులైన వారిని విసిలుగా నియమించాలి. •

# విదేశీ ఉద్యోగాలపై అప్రమత్తత అవసరం!

మహమ్మద్ ఆరిఫ్

విదేశాల్లో పెద్ద ఉద్యోగం, ఎసి రూముల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పని. రూ.లక్షల్లో సంపాదన అని చెప్పి నిరుద్యోగ యువతను నమ్మించి విదేశీ ముఠాలకు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యులను విశాఖ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఫారిన్ జాబ్స్ పేరుతో గతంలోనూ రష్యా ఆర్మీలో భారత యువతను చేర్పించిన విషయం బయటికొచ్చింది. అంతేకాకుండా చాలా మంది గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల పేరుతో విజిటింగ్ వీసాలపై పంపి మోసం చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. అందుకే విదేశాల్లో ఉద్యోగం అంటే ఒకటికి రెండు సార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. విశాఖలో వెలుగు చూసిన ఫారిన్ జాబ్ స్కామ్‌లో విస్తుగొలిపే విషయాలు వెలుగు చూశాయి. కంబోడియాలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేయడానికి పిలిచి, వారిని చైనా కంపెనీ ఏజెంట్లకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ వారితో జాబ్ స్కామ్‌లు, టాస్క్‌గేమ్ వంటి సైబర్ ఫ్రాడ్స్ చేయిస్తున్నట్లు నిర్ధారించారు. రెండేళ్లలో ఏజెంట్ల ద్వారా తెలంగాణ, ఎపితోపాటు దేశవ్యాప్తంగా ఐదువేల మంది కంబోడియా వెళ్లినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. వీరిని చైనా ముఠాలు కనుక్కొని సైబర్ నేరాలపై శిక్షణ ఇచ్చి మోసాలు చేయిస్తున్నట్లు గుర్తించారు. ఎవరైనా నిరాకరిస్తే చీకటి గదుల్లో పెట్టి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఓ బాధితుడు పోలీసులకు తెలిపాడు. అంతేకాకుండా కొంతకాలం క్రితం రష్యాలో ఉద్యోగాల పేరిట కొందరు ఏజెంట్లు భారతీయులను తీసుకువెళ్లి రష్యా ఆర్మీలో సహాయ సిబ్బందిగా చేరుస్తున్నారని విదేశాంగ శాఖ గుర్తించింది. అలాంటి ఉద్యోగాల్లో చేరి తమ ప్రాణాలను ప్రమాదంలో పడేసుకోవద్దని హెచ్చరించింది. టర్కీ సమీపంలోని అజర్ బైజాన్‌కు 29 మందిని స్టూడెంట్ వీసాపై తీసుకువెళ్లి ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేసిన ఘటన గతంలో శ్రీకాకుళంలో వెలుగుచూసింది. అక్కడి పోలీసులు గుర్తించి బాధితులను ఇండియాకు తిరిగి పంపించారు. విశాఖపట్నంలో ఓ కన్సల్టెన్సీ సంస్థ సౌదీలో రెండేళ్లపాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని 76 మంది నుంచి రూ. 60వేల చొప్పున వసూలు చేసింది. విజిటింగ్ వీసాపై సౌదీకి తీసుకెళ్లి పని కల్పించింది. అయితే ఆరు నెలలకే వీసా గడువు ముగియడంతో ఆ దేశం వారందరినీ ఇండియాకు వెనక్కి పంపించేసింది. బాధితులంతా పోలీసు



లను ఆశ్రయించారు. విదేశాల్లో ఉద్యోగాల ఆశ చూపి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటనలు గతంలో అనేకం వెలుగు చూశాయి. స్వీడన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖలో ఓ సంస్థ నిరుద్యోగులకు టోకరా వేసింది. 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. యూరప్, మలేషియా పంపిస్తామని ఏజెంట్లు మోసం చేశారని జగిత్యాలలో చాలా మంది పోలీసులను ఆశ్రయించారు. అంతేకాకుండా తెలంగాణ వంటి రాష్ట్రంలో గల్ఫ్ మోసాలు తరచూ బయటపడుతూనే ఉంటాయి. గల్ఫ్ పంపిస్తామని నిజామాబాద్ జిల్లాలో ఓ ఏజెంట్ రూ.4కోట్ల వరకు వసూలు చేసి పరారయ్యాడు. విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలు ఎక్కువగా తూర్పు, ఐరోపా దేశాలు. గల్ఫ్ కంట్రీస్, ఇజ్రాయెల్, కెనడా, మయన్మార్ వెళ్లే నిరుద్యోగులకు ఎదురవుతున్నట్లు భారత విదేశాంగ శాఖ గుర్తించింది. అందుకే విదేశాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు చేయాలనుకుంటే రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెంట్స్‌ను మాత్రమే సంప్రదించాలని, చట్టపరమైన నిబంధనలను అనుసరించి మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచిస్తున్నది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడేవారు ఎక్కువగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్‌లాంటి సామాజిక మాధ్యమాల ద్వారానే సంప్రదిస్తున్నారని తమ ఆఫీసు అడ్రస్‌గానీ, ఇంటి అడ్రస్‌గానీ తెలియనివ్వడంలేదని గుర్తించింది. అందుకే రిజిస్టర్డ్ ఏజెంట్లందరూ తమ కార్యాలయం ఎదుట ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్‌ను కచ్చితంగా డిస్‌ప్లే చేయాలని కేంద్రం ఆదేశించింది. ప్రభుత్వ గుర్తింపులేని రిక్రూటింగ్ ఏజెంట్లు ఎవరైనానిరుద్యోగులకు మాయ మాటలు చెప్పి విదేశాలకు పంపిస్తే కఠినశిక్షలు ఉంటాయని హెచ్చరించింది. ఇమ్మిగ్రేషన్ చట్టం 1983 ప్రకారం ఇది మానవ అక్రమ రవాణా కిందికి వస్తుందని స్పష్టం చేసింది. మెరుగైన ఉపాధి కోసం చాలామంది భారతీయులు విదేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే చాలా మంది నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతూ, ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రాణాల మీదకు తెచ్చు కుంటున్నారు. అందుకే విదేశీ ఉద్యోగ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రిజిస్టర్ చేయని రిక్రూట్‌మెంట్ ఏజెంట్ల ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవద్దని పేర్కొంటున్నారు. ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లాలనుకునే వారు ముందుగా ఏజెంట్ వివరాలను తెలుసుకోవాలి. విదేశాంగ శాఖలో ఏజెంట్‌గా నమోదు చేసుకున్నారా లేదా పరిశీలించాలి. ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ నంబర్ చెక్ చేయడానికి భారత ప్రభుత్వ వెబ్‌సైట్‌ను విజిట్ చేయాలి. అసలైన ఏజెంట్ల రిజిస్ట్రేషన్ నంబర్లు ఈ వెబ్‌సైట్లో లిస్ట్ అయి ఉంటాయి. అంతేకాకుండా ఆఫర్ లెటర్‌ను నిశితంగా పరిశీలించాలి. ఉద్యోగ నిబంధనలు, షరతులతోపాటు జీతం, జాబ్ కాంట్రాక్ట్ వివరాలు లేకుంటే ఆ ఆఫర్ లెటర్ మోసపూరితమని గ్రహించాలి. అప్రమత్తంగా ఉండాలి. •

25-5pg5.qxd:25-5pg5.qxd 1/1/02 6:34 AM Page 1



# పాక్ ఒకప్పుడు మాదేశమే అని అక్కడే చెప్పా!

## లాహోర్ పర్యటనపై ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 24:** దాయాది పాకిస్థాన్ ఆందోళనలకు ప్రధాన కారణం తానేనని ప్రధాని మోడీ అన్నారు. ఆదేశం ఎంతశక్తిమంతమైందో తాను స్వయంగా అక్కడికి వెళ్లి పరిశీలించానని అన్నారు. పొరుగుదేశాన్ని ఉద్దేశిస్తూ కాంగ్రెస్ నేతలుచేస్తున్న వ్యాఖ్యలకు ప్రధాని కౌంటర్ ఇచ్చారు. పాక్‌వద్ద అణుబాంబులున్నాయని, ఆదేశాన్ని భారత్ గౌరవించాలంటూ ఇటీవల కాంగ్రెస్‌నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 2015లో తన లాహోర్ పర్యటనను గుర్తుచేసారు. తాను వ్యక్తిగతంగా ఆదేశం వెళ్లి ఆదేశం ఎంత శక్తివంతమైనదో పరిశీలించానని లాహోర్ పర్యటనలో ఒక మీడియా జర్నలిస్టు వీసాలేకుండా తమ దేశానికి ఎలా వచ్చారని ఆశ్చర్యం వ్యక్తం చేసారని చెప్పారు. ఒకానొక సమయంలో ఈ ప్రాంతం మా భారత్‌లో భాగమేకదా అని నేను అన్నట్లు ఆయన గుర్తు చేసారు. ఈ మధ్య పాకిస్థాన్ ప్రభుత్వం ఆందోళనలో ఉందని, దానికి నేనే ఒక కారణమని అన్నారు. వారు ఆందోళన చేయడంలో అర్థం ఉందని, కానీ మన దేశంలోనూ కొంతమంది వ్యక్తులు దాయాదిపై సానుభూతి చూపిస్తున్నారని, ముంబయి పేలుళ్లకు పాల్పడిన కసబ్ మనవాడే అంటూ మరో నేత అన్నారని, ఇలాంటి వ్యాఖ్యలు వింటుంటే సిగ్గుతో తలకొట్టేసినట్లవుతుందని మోడీ కాంగ్రెస్‌పై విమర్శలు కురిపించారు.

పంజాబ్‌లోని పాటియాలా సభలో ప్రధాని మాట్లాడుతూ కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాను ప్రస్తావించారు. 1971యుద్ధంలో 90వేల మంది పైగా పాకిస్థాన్ సైనికులు భారత్‌కు లొంగిపోయారని అప్పుడు తాను అధికారంలో ఉండి ఉంటే ఆసైనికులను విడుదలచేసేముందు పాక్ నుంచి కర్తార్‌పూర్ సాహిబ్‌ను వెనక్కి తీసుకునేవాడినని అన్నారు.

2015 డిసెంబరు 25న ఆఫ్ఘనిస్తాన్ పర్యటనకు వెళ్లినప్రధాని తిరిగి వస్తూ లాహోర్‌లో ఆకస్మికంగాదిగారు. ఆరోజు నాటిప్రధాని నవాజ్‌షరీఫ్ పుట్టినరోజు కావడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లారు. 2004 తర్వాత ఓ భారతప్రధాని దాయాది దేశంలో అడుగుపెట్టడం ఇదే తొలిసారి.



## మాస్కో మారణహోమంలో ఉక్రెయిన్ సైన్యం

**మాస్కో, మే 24:** రష్యా రాజధాని మాస్కోలోని అతిపెద్ద సంగీత కచేరీ హాలులో ఇటీవల జరిగిన మారణకాండతో ఉక్రెయిన్‌కు సంబంధమున్నట్లు రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బి) అధిపతి అలెగ్జాండర్ బోర్ట్నికోవ్ ఆరోపించారు. ఈ మారణహోమంలో ఉక్రెయిన్ మిలటరీ ఇంటెలిజెన్స్ అధికారులు నేరుగా పాల్గొన్నట్లు ఆయన ఆక్షేపించారు. ఈ మేరకు రష్యా వార్తా సంస్థ 'టాస్' ఓ కథనాన్ని ప్రచురించింది. మార్చి 22న దాదాపు 6 వేల మంది సామర్థ్యమున్న క్రాకస్ సిటీ హాలులో సంగీత కచేరీ జరుగుతుండగా దుండగులు రెచ్చిపోయి విచణారహితంగా కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 140 మందికిపైగా మరణించారు. ఇందుకు సంబంధించి రష్యా భద్రతా సిబ్బంది 11 మందిని ఇప్పటికే అదుపులోకి తీసుకుంది. ఈ దాడిలో నేరుగా నలుగురు తజకిస్థాన్ జాతీయులూ పాల్గొన్నారు.

టాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కాల్పుల ఘటనపై ఓవైపు రష్యా దర్యాప్తును కొనసాగిస్తున్నప్పటికీ.. ఇప్పటికే ఓ స్పష్టత వచ్చింది. దాడి వెనక ఉక్రెయిన్ హస్తం ఉందని బలంగా నమ్ముతున్నామని బోర్ట్నికోవ్ తెలిపారు. మరోవైపు రష్యాకు వ్యతిరేకంగా పోరాడేందుకు అఫ్గానిస్థాన్‌తోపాటు మధ్య ప్రాచ్య, ఉత్తర ఆఫ్రికా దేశాలు ఉక్రెయిన్‌కు కిరాయి సైనికులను సమకూరుస్తున్నాయని ఆయన దుయ్యబట్టారు. అయితే, ఈ ఘటనతో తమకేమీ సంబంధం లేదని ఇప్పటికే ఉక్రెయిన్ స్పష్టం చేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ఈ ఘటనలో సంబంధం ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలేమీ లేవని అమెరికా వెల్లడించింది. కాగా, ఈ దాడికి పాల్పడింది తామేనంటూ ఇస్లామిక్ స్టేట్ ఇప్పటికే ప్రకటించుకుంది.

### పపువా న్యూగినియాలో విరిగిపడిన కొండచరియలు

# 100 మందికిపైగా మృతి

**మెల్‌బోర్న్, మే 24:** పసిఫిక్ దేశం పపువా న్యూ గినియాలో ప్రకృతి విపత్తు సంభవించింది. మారుమూల ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి బీభత్సం సృష్టించాయి. ఈ దుర్ఘటనలో 100 మందికిపైగా మరణించినట్లు ఆస్ట్రేలియా అధికారిక మీడియా వెల్లడించింది. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు తెలిపింది. పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోర్స్బీకి 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎన్గా



ప్రావిన్స్‌లోని కావోకలం గ్రామంలో ఈ విపత్తు సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3గంటలకు కొండచరి యలు విరిగి గ్రామంపై పడ్డాయి. దీంతో పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. ప్రజలు నిద్రలో ఉన్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో ప్రాణనష్టం భారీగా వాటిల్లింది.

శిథిలాల కింద నలిగిపోయిన వారి కోసం గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అనేక ఇళ్లు పూర్తిగా నేటమట్టమై బండరాళ్లు, చెట్ల కింద కూరుకుపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటిరకు 100కుపైగా మృతదేహాలను వెలికి తీశామని, మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలిపారు. కాగా.. ఈ గ్రామానికి పోలీసులు, సహాయక బృందాలు ఇంకా చేరుకోలేదని సమాచారం. మృతుల సంఖ్యపై పపువా న్యూ గినియా ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన జారీ చేయలేదు.




## ఎంపి పదవికి రాజీనామా చేయను

### తేల్చి చెప్పిన ఆప్ రాజ్యసభ ఎంపి స్వాతి మలివాల్

**న్యూఢిల్లీ, మే 24:** ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ తన పదవికి రాజీనామా చేసేది లేదని స్పష్టం చేశారు. పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా అభ్యర్థిస్తే పదవి నుంచి వైదొలగేదాన్నన్నారు. అలా కాకుండా దాడి చేయడంతో ఇప్పుడు పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదన్నారు. 2006లో వీరితో కలిసి పనిచేసేందుకు వీలుగా నా ఉద్యోగాన్ని వదులుకున్నాను. అప్పుడు మా సంస్థలో ముగ్గురే ఉండేవారు. వారిలో నేను ఒకరిని. ఆప్ స్థాపించిన నాటి నుంచి పార్టీ కోసం ఎంతో శ్రమించాను. ఎవరికైనా నా రాజ్యసభ సీటు కావాలంటే నన్ను అడగాలి. పార్టీ కోసం జీవితాన్నే ఇచ్చాను. ఎంపి సీటు చాలా చిన్న విషయం. నేను ఆప్‌లో చేరినప్పటినుంచి ఎటువంటి పదవీ కోరలేదు. కానీ, వారు నాతో ఇలా ప్రవర్తిస్తున్నారు. ఇప్పుడు నేను ఎట్టిపరిస్థితుల్లోను రాజీనామా చేయను అని మలివాల్ అన్నారు. మే 13న ఢిల్లీ సిఎం నివాసంలో ఆప్ ఎంపి స్వాతి మలివాల్‌పై అరవింద్ కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్‌కుమార్ దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అనంతరం ఢిల్లీ పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నిందితుడు సాక్ష్యాలను నాశనం చేసేందుకు ఫోన్‌ను ముంబయిలో ఫార్మాట్ చేయించినట్లు గుర్తించిన పోలీసులు అతడిని విచారిస్తున్నారు.

## సాంకేతిక లోపంతో చక్కర్లు కొట్టిన హెలీకాప్టర్, పరుగులు తీసిన ప్రయాణికులు

**కేదార్‌నాథ్, మే 24:** కేదార్‌నాథ్‌కు ప్రయాణికులతో వెళ్తున్న హెలీకాప్టర్‌లో సాంకేతిక సమస్యలుతలెత్తడంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. పైలట్ చాకచక్యం వల్ల ప్రయాణికులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయపడ్డారు.పవిత్ర చార్‌ధామ్ యాత్రలో ఒకటైన కేదార్‌నాథ్ బయల్దేరిన యాత్రికులకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. వారు ప్రయాణిస్తున్న హెలీకాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తి గాల్లో చక్కర్లు కొట్టింది. అయితే, పైలట్ అప్రమత్తత వల్ల వారంతా సురక్షితంగా బయపడ్డారు.

కేస్టల్ ఏవియేషన్‌కు చెందిన హెలీకాప్టర్ సీర్సీ నుంచి కేదార్‌నాథ్‌కు బయల్దేరింది. అందులో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేస్తుండగా గాల్లో చక్కర్లు కొడుతూ హెలీపాడ్‌కు సుమారు 100 మీటర్ల దూరంలో గడ్డి నేలపై ల్యాండ్ అయ్యింది. పైలట్ చాకచక్యంగా వ్యవహరించి సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో అక్కడ ఉన్న పర్యాటకులు భయభ్రాంతులకు గురయ్యారు. గట్టిగా కేకలు వేస్తూ అక్కడి నుంచి పరుగులు తీశారు.




ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగలేదు.హెలీకాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులు, పైలట్ సురక్షితంగా ఉన్నారు. 'సీర్సీ నుంచి కేదార్‌నాథ్ ధామ్‌కు ఆరుగురు ప్రయాణికులతో వస్తున్న హెలీకాప్టర్‌ను కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. సాంకేతిక సమస్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంద్ణి అని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి తెలిపారు. గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లతో కూడిన చార్‌ధామ్ యాత్ర మే 10న ప్రారంభమైంది. హిందువులకు ఈ యాత్ర ఎంతో పవిత్రమైంది. సాధారణంగా చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ - మే నుంచి అక్టోబర్ -నవంబర్‌వరకు జరుగుతుంది. ఇది యమునోత్రి నుంచి మొదలై, గంగోత్రి, కేదార్‌నాథ్ మీదుగా సాగి, చివరకు బద్రీనాథ్‌తో ముగుస్తుంది. ఈ యేడాది యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం యాత్రికులందరికీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది.

## 'కూలడానికి 90 సెకన్ల ముందు్ణ

# ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్ ప్రమాదంపై తొలి నివేదిక

**టెహ్రాన్, మే 24:** ఇరాన్ దివంగత అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణించిన హెలీకాప్టర్ ప్రమాదం ప్రాథమిక నివేదిక వెలువడింది. ఘటనా స్థలంలో ఎలాంటి అనుమానస్పద ఆధారాలు లభించలేదని తెలిపింది.ఇరాన్ దివంగత అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలీకాప్టర్ ప్రమాదంపై ఆ దేశ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ తొలి నివేదిక విడుదల చేశారు. ఘటన తర్వాత వివిధ విభాగాలకు చెందిన నిపుణులతో కూలిన దర్యాప్తు బృందం ప్రమాద స్థలానికి చేరుకున్నట్లు నివేదికను ఉటంకిస్తూ తస్నిమ్ వార్తా తెలిపింది. నివేదిక ప్రకారం హెలీకాప్టర్ ముందు నిర్ణయించిన మార్గంలోనే ప్రయాణించింది. ఎక్కడా నిర్దేశిత మార్గాన్ని దాటి వెళ్లలేదు. ప్రమాదం సంభవించడానికి దాదాపు 90 సెకన్ల ముందు కూలిన హెలీకాప్టర్ పైలట్ కాన్వాయ్‌లోని ఇతర రెండు హెలీకాప్టర్లను సంప్రదించారు. మరోవైపు శకలాల్లో బుల్లెట్లు లేదా ఇతర పేలుడుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. కొండను ఢీకొట్టిన తర్వాత హెలీకాప్టర్‌లో మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పొగమంచు, అత్యల్ప ఉష్ణోగ్రత కార ణంగా సహాయక చర్యలు ఆలస్యమయ్యాయి. రాత్రంతా గాలింపు కొనసాగింది. ప్రమాదం జరిగిన ఉదయం 5 గం.కు డ్రోన్‌ల సహాయంతో ఘటన జరిగిన ఖచ్చితమైనప్రదేశం తెలిసింది. అని నివేదికలో పేర్కొన్నారు. హెలీకాప్టర్ సిబ్బంది, వాచ్‌టవర్ మధ్య జరిగిన సంప్రదిం పుల్లో ఎలాంటి అనుమానస్పద సంభాషణలను గుర్తించలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు తర్వాత మిగిలిన విషయాలు వెల్లడిస్తామని నివేదిక వెల్లడించారు.

ఇబ్రహీంరైసీ అంత్యక్రి యలు షియా మతస్థులకు అత్యంత పవిత్రమైన మషహద్ నగరంలో జరిగాయి. మషహద్..రైసీ స్వస్థలం. ఆదివారం జరిగిన హెలీకాప్టర్ ప్రమా దంలో రైసీ,విదేశాంగ మంత్రి హోస్సేన్ అమీర్ అబ్దొల్లాహియన్ సహా మరో ఆరుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే.

## బిభవ్‌కుమార్‌కు నాలుగు రోజుల జ్యుడీషియల్ కస్టడీ



**న్యూఢిల్లీ, మే 24:** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపి స్వాతి మలివాల్ పై దాడి కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్‌కుమార్‌కు తీస్ హాజారీ కోర్టు నాలుగు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి శుక్రవారం ఆదేశించింది. గత శనివారం సిఎం నివాసం నుంచి అరెస్టు చేసిన బిభవ్‌కుమార్‌కు అయిదు రోజుల పోలీసు కస్టడీ విధించగా, అది ఈ రోజుతో ముగిసింది. దీంతో ఆయనను కోర్టు ముందు ఢిల్లీ పోలీసులు హాజరుపరిచారు. సిసిటివి ఫుటేజ్‌ను, డివిఆర్‌ను పదిలపరచాలని కోరుతూ బిభవ్ తరఫు లాయర్ కోర్టులో పిటిషన్ వేశారు. బిభవ్ పిటిషన్‌ను ఢిల్లీ పోలీసులు వ్యతిరేకిస్తూ, విచారణ ఇంకా మొదలుకాలేనందున ఆ డిమాండ్‌లో అర్థం లేదని కోర్టుకు తెలిపింది. కాగా, దీనికి ముందు బిభవ్ కుమార్‌ను ముంబై నుంచి పోలీసులు తిరిగి ఢిల్లీకి తీసుకువచ్చారు. బిభవ్‌కుమార్ తన అరెస్టుకు ముందు ఐఫోన్‌ను ఫార్మెట్ చేశాడనే ఆరోపణలపై ఆయనను ముంబై తీసుకువెళ్లారు. బిభవ్‌కుమార్ తన ఐఫోన్‌లోని డాటాను ముంబైలోని అజ్ఞాతవ్యక్తికి, లేదా ఫోన్‌కు ట్రాన్స్‌ఫర్ చేసి ఆ తర్వాత ఫార్మెట్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేజ్రీవాల్ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న బిభవ్‌కుమార్ ఫోన్లు, ల్యాప్‌టాప్, సిసిటివి రికార్డింగ్‌ను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. దీనికితోడు దాడికి పాల్పడినట్లు చెబుతున్న ప్రదేశానికి బిభవ్‌ను పోలీసులు తీసుకువెళ్లి సుమారు 20 మంది వ్యక్తుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్లు తెలుస్తోంది. అవసరమయితే ముఖ్యమంత్రిని, ఆయన కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేయాలని అనుకుంటున్నారు.

## బంగ్లాదేశ్ ఎంపీ హత్యకేసులో సంచలన నిజాలు



**కోల్‌కతా, మే 24:** బంగ్లాదేశ్ ఎంపీ మహ్మద్ అన్వర్ హత్యకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చికిత్సకోసం బంగ్లాదేశ్ నుంచి కోల్‌కత్తా వచ్చిన ఎంపీ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చిన ఓ వలసదారుడిని కోల్‌కత్తా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ హత్యచేసే క్రమంలో నిందితులు దారుణంగా ప్రవర్తించినట్లు వార్తలు బయటకు వస్తున్నాయి. ఓ మహిళను ఉపయోగించి ఆ ఎంపీని హానీట్రాప్ చేసినట్లు తెలుస్తోంది.అన్వర్ హత్యకేసులో సీసీటీవీ దృశ్యాలు కీలకంగా మారుతున్నాయి.అన్వర్ స్నేహితుడు అయిన కలకత్తా వాసి ప్రస్తుతం అమెరికాలో నివాసముంటున్నాడు. అతడికి కోల్‌కత్తాలోని టౌన్‌హాల్‌లో ఓ అపార్ట్‌మెంట్ ఉంది. అ అపార్ట్‌మెంట్‌లోకి ఇద్దరు పురుషులు, ఒక మహిళతో కలిసి వెళ్లిన అన్వర్ తిరిగి రాలేదు. నిందితులు ఓ మహిళను ఉపయోగించి హానీట్రాప్ చేయించి అన్వర్‌ను అపార్ట్‌మెంట్‌కు తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లినవెంటనే అన్వర్‌ను నిందితులు హత్యచేశారు. హత్య అనంతరం మృతదేహాన్ని మాయం చేసే క్రమంలో నిందితులు దారుణంగా వ్యవహరించారు.'ఎంపి గొంతును నులిమి చంపిన తర్వాత మృతదేహాన్ని ముక్కలుగా నరికారు. చర్మాన్ని వలిచారు. దుర్వాసన రాకుండా శరీర భాగాలకు పసుపురాశారు. కొన్ని భాగాలను ఫ్రిజ్‌లో ఉంచారు. ఇతర భాగాలను పడేసి ఉంటారు.బంగ్లాదేశ్‌నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన జిహాద్ హావల్దార్ ఈ హత్యలో కీలక నిందితుడు అని పోలీసులు తెలిపారు. బంగ్లాదేశ్ సంతతికి చెందిన అమెరికాపౌరుడు అఖ్తర్ జమాన్ సూచన మేరకే తాను ఈ హత్య చేసినట్లు నిందితుడు హావల్దార్ అంగీకరించినట్టు పోలీసులు చెబుతున్నారు.

# 'పోల్' పదనిసలు



శుక్రవారం హిమాచల్ ప్రదేశ్ మండిలో జరిగిన సభలో బిజెపి అభ్యర్థి కంగనా రనౌత్‌తో ప్రధాని మోడీ

## సరిహద్దులను గాలికొదిలేసిన కాంగ్రెస్

### హిమాచల్‌లో ప్రధాని మోడి ఎన్నికల ర్యాలీ



**సిమ్లా, మే 24:** దేశసరిహద్దులను కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో గాలికొదిలేసారని ప్రధానిమోడీ ధ్వజమెత్తారు. శతాధిక వర్షపార్టీ ఇప్పటికీ 21వ శతాబ్దంలోకి రాలేదని కాంగ్రెస్ పార్టీ మొత్తం మహిళా వ్యతిరేక పార్టీ అని హిమాచల్ ఎన్నికల ర్యాలీల్లోమోడీ కాంగ్రెస్‌పై విమర్శల దాడిచేసారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హిమాచల్‌ను అధ్వాన్నస్థితికి చేర్చేందుకే వచ్చిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని సిమ్లా, మండి జిల్లాల్లో మోడీ ర్యాలీ నిర్వహించారు. దేశానికి మోడీ అంటే ఎవరో ఒకప్పుడు తెలియదని, ఇపుడు నేను మీమధ్యన ఉన్నానని, కాలం మారిందని, మోడీలో మాత్రం ఎలాంటి మార్పులు లేవని, హిమాచల్‌తో మోడీ బంధం అలాగే కొనసాగుతోందని ప్రధాని పేర్కొన్నారు. మూడోసారి బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు మీ అందరి ఆశీస్సులు కావాలని ఆయన కోరారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు పోవాలంటే మరోసారి అధికారం ఛాన్స్ ఇవ్వాలని ఆయన కోరారు. మీ ఓట్లను వృధా చేయవద్దని, ఫిర్‌ఏక్‌బార్ మోడీ సర్కార్ అని నినదించాలని కోరారు. హిమాచల్‌కు అంతర్జాతీయ సరిహద్దు ఉన్న రాష్ట్రమని ప్రజలకు ఇక్కడ పటిష్టమైన ప్రభుత్వం అవసరమని గుర్తించారని, ప్రాణాలకు అయినాతెగిస్తాను కానీ హిమాచల్‌ప్రజలకు హాని తలపెట్టనీయబోనని అన్నారు. బలహీన కాంగ్రెస్ ప్రభుత్వం తన హయాంలో ప్రపంచంచుట్టూ తిరిగి బతిమాలుకునే ధోరణితో ఉండేదని, భారత్ ప్రపంచ దేశాల మీదకు ఎందుకు వెళ్లాలని ప్రశ్నించిన మోడీ భారత్ తానే సొంతంగా యుద్ధం చేయగలిగేస్థాయిలో ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన నిధులకంటే రెట్టింపు నిధులు తమ హయాంలో రాష్ట్రానికి ఇచ్చానన్నారు. కొన్ని వందల కిలోమీటర్ల కొత్త రోడ్లు సరిహద్దుల్లో వచ్చాయని, గుర్తుచేసారు. మిలిటరీ సిబ్బంది చిరకాల డిమాండ్ అయినవన్‌ర్యాంక్ వన్‌పెన్షన్ విధానం అమలుకు తెచ్చామన్నారు. ఒఆర్‌ఒపి ద్వారా సుమారు 1.25 లక్షలకోట్లు మన సైనికులకు చెల్లించామన్నారు. అయోధ్య రామమందిరంపై కాంగ్రెస్ వివాదం చేస్తోందని, అలాగే రిజర్వేషన్ల వ్యతిరేకి కాంగ్రెస్ అని అన్నారు. ఎస్సీ ఎస్టీ ఓబిసి రిజర్వేషన్లను పూర్తిగా రద్దుచేసి వాటిని ముస్లింలకు ఇవ్వాలని చూస్తోందని, రామ్ మందిరాన్ని తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తుచేసారు. కాంగ్రెస్ పార్టీ వేర్పాటు రాజకీయాలు చేస్తోందని, ఇప్పటికీ ఆపార్టీ 21వ శతాబ్దంలోకి రాలేకపోతోం దన్నారు. ప్రజలుప్రగతిని కోరుతుంటే కాంగ్రెస్ వ్యతిరేకదిశగా వెళుతోందని అన్నారు. కాంగ్రెస్ రాజకుటుంబం మన సోదరీమణులకు వ్యతిరేకి అని మొత్తం కాంగ్రెస్‌మహిళా వ్యతిరేకిఅని అన్నారు. అక్కచెల్లెళ్లకోసం మిలిటరీ స్కూళ్లు, రక్షణరంగ అకాడమీలను కూడా సడలించామని సాయుధ బలగాల్లో మహిళాశక్తిగడచిన పదేళ్లలో రెట్టింపు అయిందన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ పైల ట్లుగా కూడా మహిళలు వచ్చారని గుర్తు చేసారు. హిమాచల్‌ప్రదేశ్ దేశానికి గర్వకా రణమైన రాష్ట్రమని, ఈ రాష్ట్ర సంస్కృతి వారసత్వ సంపదను తాము పరిరక్షిస్తామని మోడీ హామీ ఇచ్చారు. కాలంచెల్లిన కాంగ్రెస్ సిద్ధాంతాలను వీడాలని, బిజెపికి మద్దతిచ్చి భారీ మెజార్టీతో తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

### ఏడు స్థానాల్లోను ఇండియా కూటమి అభ్యర్థులదే గెలుపు

## ఢిల్లీలో రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, మే 24:** సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీలోని అన్ని స్థానాల్లోను ఇండియా కూటమి విజయం సాధిస్తుందని ఎఐసిసి మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. దిల్‌షాద్ గార్డెన్స్‌లో తూర్పుఢిల్లీనుంచి పోటీచేస్తున్న కన్హయ్యకుమార్ విజయాన్ని కాంక్షిస్తూ మాట్లాడిన రాహుల్ ఈసారి లోక్‌సభ ఎన్నికలు అందరినీ ఆశ్చర్యపరుస్తాయని, ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని, గత ఎన్నికల్లో వలే కాకుండా ఈసారి ఢిల్లీలోని అన్ని స్థానాలను ఇండియా కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తంచేసారు. ఇండియా కూటమికి ఢిల్లీ మొత్తం సానుకూల వాతావరణం ఏర్పడిందని, పూర్తిమెజార్టీతో ఇండియా కూటమి ప్రభుత్వం వస్తుందని అన్నారు. ప్రధాని మోడీ ప్రసంగాలు ఆయన పార్టీ, ఎన్డీయే కూటమి ఓటమిని సూచిస్తోందని అన్నారు. ఢిల్లీలోని ఏడు స్థానాలకు ఆరోవవిడత ఎన్నికల్లో అంటే శనివారం పోలింగ్ జరగనున్నది. గత ఎన్ని కల్లో ఏడుస్థానాలు బిజెపి కైవసంచేసుకోగా ఈసారి కాంగ్రెస్,ఆప్ కలయికలో జరుగుతన్న ఎన్నికల్లో విజయావకాశాలపై రెండుపార్టీలు ఎంతో ధీమాగా ఉన్నాయి.

## నేను జైలు నుంచి పోటీ చేస్తే 70/70 గెలుస్తా

### ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, మే 24:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు తాను జైల్లోనే ఉంటే ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో 70 సీట్లకు 70 గెలుచుకుంటుందని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల వరకు తాను జైల్లోనే ఉంటే తన భార్య పోటీ చేయదని స్పష్టం చేశారు. తాను జైలు నుంచే పోటీ చేస్తానన్నారు. అప్పుడు ఢిల్లీలో అన్ని స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మా ఎమ్మెల్యేలందరినీ జైల్లో పెట్టి ఢిల్లీలో ఓటింగ్‌కు వెళ్లాలన్నారు. ప్రజలు ఏమైనా అమాయకులా? వారు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. ఢిల్లీలో తనను ఓడించలేనని తెలిసే ప్రధాని మోడీ ఢిల్లీ మద్యం కేసులో తనను ఇరికించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ కేసులో ఇరికించి తాను ముఖ్యమంత్రి పదవిని వదులుకోవాలని చూస్తున్నారన్నారు. తనకు అధికార యావ లేదని కానీ తాను రాజీనామా చేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. తనను ఎంతకాలం జైల్లో ఉంచుతారనే దానికి ప్రధాని మోడీ మాత్రమే సమాధానం చెప్పగలరని ఎద్దేవా చేశారు. తాను సిఎం పదవికి రాజీనామా చేస్తే కనుక ఆ తర్వాత మిగిలిన ప్రతిపక్ష ముఖ్యమంత్రులను టార్గెట్ చేస్తారన్నారు.



శుక్రవారం సిర్మౌర్ జిల్లాలోని నాహన్‌లో ప్రధాని మోడీ బహిరంగసభకు హాజరైన బిజెపి కార్యకర్తలు

## ఘనంగా ముగిసిన వేదర్షి అన్నమయ్య సంకీర్తన శిక్షణా శిబిరం



గాజువాక, మే 24,ప్రభాతవార్త

టీటీడీ ఆస్థాన గాయకురాలు గురు కొండవీటి జ్యోతిర్మయి "వేదర్షి అన్నమయ్య సంకీర్తన" శిక్షణా తరగతులు 5 రోజులుగా ఘనంగా జరిగాయి. వడ్లపూడి పునరవాస కాలనీ కణితి గవర వీధి రామాలయ ప్రాంగణంలో జరిగిన ఈ శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి శ్రీ కాపారపు ఫౌండేషన్ అధినేత కాపారపు శివున్నాయుడు ముఖ్యఅతిథిగా, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, బ్రహ్మశ్రీ భాస్కర భట్ల సత్య ప్రసాద్‌శర్మ గౌరవ అతిథులుగా విచ్చేసి 20న జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ యజ్ఞం, మే 24న ముగిసింది. శ్రీ గీతాచార్య భక్తి గీతాంజలి, శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ యజ్ఞంలో వేలాది మంది గాయక గాయనీమణులు, భజన గురువులు, ఆధ్యాత్మిక వేత్తలు, సామాజిక వేత్తలు పాల్గొని అమ్మ ప్రవచనములతో కూడిన సంకీర్తనా ఝురులలో సేదదీరి, ఆనంద లోకాలలో విహరించారు. అనంతరం ఆనంద నృత్యంతో కూడిన అమ్మ భజనతో భక్తులు నృత్యం చేస్తూ ఆనంద పరవశులయ్యారు. డా.పి. హేమలత, అట్లూరి రమేష్, శ్రీమాన్ అద్దంకి రాఘవాచ్యులు, బెండి సత్యం, శీపాన రమేష్ బాబు,దుర్గా ప్రసాద్ పండా, బలిరెడ్డి సత్య నారాయణ, కొల్లా బుచ్చి రాజు గుప్తా, పి.అంజిరెడ్డి, గన్నంరాజు గిరిబాబు, బొడ్డేట వెంకటరావు, అనేక దేవాలయాల కమిటీల పెద్దలు పాల్గొని యజ్ఞం సుసంపన్నం చేశారు. శిక్షణ తరగతులు పూర్తిచేసిన వారికి జ్యోతిర్మయ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేయడం జరిగినది. అనంతరం నిర్వాహకులు గురు కొండవీటి జ్యోతిర్మయిని ఘనంగా సన్మానించారు.

## మూడంచెల భద్రత మధ్య ఈవీఎం స్ట్రాంగ్ రూములు

### నిరంతర పహారా కేంద్ర బలగాలతో భద్రత

పాడేరు,మే24,ప్రభాతవార్త



జాతీయ ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ పాడేరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో మూడంచెల భద్రత మధ్య అరకు పార్లమెంట్ స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతర పహారా కేంద్ర ప్రభుత్వ బలగాలతో భద్రత కల్పించారని బీజేపీ ఆరకు పార్లమెంట్ రిప్రజెంటేటివ్ రవికుమార్ పెనుమాక అన్నారు. శుక్రవారం ఆయన పాడేరు డిప్యూటీ కలెక్టర్ వివిఎస్ శర్మతో కలసి భద్రత ఏర్పాట్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రత కల్పించారని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత మధ్య ఈవిఎం మిషన్లు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు పోలీసులు వలయంలో ఉన్న ఆరకు పార్లమెంట్ ఈవిఎం మిషన్లు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మరో 9 రోజుల పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అవసరం అని అయన అన్నారు.

### జిల్లా కలెక్టర్, ఎస్పీ, రిటర్నింగ్ అధికారి తనిఖీ..

డిగ్రీ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లాకలెక్టర్ ఎం.విజయసునీత జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా,పాడేరు రిటర్నింగ్ అధికారి భావనవశిష్టతో కలిసి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అక్కడ పలు సూచనలు చేశారు. వీరితో డీఆర్ఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ హాల్స్ ఏర్పాట్లు వేగవంతం చేయండి

### అణువణువునా సిసి కెమేరాల నిఘా : జిల్లా కలెక్టర్ విజయ సునీత



పాడేరు,మే24,ప్రభాతవార్త

కౌంటింగ్ హాల్స్ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల ప్రతి రోజు తనిఖీలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాల్స్‌ను పాడేరు రిటర్నింగ్ అధికారి, జేసి భావన వశిష్ట్, ఎస్పి తుహిన్ సిన్హాతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ హాల్స్‌ను సందర్శించి పలు సూచనలు జారీ చేశారు. డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 28- అరకు వ్యాలీ, 29-పాడేరు నియోజక వర్గాల కౌంటింగ్‌కు సంబంధించి అరకు పార్లమెంట్‌లో గల పాడేరు, అరకు సిగ్మెంట్లకు వేరువేరుగా, అసంబ్లీ నియోజకవర్గాలకు వేరువేరుగా ఏర్పాటు చేసిన నాలుగు కౌంటింగ్ హాల్స్ ను పరిశీలించారు. పోలింగ్ ఏజంట్లకు ఏర్పాటు చేస్తున్న ఐరన్ మెస్ పనులు పూర్తి చేసి, సిసి కెమేరాలు వినియోగంలోకి తీసుకు రావాలని, ప్రతి హాలులో 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి ప్రదేశంలోను అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కదలికను సిసికెమేరాలు కేచ్ చేసే విధంగా కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు అవకాశం లేని విధంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటికే సంబంధిత అధికారులందరికీ కౌంటింగ్‌పై అవగాహన కల్పించామని, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, మైక్రో అబ్జర్వర్లను కేటాయించి శిక్షణలు ఇస్తున్నామని, వారికి పూర్తి అవగాహన కల్పించి కౌంటింగ్‌లో ఖచ్చితత్వాని, పారదర్శకత్వాని పాటిస్తామని కలెక్టర్ చెప్పారు. అదేవిధంగా కౌంటింగ్ జరిగే కళాశాల ప్రాంతం బహిరంగ రహదారి ఉన్నందున మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న భవనంలో మీడియా కేంద్రం ఏర్పాటుకు రూములను పరిశీలించి తగు సూచ నలు జారీ చేశారు. ఎస్పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల భద్రతకు 75మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామని, రంపచోడవరం కేంద్రం వద్ద డిఎస్పి ర్యాంకు అధికారి పర్య వేక్షిస్తున్నారని తెలిపారు. కౌంటింగ్‌కు మూడంచెల సెక్యూరిటీ ఏర్పాటు చేశామని, స్థానిక పోలీసు, ఎపిఎస్పితో బాటు కేంద్ర పోలీసు వ్యవస్థ ఉంటుందని ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించి లోనికి పంపించటం జరుగుతుందని, మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ డివైస్‌లు లోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. నిరంతరం వాహన తనిఖీలు కూడా చేయడం జరుగుతుం దన్నారు. అంతకు ముందు పాడేరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జేసి భావన వశిష్ట్, అరకు వ్యాలీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ వేరువేరుగా స్ట్రాంగ్ రూములను సందర్శించి లాగ్ బుక్‌లో సంతకాలు చేశారు. డిఆర్ఓ బి.పద్మావతి, గిరిజన సంక్షేమ ఇఇ డివిఆర్ ఎం.రాజు, డిఇఇ అనుదీప్, స్థానిక తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, డిపిఆర్ఒ పి.గోవింద రాజులు పాల్గొన్నారు.

## వ్యవసాయ ఉత్పత్తులపై సాంకేతిక శిక్షణ..

నక్కపల్లి, మే 24, ప్రభాతవార్త



పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న వ్యవసాయ ఉద్యాన సహాయకులకు పంటల ఉత్పత్తి సాంకేతికపై శిక్షణ కార్యక్రమం నక్కపల్లిలో నిర్వహించి పలు ఉత్పత్తులపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు బి.మోహన్‌రావు మాట్లాడుతూ ఖరీఫ్ సన్నద్ధంపై వీఎఎ, విహెచ్ఎలకు దిశా నిర్దేశం చేశారు. ఖరీఫ్‌లో వివిధ పంటల రకాల ఎంపిక, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో పచ్చి రొట్ట ఎరువు అందుబాటులో ఉన్నాయని వాటిని రైతులు వినియోగించుకునేల రైతులకు రిజిస్ట్రేషన్ చేయించాలని నియమిత పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమప్రసాద్ తెలిపారు. మాకవరపాలెం వ్యవసాయ అధికారి చిరంజీవి రావు మాట్లాడుతూ కొత్త రకాల వరివిత్తనాలు మార్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సస్య సేద్య శాస్త్రవేత్త డా.ప్రసాద్ రావు, ఖరీఫ్ పంటలలో అధిక దిగుబడికి తీసుకోవాల్సిన రకాల ఎంపిక, నారు మడి యాజమాన్యం, వరిలో తక్కువ ఖర్చుతో సాగు విధానాలు, కలుపు యాజమాన్యంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు ఆది నారాయణ, ఉమా ప్రసాద్, సరోజినీ, చిరంజీవిరావు, గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.



**పాయకరావుపేట నియోజకవర్గం అడ్డురోడ్డు కేంద్రంలో శుక్రవారం జరిగిన శాంతి భద్రతల పరిరక్షణ అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా ఎస్పీ కే.మురళీకృష్ణ ఘనంగా సత్కరించిన నర్సీపట్నం డివిజన్ పోలీస్ అధికారి మోహన్, ఆయనతోపాటు సిఐలు అంబటి విజయకుమార్, జి.అప్పన్న, బి.అప్పలరాజులు ఉన్న దృశ్యం. (నక్కపల్లి, ప్రభాతవార్త)**

## ప్రతి అడుగు శాంతియుతంగా నడవాలి... నడిపించాలి...

### పల్లె వాతావరణాన్ని పాడు చేయవద్దు -రాజకీయ పార్టీల అవగాహన సదస్సులో జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

నక్కపల్లి/ఎస్.రాయవరం, మే 24, ప్రభాతవార్త



గ్రామాల్లో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు స్నేహపూర్వకమైన వాతావరణంలో నడుచుకుంటూ శాంతియుతమైన వాతావరణాన్ని నెలకొల్పే విషయంలో మనం అడుగులు వేయడమే కాకుండా ఇతరులను కూడా అడుగులేసే విధంగా ప్రోత్సహించాలని ఆ దశలో అవగాహన పరచాలని అప్పుడే పల్లెల్లో శాంతియుతమైన వాతావరణం నెలకొల్పిన వాళ్లమవుతామని జిల్లా ఎస్పీ కే.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సాయంత్రం ఇస్రాయవరం మండలం అడ్డు రోడ్డులో జరిగిన శాంతి భద్రతల పరిరక్షణ అవగా హన సదస్సులో ఆయన మాట్లాడారు. భావోద్యోగాలను నియంత్రణ చేసుకోక పోవడం వల్లే సమస్యలు తలెత్తుతాయని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి గల కారణం ప్రజలందరూ సహకరించబట్టి ప్రశాంతంగా నిర్వహించగలిగామని ఈ సందర్భంగా ప్రజలకు, ఓటర్లకు, రాజకీయ పార్టీలకు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి కృషి చేసిన మీ అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించబట్టే రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా పోలింగ్ జరిగిన జిల్లాల్లో అనకాపల్లి కూడా ఉండటం సంతోషకర విషయ మన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో ఎన్నికల కోడ్ కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిన విషయమేనని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కమిషన్ నియమనిబంధన లోబడి ప్రతి ఒక్కరు వ్యవహరించాలని కోరారు. ఎన్నికల ఫలితాలు వచ్చే లోపల జిల్లా అంతట శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. జూన్ 4న అనకాపల్లిలో జరిగే కౌంటింగ్ పక్రియకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, దీని విషయంలో కఠినమైన నిబంధనలు ఉన్నాయని అన్నారు. కార్యకర్తలు ర్యాలీగా కౌంటింగ్ కేంద్రం వద్దకు రాకూడదని అదేవిధంగా అనుమతి లేకుండా గ్రామాల్లో ఎటువంటి ర్యాలీలు ప్రదర్శనలు చేయడానికి వీలులేదని ప్రధానంగా బాణాసంచా కాల్చకూడదని ఈ నిబంధనలకు కట్టుబడి పోలీసులకు సహకరించాలని ఏమాత్రం ఉల్లంఘించిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. పోలింగ్ విషయంలో ఏ విధంగా అందరి సహకారం అందించారు. ఆ విధంగా కౌంటింగ్ విషయంలో స్నేహపూర్వకమైన వాతావరణం అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసుకొని శాంతి యుతంగా ముందుకు నడవాలని అప్పుడే పోలింగ్లో జిల్లా ఎటువంటి పేరు వచ్చిందో తదుపరి కూడా ఆ విధంగా పేరు రావాలని అందుకు అందరు సహకారం అందించాలని ఎస్పీ కోరారు. ఇప్పటికే జిల్లాలో అన్ని పెట్రోల్ బంకుల్లో లూజుగా పెట్రోల్ అమ్మకాలు నిషేధించామని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు ఆలోచించాలని అన్నారు. 144 సెక్షన్‌ను దృష్టిలో పెట్టుకొని శాంతి భద్రతల పరిరక్షణ కోసం మాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకారాన్ని అందించాలన్నారు. కౌంటింగ్‌కు ఎంపికైన ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్లు నియమ నిబంధనలకు లోబడి జిల్లా కలెక్టర్ సూచనల మేరకు కౌంటింగ్ కేంద్రంలో మొబైల్ ఫోన్‌తోపాటు వాచీలు, ఎలక్ట్రానికల్‌కు సంబంధించిన ఎటువంటి పరికరాలు తీసుకుని రాకూడదని, కౌంటింగ్ కొచ్చే ఏజెంట్లకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అందరూ సహకరించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రాలకు ఏజెంట్లు తప్ప ఆయా అభ్యర్థులు తప్ప ఏ ఒక్కరు రాకూడదని ప్రధానంగా ర్యాలీలతో రాకూడదని సూచించారు ఎన్నికలు పోలింగ్ విషయంలో ఏ విధమైన శాంతియుతమైన వాతావరణంలో సహకరించారు. ఆ విధంగానే కౌంటింగ్ విషయంలో కూడా సహకరించాలని ఎక్కడ కూడా హిం సాత్మకమైన రీతిలో వ్యవహరించవద్దని అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. నిబంధ నలను పాటించకుండా హింసను ప్రోత్సాహించిన వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా ఎన్నికల విషయంలో జూన్ 1న వచ్చే ఎగ్జిట్ పోల్ వచ్చినప్పుడు కూడా సమన్వయంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యవహరించాలని కోరారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో శాంతియుతమైన వాతావరణ నెలకొల్పే టట్లు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇదే కాకుండా ప్రత్యేక మైన నిఘాతో పనిచేస్తున్నామని అన్నారు. ఇటువంటి నియమ నిబంధనలు అనుసరించాలని ప్రజలకు రాజకీయ పార్టీ ప్రతినిధులు తెలియజేసి వారిని అవగాహన పరచి పోలీసులకు సహకరించాలని ఎస్పి మురళీకృష్ణ కోరారు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ భావోద్వేగాలకు పోకుండా కులమతాలకు అతీతంగా ముందడుగు వేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎక్కడ కూడా గుంపులు గుంపులుగా ఏ ఒక్కరు ఉండకూడదని ఎటువంటి కార్యకర్త లకు పాల్పడవద్దని ఎస్పీ కోరారు ప్రజలందరూ సహ కరిస్తే అనకాపల్లి జిల్లాకు మంచి పేరు వస్తుందని, ఇప్పటివరకు ఏ విధమైన శాంతియుతమైన వాతా వరణ జిల్లాలో ఉందో అదే వాతావరణాన్ని కౌంటింగ్ అనంతరం కూడా కొనసాగేటట్లు ప్రతి ఒక్కరు సహకరించాలని, శాంతి సామరస్యానికి మారుపేరుగా అనకాపల్లి జిల్లాను తీర్చిదిద్దారని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం డిఎస్పి మోహన్, పాయకరావుపేట నియోజకవర్గ సర్కిల్ ఇన్స్పెక్టర్లు జి. అప్పన్న, అంబటి విజయకుమార్, బి. అప్పలరాజు, ఎస్సైలు విభూషణరావు, జోగారావుతో పాటు కోటవురట్ల ఎస్సైలు పాల్గొనగా రాజకీయ పార్టీ ప్రతినిధులు బోడపాటి శివ దత్తు, కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను, లంక సూరిబాబు, కురందాసు నూకరాజు, గింజల లక్ష్మణరావు, వి.జనార్ధన్, కందుల వెంకటేశ్వరరావు, కోన అప్పలరాజు, కురందాసు అప్పలరాజు, వీసం రాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శ్రీరామచంద్రరాజు, కొప్పిశెట్టి కొండబాబు, వెల్లగా శ్రీనివాస రావు, వంగలపూడి గోవిందు, సర్పంచ్ కర్రీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## కౌంటింగ్ కేంద్రం వద్ద బాధ్యతగా వ్యవహరించాలి : ఆర్ఓ గీతాంజలి



నక్కపల్లి, మే 24,ప్రభాతవార్త

పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఎంపికైన సిబ్బంది ఆయా పనులు విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని ఎక్కడ నిర్లక్ష్యం వహించవద్దని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కే.గీతాంజలి సూచించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎంపికైన వీఆర్వోలు ఇతర సిబ్బందికి అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎటువంటి బాధ్యతలు తీసుకోవాలి ఏ విధంగా వ్యవహరించాలి అనేది క్షుణ్ణంగా వివరించారు. ఈవీఎంల వద్ద బాధ్యత వ్యవహరించాలని ఏ ఒక్కరు నిర్లక్ష్యంగా ఉన్న చర్యలు తప్పు అని హెచ్చరించారు. ఈ సమావేశంలో తాసిల్దార్లు శ్రీకాంత్ జానకి, రమణారావు, సూర్యనారాయణ, ఎండివోలు వి.శ్రీనివాసరావుతో పాటు పాయకరావుపేట ఎండిఓ ఎన్నికల డిటి చైనలు, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ కన్నబాబు, సర్వేర్ మూర్తి తదితరులు ఉన్నారు.

## తృటిలో తప్పిన ఘోర ప్రమాదం...

### ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణీకులు



నక్కపల్లి, మే 24, ప్రభాతవార్త

మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం తృటిలో తప్పింది. పోలీసుల అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం నుంచి గుంటూరు వైపు 32 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్ వెళుతుండగా బస్సు ముందు భాగంలో వెళుతున్న వ్యాన్ సడన్ బ్రేక్ వేయడం వలన దానిని తప్పించే ప్రయత్నంలో చాకచక్యంగా బస్ డ్రైవర్ ప్రయత్నించగా వెనుక నుంచి వస్తున్న లారీ బస్సును ఢీ కొట్టింది. ఆ పరిస్థి తుల్లో బస్సు ముందు భాగం పూర్తిస్థాయిలో దెబ్బతినిగా ఇరువురు మహిళలకు తప్ప ఏ ఒక్కరికి ఎటు వంటి ప్రమాదం జరగలేదు. బస్సులో ఉన్న ప్రయాణీకులు ఎవరికి వారు వారి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని వారు వెళ్లాల్సిన ప్రదేశానికి బయలుదేరి వెళ్లారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించకపోతే పెద్ద ప్రమాదం సంభవించి ఉండేది. నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేయి చేయాల్సి ఉంది.

కొండదొర కులస్తులను ప్రభుత్వ వెబ్సైట్ నుండి తొలగించడం దుర్మార్గం

## సచివాలయ ఏపి-సేవ పోర్టల్ నుండి కొండదొర కులస్తులను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

### ఆదివాసీ గిరిజన సంఘం




అరకులోయ, మే 24, ప్రభాతవార్త

కొండ ధర కులస్తులను ప్రభుత్వ వెబ్ సైట్ నుండి తొలగించడం దుర్మార్గమని, దీనిని ఆదివాసి గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ తెలి పారు. శుక్రవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు జి.బుజ్జిబాబు పి.రామన్న సుంకరమెట్ల సర్పంచ్ చినబాబు, మాజీ ఎంపిటిసి బురిడీ దశరథ్‌లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత మూడు నెలల క్రింతమే ప్రభుత్వం కొండదొర కులస్తులను వెబ్సైట్ నుండి తొలగించడంతో కుల ధృవీకరణ పత్రం పొందుటకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాలలో, కళాశాలలో, ఇతర అవసరాల నిమిత్తం కుల ధృవీకరణ పత్రం తప్పనిసరి కావడంతో విధ్యార్థులు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా రనీ, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి ఇబ్బందులు ఎదురవ్వడం జరుగుతుందనీ మండిపడ్డారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఎస్టి కొండదొర తెగను చేర్పించి వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా గిరిజన కులాలను ప్రభుత్వ వెబ్‌సైట్ నుండి తొలగించా రని గత మూడు నెలల నుంచి వెబ్‌సైట్‌లో చేర్పించకపోవడం అన్యాయం అని చెప్పారు. తక్షణమే సచివాలయ ఏపీ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఎస్టీ కొండ దొర తెగలను పునరుద్ధరణ చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## గిరిజన గురుకుల కళాశాలలో సీట్లు పెంచి రెండవ కౌన్సిలింగ్ నిర్వహించాలి

### పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వినతి



పాడేరు, మే24, ప్రభాతవార్త

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో గిరిజన గురుకుల కళాశాలలో సీట్లు పెంచాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ వినతిపత్రం అందజేశామని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు అంగనైని ఆనంద్ తెలిపారు. ఈ సందర్భం గా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు అంగనైని ఆనంద్ మాట్లాడుతూ 2024-2025 విద్య సంవత్సరం సంబంధించి గురుకుల కళాశాలలో ప్రవేశం కొరకు బాలురు 1793 మంది అప్లై చేసుకోగ 800 మంది విద్యార్థులకే ప్రవేశం కల్పించడం జరిగిందని, బాలికలు 2496 మంది విద్యార్థులు అప్లై చేసుకోగ 450 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పించడం జరిగిందని అప్లై చేసుకోగా సీటు రాని విద్యార్థులు 3039 మంది విద్యార్థులు ఉన్నారని వారిని దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రూప్‌కి 30 సీట్లు చొప్పున పెంచి రెండవ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరామన్నారు. అలాగే బాలికలకు మరో రెండు నూతన గురుకుల కళాశాలలు ఏర్పాటు చేసే విధంగా పై ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పివోని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు గంపరాయి సుబ్బు, కె.సిసింద్రీ, శివశంకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని వినతి

నర్సీపట్నం, మే 24, ప్రభాతవార్త



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు. శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విషయమై విద్యాశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ క్రీడా మైదానాలపై దృష్టిసారించి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని పిల్లల చదువులకే కాకుండా పిల్లల పాఠశాలల్లో ఉన్న డ్రిల్ వీరుడ్ను ఆటపాటలకే కేటాయించాలన్నారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలు ఇంటి వద్ద చదువులే స్కూల్లోనే చదువులే అంటున్నారు తప్ప పిల్లలకు ఆటపాటల్లో క్రీడా రంగాలలో, డ్రాయింగ్ పిరుడు కంప్యూటర్ ప్రతీ స్కూల్లో క్రమం తప్పకుండా అమలు చేయాలని, పాఠశాలలో రాను రాను డ్రిల్ పిరుడను ఆటపాటలను అక్రమం గా అమలు చేయడం లేదన్నారు. కావున విద్యాశాఖ వారు పిల్లల చదువుతో పాటు వారి ఆరోగ్యం పట్ల క్రీడాకారులుగా తీర్చిదిద్దవలసిన అవసరముంద న్నారు. పిల్లలకు ఆటపాటల వలన ఆరోగ్యం కూడా దృఢంగా తయారై ఉత్సాహవంతులుగా ఉంటారన్నారు. ట్రేడ్ యూనియన్ నాయకులు సత్యప్రసాద్, కావు సంఘం మండల అధ్యక్షులు ఇన్నం రమణ, కాపు సంఘం కార్యదర్శి బంటు శ్రీనివాసరావు, కాపు సంఘం అధ్యక్షులు పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

## వార్త కథనాలపై కదిలిన అధికార యంత్రాంగం

### తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవు

నక్కపల్లి, మే 24, ప్రభాతవార్త



మండలంలోని చిన్నదొడ్డుగల్లు కొత్తూరు సమీపంలో జరిగిన మట్టి తవ్వకాలపై వచ్చిన వార్తా కథనాలు అనుసరించి అధికార యంత్రాంగం కదిలారు. శుక్రవారం ఆ గ్రామ విఆర్ఓ మూర్తితో కలిసి అనకాపల్లి నుంచి వచ్చిన మైనింగ్ అధికారులు త్రవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. దీనిపై తవ్వకాలు జరిపిన యజమానికి నోటీసులు అందజేస్తామని తదుపరి చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారులు తెలిపారు. మండలంలోని ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలలో త్రవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తప్పు అని హెచ్చరించారు.

## ఆపరేషన్ కంబోడియా సక్సెస్

### కంబోడియా గ్యాంగ్ చేతుల్లో చిక్కుకున్న బాధితులకు విముక్తి -విశాఖ చేరుకున్న కంబోడియా బాధితులు -బాధితులను రిసీవ్ చేసుకున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్ -ఏజెంట్లపై చర్యలకు సిద్ధం

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

సైబర్ నేరాల బారిన పడి కంబోడియాలో చిక్కుకున్న భారతీయులను రక్షించేందుకు చేపట్టిన ఆపరేషన్ కంబోడియా సక్సెస్ అయ్యింది. ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా అనేక మంది కంబోడియాకి వెళ్లి సైబర్ గ్యాంగ్ ఉచ్చులో చిక్కుకున్నారు. వీరిలో విశాఖ బాధితులు కూడా ఉన్నారు. వారిలో విశాఖకు చెందిన బొత్స శంకర్ అనే వ్యక్తి అక్కడి నుండి తప్పించుకొని వచ్చి పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ కు ఫిర్యాదు చేయడంతో డొంక కదిలింది. దీంతో విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి హ్యూమన్ ట్రాఫికింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం ఈ వ్యవహారాన్ని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు వెలుగులోకి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన భారత ఎంబసీ అధికారులు ఆపరేషన్ కంబోడియా చేపట్టారు. 420 మంది భారతీయులు సైబర్ నేరాల బారిన పడ్డారని గుర్తించారు. 360 మందిని కంబోడియా పోలీసుల చెర నుంచి సురక్షితంగా కాపాడారు. దీంతో కంబోడియా బాధితులు సురక్షితంగా భారత్‌కు చేరుకుంటున్నారు. తాజాగా విశాఖకు చెందిన కొందరు బాధితులు ఎయిర్ ఇండియా విమానంలో స్వరాష్ట్రానికి చేరుకున్నారు. విశాఖ ఎయిర్ పోర్టులో వీరికి సీపీ రవిశంకర్ అయ్యనార్ స్వాగతం పలికారు. మొదటి దశలో వివిధ విమానాల ద్వారా 58 మంది బాధితులు స్వదేశానికి చేరుకోనున్నారు. కాగా కంబోడియాలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఉన్నాయంటూ, మంచి వేతనం అందజేస్తామని గాజువాకకు చెందిన రాజేశ్ విజయ్ కుమార్ సోషల్ మీడియా ద్వారా ప్రకటనలిచ్చారు. దీంతో రాష్ట్రానికి చెందిన 150 మంది నిరుద్యోగులు ఈ ఉద్యోగాలకు అప్లై చేశారు. ఒక్కొక్కరు లక్షన్నర చెల్లించారు. వీరిని బ్యాంకాక్, సింగపూర్ మీదుగా కంబోడియాకు తరలించారు. అయితే వీరందరిన్ని నెలకు టూరిస్ట్ వీసా చేయించి ఓ గ్యాంగ్ చైనా ముఠాకు అమ్ముకున్నారు. ఒక్కొక్కరిని రూ.2,500 నుంచి రూ.4 వేల అమెరికన్ డాలర్లకు చైనా కంపెనీలు కొనుగోలు చేశాయి. అయితే వీరి నుంచి తప్పించుకున్న విశాఖకు చెందిన బొత్స శంకర్ అనే వ్యక్తి విశాఖ పోలీసులకు ఫిర్యాదు.చేశారు. దీంతో హ్యూమన్ ట్రాఫికింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. హ్యూమన్ ట్రాఫికింగ్ కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఎన్.ఐ.ఎలో ఉన్న అనుభవంతో దర్యాప్తు వేగవంతం : సీపీ రవిశంకర్

డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షన్నర వరకు సొమ్ములు తీసుకుని కంబోడియాకు తీసుకెళ్లిన యువకులను ఇండియన్ ఎంబసీ సమన్వయంతో విశాఖకు తీసుకొచ్చినట్లు విశాఖ పోలీస్ కమిషనర్ రవి శంకర్ అయ్యనార్ అన్నారు. శుక్రవారం కంబోడియా బాధితులు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు.. వీరిని సీపీ రవిశంకర్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఇక్కడి నుండి కంబోడియాకు వెళ్లిన వారిని చైనా వారికి అప్పగించారనీ, వీరి ద్వారా ఇండియాలో సైబర్ క్రైమ్ కు పాల్పడేలా చేశారుని తెలిపారు. ఒక్క సైబర్ క్రైమ్ ద్వారా విశాఖలో రూ.120 కోట్లు పోయాయన్నారు. గురువారం ఒక్కరోజే రూ.3.20 కోట్లు దోచేశారనీ, 20 మందితో 7 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని అంశాల మీద క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తామన్నారు. యువకులను డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం అని చెప్పి తీసుకుని వెళ్లారని చెప్పారు. ఇండియన్‌లను మోసం చేస్తేనే ఆహారం, టార్కెట్ రీచ్ అయితే పార్టీలు ఇచ్చేవారంట అని సీపీ పేర్కొన్నారు. టార్గెట్ రీచ్ కాకపోయాన మోసాలు సరిగ్గా చెయ్యకపోయిన బేస్ బాల్ బ్యాట్లతో బాధితులను కొట్టారన్నారు. ఎన్ఐఏలో పని చేసిన అనుభవం కేస్ దర్యాప్తునకు సహాయపడిందన్నారు. బాధితులు ఆరు నెలలు నుంచి కంబోడియాలో ఉన్నారని తెలిపారు. మన రాష్ట్రం నుంచి 1500 పైగా బాధితులు లెక్క తేలిందన్నారు. కంబోడియా ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చక్కగా పని చేశాయన్నారు. ఈ తరహా బాధితులు ఇంకా ఎవ్వరైనా ఉన్నారా అని విచారణ జరుపుతున్నామని అన్నారు. ఈ ముఠా వెనుక ఉన్న చైనా గ్యాంగ్‌ను పట్టుకుంటామని సీపీ తెలిపారు.

### అసలేం జరిగిందంటే...

గాజువాక ప్రాంతానికి చెందిన కన్సల్టెన్సీ ఏజెంట్ చుక్కా రాజేష్ (32) 2013 నుంచి 2019 వరకు గల్ఫ్ దేశాల్లో ఫైర్ సేఫ్టీ అండ్ ప్రికాషన్ మేనేజర్‌గా పనిచేశాడు. ఆ తరువాత విశాఖలోనే ఉంటూ గల్ఫ్ దేశాలకు ఫైర్ సేఫ్టీ ఉద్యోగాలకు మానవవనరులను సరఫరా చేసేవాడు. 2023 మార్చిలో కాంబోడియా నుంచి సంతోష్ అనే వ్యక్తి ఫోన్ చేసి, కాంబోడియాలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయడానికి 30 మందిని పంపాలని రాజేష్‌ను కోరాడు. ఆసక్తి చూపే వారి నుంచి ఫ్లైట్ టికెట్లు, వీసా, ఇతర ఖర్చుల కోసం రూ.1.5 లక్షల వంతున తీసుకోవాలని, అందులో కొంత కమిషన్‌గా ఇస్తామని ఆశ చూపాడు. రాజేష్ అందుకు అంగీకరించి సోషల్ మీడియా ద్వారా విదేశాల్లో డేటా ఎంట్రీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలు ఇచ్చాడు. నిజమని నమ్మిన 27 మంది నిరుద్యోగులు రూ.1.5లక్షల వంతున కట్టారు. రాజేష్ వారిని కంబోడియా ఏజెంట్ సంతోష్‌కు అప్పగించాడు. ఇలా మూడు దఫాలుగా నిరుద్యోగులకు కాంబోడియాకు పంపించాడు. కొద్ది రోజులకు ఆర్య అనే పేరుతో ఒక మహిళ రాజేష్‌కు ఫోన్ చేసింది. సంతోష్ కంటే ఎక్కువ కమిషన్ ఇస్తానని తమకూ మానవవనరులను సరఫరా చేయాలని కోరింది. ఇలా రాజేష్ సంతోష్, ఆర్య, ఉమా మహేష్, హబీబ్ అనే ఏజెంట్ల ద్వారా 150 మంది నిరుద్యోగులను కంబోడియాకు పంపించాడు. ఒప్పందం అనంతరం వారిని కాంబోడియాలోనే ఈ ముఠా ఒక చీకటి గదిలో బంధించింది. ఫెడెక్స్, టాస్కగేమ్స్, ట్రేడింగ్‌తో పాటు అనేక ఆన్‌లైన్ స్కాములు చేయాలని నిరుద్యోగులను బలవంతం చేసింది. ఈ స్కామ్స్ ఎలా చేయాలో వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. అక్రమాలకు పాల్పడబోమని మొండికేసిన వారికి తిండి పెట్టకుండా చిత్ర హింసలకు గురి చేసింది. సైబర్ నేరాలు చేసిన వారికి వచ్చిన డబ్బులో ఒక శాతం కమిషన్‌గా ఇస్తూ 99శాతం చైనా గ్యాంగ్ దోచుకునేది. అక్కడ ఉత్సాహంగా పనిచేసేందుకు అదే కాంపౌండ్‌లో పలు రకాల పబ్, క్యాసినో గేమ్స్, మద్యం, జూదంతో పాటు వ్యభిచారం వంటి సదుపాయాలను ఈ ముఠా కల్పించింది. అక్కడ సంపాదించిన డబ్బు అక్కడే ఖర్చు చేసేలా చేసేది.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
శనివారం, 25 మే, 2024 

## స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు రూ.3.110 కోట్ల ఆర్థిక సాయం చేయండి

- కేంద్రాన్ని కోరిన ఎంపి జివిఎల్ నరసింహారావు



8లో

## గోడలపై పోస్టర్లు అతికిస్తే చర్యలు

జివిఎంసీ చీఫ్ సిటి ప్లానర్ సురేష్ కుమార్



8లో

# ఆపరేషన్ కంబోడియా సక్సెస్

- అక్కడి గ్యాంగ్ చేతుల్లో చిక్కుకున్న బాధితులకు విముక్తి - విశాఖకు చేరుకున్న బాధితులు... రిసీవ్ చేసుకున్న సిపి రవిశంకర్ అయ్యన్నార్



6లో



## స్ట్రాంగ్ రూమ్‌లు , కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్ మల్లిఖార్జున్



8లో

## నేడు జిల్లా వ్యాప్తంగా డిప్యూటీ డిఈవో పరీక్ష

ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్



విశాఖపట్నం,మే 24 ప్రభాతవార్త

ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ డిఈవో పరీక్ష శనివారం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరుగుతుందని మొత్తం 4,498 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. ఉదయం9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా రెవన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం ఆయన - మిగతా 8లో

## కౌంటింగ్ సిబ్బందికి తొలివిడత ర్యాండమైజేషన్



8లో

## అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టేది?



8లో

- చక్రం తిప్పుతున్న ప్లానింగ్ శాఖ సెక్రటరీలు
- నోటీసులతో సరిపెడుతున్న వైనం
- తర్వాత మళ్లీ యథావిధిగా నిర్మాణాలు
- కింది స్థాయి నుంచే పై స్థాయి వరకు పంపకాలు..?

## మళ్లీ కరోనా మహమ్మారి భయం

- ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలి : డాక్టర్ కె.సురేంద్ర



విశాఖపట్నం,మే 24 ప్రభాతవార్త

కరోనా మహమ్మారి విజృంభించకుండా తగుచర్యలు తీసుకోవాలని క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.సురేంద్ర తెలిపారు. ఇప్పటికే సింగపూర్‌లో కొంత అధికంగానే ఉందనే వార్తలు కూడా వస్తున్నాయని, మన దేశంలో కూడా కొన్ని కేసులు వచ్చినట్లు తెలుస్తుందని తెలిపారు. అయితే ప్రతీ ఒక్కరూ గతంలో కరోనాను దృష్టిలో ఉంచుకొని ప్రతీఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జలుబు, దగ్గు ఉన్నవారికి కొంత దూరంగా ఉండాలని ఎప్పటికప్పుడు సబ్బుతో చేతులు కడుక్కుంటూ ఉండాలని చెప్పారు. తీవ్రమైన జలుబు ఉన్నవాళ్లు కూడా జాగ్రత్తలు పాటిస్తూ మాస్కులు వాడాలని - మిగతా 8లో

## పాడేరు పట్టణంలో కుండపోత వర్షం

- స్థంభించిన జనజీవనం- రోడ్లు, కాల్వలపై నుంచి ప్రవహించిన నీరు



8లో

## పిల్లల కళ్లెదుటే తల్లి దుర్మరణం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కంటైనర్ .. వెల్లంకి వద్ద రోడ్డు ప్రమాదం




8లో

## 57 వాహనాలు సీజ్

- అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు తనిఖీల్లో భాగంగా..
- వెల్లడించిన దేవరాపల్లి పోలీసులు



10లో

## రాష్ట్రాలను అప్రమత్తం చేసిన ఐఎండీ

- బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం - ఏపీలో తేలికపాటి వర్షాలు
- ఈశాన్యదిశగా పయనిస్తూ ఏపీ తీరానికి దూరంగా కదులుతోంది



8లో

## పల్లె వాతావరణాన్ని పాడు చేయొద్దు

- రాజకీయ పార్టీల అవగాహన సదస్సులో ఎస్పి మురళీకృష్ణ



12లో

## చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండ్




10లో

- చిన్నపాటి వర్షానికే ఏఎల్‌పురం ఆవరణంతా బురదమయం
- ప్రయాణికులకు తప్పని అవస్థలు.. పట్టించుకోని అధికారులు

## స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ భద్రత

అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత.. ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి తనిఖీ



6లో

# స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు సాయం చేయండి

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

స్టీల్ ప్లాంట్ రినెల్ ఆర్థిక సహాయం కోసం పార్లమెంట్లో , వెలుపల తన ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తున్న సీనియర్ బిజెపీ నాయకులు జీవీఎల్ నరసింహారావు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి డాక్టర్ టివి సోమనాధన్‌ను ఢిల్లీలో కలిసి రినెల్ పనితీరుపై వివరణాత్మక సమీక్షను చేపట్టి ప్రభుత్వానికి తగిన సిఫార్సుల కోసం గల వివిధ అవకాశాలపై చర్చ జరిగింది. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని అత్యంత సీనియర్ అధికారిగా ఆర్ఐఎన్ఎల్ కు ఆర్థిక సహాయం కోసం కేంద్ర మంత్రివర్గానికి సిఫార్సులు చేయడంలో ఆర్థిక కార్యదర్శి టి వి సోమనాధన్ ది చాలా ముఖ్యమైన పాత్రగా ఉండబోతుంది. ఆర్థిక శాఖ కార్యదర్శికి సమర్పించిన లేఖలో జీవీఎల్ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ గత కొన్ని నెలలుగా ఆర్ఐఎన్ఎల్‌కు వెలుపలి , కంపెనీ నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల చాలా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉందని 30వేలు మంది ఉద్యోగులు మొత్తం ఒక లక్ష కుటుంబాలు రినెల్ మనుగడపై ఆధారపడి ఉన్నాయనీ అందువలన ఈ విలువైన జాతీయ సంస్థను రక్షించడం కూడా చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. రినెల్ గురించి తన పార్లమెంటులో వెలుపల తాను పలు ప్రయత్నాలు చేశానని పేర్కొంటూ ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి రినెల్ కు రూ. 3,110 కోట్ల సహాయాన్ని జీవీఎల్ కేంద్ర ఆర్థిక కార్యదర్శి ని కోరారు.ప్రస్తుతం రినెల్ యొక్క అధీకృత వాటా మూలధనం రూ. 8,000 కోట్లు అని మిగిలిన రూ. 3,110కోట్లను ప్రిఫరెన్స్ యల్ షేర్ల రూపంలో అందించడం ద్వారా ఆర్ఐఎస్ఎన్ఎల్ కు సానుకూల నికర విలువలను తిరిగి పొందేందుకు సహాయం చేయవచ్చు అని జీవీఎల్ పేర్కొన్నారు. ఆర్ఐఎన్ఎల్ నికర విలువను మెరుగుపరచడానికి ఆర్ఐఎన్ఎల్ కు భూమి యాజమాన్యాన్ని బదలాయించడం ఆర్ఐఎన్ఎన్ఎల్ వివిధ ఇతర వనరుల ద్వారా ఆదనంగా రూ.4వేల కోట్లను సమకూర్చుకునేందుకు అనుమతించడం గురించి కూడా చర్చించినట్లు సమావేశం అనంతరం తెలిపారు. అటువంటి సమగ్ర ప్రతిపాదనలు రినెల్‌ని మళ్లీ ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి సహాయపడతాయిని జీవీఎల్ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలన్నింటిని సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ హామీ ఇచ్చారని జీవీఎల్ తెలిపారు.

# పాడేరు పట్టణంలో కుండపోత వర్షం



పాడేరు,మే24,ప్రభాతవార్త:

పాడేరు పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించుకుపోయింది. ఈదురుగాలులు వీస్తూ ఉరుములు మెరుపులతో సుమారు రెండు గంటలకు పైగా భారీ వర్షం కురిసింది. ఇదిలా ఉండగా పాడేరు కేంద్రంలో శుక్రవారం వారపు సంత కావడంతో సంత రోడ్డు ప్రక్కన ఉన్న వ్యాపార లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి.కుండపోత వర్షంతో పట్టణంలో ఉన్న రహదారులన్నీ జలమయం అయ్యాయి.వారపు సంత కావడంతో పాడేరు పాతబస్టాండ్ నుంచి మొదలు కొని మెయిన్ రోడ్డు జిసిసి కార్యాలయం వరకూ రోడ్డుకు ఇరువైపులా వేసిన దుకాణాలన్నీ కుండపోత వర్షానికి జలమయం అయ్యాయి.చిరువ్యాపారులు వర్షానికి ఎక్కడ తలదాచుకోవాలో తెలియక దుకాణంలో ఉన్న సరుకులను విడిచి వెళ్లలేక తడుస్తూనే ఉండిపోయారు.వర్షపు నీరు ప్రవాహంలో కొన్ని దుకాణాలు మునిగిపోయి కొంత మేరకు కూరగాయలు,కొన్నిసరుకులు కొట్టుకు పోయాయి.కుండపోత వర్షంతో డ్రైనేజీలు,రహదారులపై నుంచి వర్షపు నీరు ప్రవహించింది.పాడేరు పట్టణంలో ఎండలు తీవ్రతతో కొట్టుమిట్టాడుతున్న పట్టణ ప్రజలకు ఈ వర్షం ఊరటను కలిగించింది.కుండపోత వర్షంతో ఒక్కసారిగా పాడేరు చల్లటి వాతావరణంగా మారింది.సుమారు రెండు గంటలకు పైగా కురిసిన కుండపోత వర్షానికి పంట పొలాల్లోకి వర్షపు నీటితో నిండాయి.ఏదిఏమైనా పాడేరులో కురిసిన కుండపోత వర్షంతో జనజీవనం స్థంభించుకుపోయింది.

# రాష్ట్రాలను అప్రమత్తం చేసిన ఐఎండీ

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈశాన్య దిశగా పయనిస్తూ ఏపీ తీరానికి దూరంగా కదులుతోంది ఇది గురువారం తీవ్ర అల్పపీడనంగా బలపడింది శుక్రవారం ఉదయానికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశముంది. అనంతరం ఈశాన్య దిశగా కదులుతూ శనివారం ఉదయానికి తూరుప మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా బలపడనుంది. తర్వాత ఉత్తర దిశగా పయనించి పశ్చిమ బెంగాల్ బంగ్లాదేశ్ తీరాలకు చేరువై ఆదివారం సాయంత్రానికి తీవ్ర తుఫానుగా మ మారుతుంది అది సోమవారాల్లో పశ్చిమ బెంగాల్ ఉత్తర ఒడిశా, మిజోరం , త్రిపుర మణిపూర్ రాష్ట్రాల్లో ని పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ ఐఎండి పేర్కొంది.ఏపీ సహ పశ్చిమ బెంగాల్ ఒడిశా తమిళనాడు పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి మినహా భారీ వర్షాలకు అవకాశం లేదని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారిణి సునంద తెలిపారు. మరోవైపు అరేబియా సముద్రంలో కేరళ తీరానికి సమీపంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగళాఖాతంలో అల్పపీడనం కారణంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి గురువారం అరేబియా సముద్రం మాల్దీవులు సహ పరిసర ప్రాంతాలకు విస్తరించాయి. ఈనెలాఖరుకు కేరళను తాకుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

# పిల్లల కళ్లెదుటే తల్లి దుర్మరణం

ఆనందపురం, మే 24, ప్రభాతవార్త:

పదో తరగతి ఉత్తీర్ణ రాలైన కుమార్తెను కళాశాలలో చేర్పించి ఉన్నత చదువులు చదివించాలని ఆ తల్లి ఆశ పడింది. ఆ మేరకు కుమారుడును తోడు తీసుకొని కుమార్తెను కళాశాలలో చేర్పించడానికి ఎంతో ఉత్సాహంతో ద్విచక్ర వాహనంపై బయలు దేరింది. కాగా ఆశ తీరకుండానే ఆ తల్లి రోడ్డు ప్రమాదంలో తనువు చలించింది. కళ్లెదుటే తల్లి మృత్యువాత పడడంతో ఆ పసి హృదయాలు తల్లడిల్లి పోయాయి. ఆనంపురం మండలంలోని వెల్లంకి వద్ద శుక్రవారం జరిగిన విషాద సంఘటన ఇది. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం గనివాడ గ్రామానికి చెందిన చావల్ల నవ్య చిన్న దంపతులు చేపల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారికి రాజు యూన్సీ అనే ఇద్దరు పిల్లలు కలరు అందులో యూన్సీ ఇటీవల పదవ తరగతి ఉత్తీర్ణరాలయింది ఆమెను ఉన్నత చదవులు చదివించాలని తల్లిదండ్రులు భావించారు. ఈ మేరకు శుక్రవారం ద్విచక్ర వాహనంపై నవ్యతోపాటు రాజు, యూన్సీ ఆనందపురం బయలుదేని వచ్చారు. అక్కడ కళాశాల పనిని పూర్తిచేసుకుని తిరిగి తమ గ్రామానికి వెళ్లడానికి విజయన గరం వైపు ద్విచక్ర వాహనంపై బయలుదేరి వెళ్తున్నారు. వారి వాహనం వెల్లంకి వద్దగల గోకార్డుకు సమీపానికి చేరుకునే సరికి వెనుక వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీ బలంగా ఢీ కోట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడిపోవడంతో నవ్యపై నుంచి కంటైనర్ లారీ వెళ్లిపోయింది దీంతో నవ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈసంఘటనలో యూన్సీ సురక్షితంగా బయటప డగా స్వల్ప గాయాలైన రాజుని తగరపువలసలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స కోసం పోలీసులు చేర్పించారు. సంఘటనా స్థలానికి ఎస్సై శివ చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వా సుపత్రికి తరలించి కేసును నమోదు చేసి సీఐ టీవీ తిరుపతిరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా కళ్ల ఎదుటే తల్లి అకాలంగా మృతిచెందడంతో పిల్లలు రోధిస్తున్న తీరు వర్ణనాతీతంగా ఉంది.

# మళ్లీ పడగెత్తనున్న కరోనా మహమ్మారి

7వ పేజీ తరువాయి..

చెప్పారు. జలుబు, దగ్గు, తీవ్రజ్వరం, కడుపునొప్పి లాంటివి అశ్రద్ధ చేయకుండా తక్షణమే డాక్టర్‌ను సంప్రదించి తగిన మందులు వాడాలని కోరారు. ఆరోగ్యంలో మార్పులు వచ్చిన వారు క్వారెంటేన్‌లో ఉండటం మంచిదన్నారు. కోవిడ్ కెపి 1 అండ్ 2 (సింగపూర్) ఇటీవల కోవిడ్ 19 కేసుల పెరుగుదల కారణమైన ఎఫ్ఎల్ఐఆర్‌లు దేశంలోని అనేక రాష్ట్రాలలో ఇప్పటికే గుర్తిం చారని తెలిపారు. గత వారంలో సింగపూర్ మంత్రిత్వ శాఖ అంచనా వేసిన కేసుల సంఖ్య( మే5 నుంచి 11 వరకు) పెరిగిన వారు ఆసుపత్రిలో చేరడంతో 25,900కి రెటింపు అయ్యాయని తెలిపారు. 60 ఏళ్ల పై బడిన వారు దీర్ఘకాలిక ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీ వ్యాధులు వంటి హైరిస్క్ జనాభా సమూహాలు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ప్రతీ ఒక్కరు తిరిగి మాస్కులు ధరించాలని ఆయన కోరారు. హ్యాండ్ శానిటైజర్ వంటి అవసరమైన కోవిడ్ జాగ్రత్తలు తీసుకోండి అని చెప్పారు. భయపడాల్సిన అవసరం అంతగా లేదని ఏదైనా సందేహం ఉంటే తమ దగ్గరలో ఉన్న పల్మనాలిజిస్ట్‌ని సంప్రదించాలని కోరారు.

# స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాఖపట్నం,మే 24 ప్రభాతవార్త

ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను ,కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పోలీసు కమిషనర్ డా.ఎ.రవిశంకర్ ,జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ లతో కలిసి పార్లమెంటు ,అసెంబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేసిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీకెమెరాల పనితీరు మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జున్04 వతేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సబంధించి జరుగుతున్న ఏర్పాట్లును పరిశీలించారు. ఎన్నికల కమిషన్ విబంధనలు మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మీడియా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. ఆయా నియోజవర్గాల ఆర్వోలు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కౌంటింగ్ సిబ్బందికి తొలి విడత ర్యాండమైజేషన్

విశాఖపట్నం,మే 24 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయి న నేపథ్యంలో జున్4 తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా.ఎ.మ ల్లికార్జున నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వీసీ హాలులో జాయి ంట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ ,వీఎంఆర్డీఏ జేసీ, ఎన్ఐసీ అధికారులతో కలిసి శుక్రవారం ఉదయం తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిని చేశారు. విశాఖ పార్లమెంటు, అసెంబ్లీ నియోజవర్గాల ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు పర్యవేక్షించేందుకు గాను కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్ వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు కలిపి 997 మంది అవసరం కాగా రిజర్వ్ సిబ్బందిని కూడా కేటాయిస్తూ మొత్తం 1,022 మందికి సబంధించి ర్యాండమైజేషన్ నిర్వహించారు. వారిలో కౌంటింగ్ సూపర్ వైజర్లు 312 మంది ఉండగా కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లు 357 మంది మైక్రో అజ్జర్వర్లు 328 మంది ఉన్నారు.

# 1227 రోజులకు చేరిన స్టీల్‌ప్లాంట్ ఉద్యమం



జగదాంబ, మే 24,ప్రభాతవార్త

స్టీల్‌ప్లాంట్ ఉద్యమం జివిఎంసి ఎదురుగా ప్రారంభించి 1227 రోజుల అయ్యింది. శుక్ర వారం సిఐటియు జగదాంబ జోన్ కె.నర్సి ంగరావు అధ్యక్షతన వై.రాజు ఆధ్వర్యంలో దీక్ష జరిగింది. జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ మోండి వైఖరికి ఇదే తార్కాణం. దేశానికి ఆదాయాన్ని తీసుకువచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను వారి అన్యాయాలకు హేయమైన చర్యఅని దేశద్రోహం అని ప్రజా సంఘాలు, కార్మికులు గొంతెత్తి మాట్లాడిన ప్రభుత్వాలు చలించకపోవడం ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీకి వత్తాసు పలకడం ఆం ధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసినట్టే అని తెలియచేసారు. పి.ఆదినారాయణ (బాబా) సిహెచ్.నాగరాజు, దాసరి అప్పారావు (రైల్వేస్టేషన్) కె.కలుదాస్,పి.రవికుమార్,కె.మోహనరావు, జి.పైడిరాజు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా నేడు డిప్యూటీ డీఈవో పరీక్ష

7వ పేజీ తరువాయి..

ఛాంబర్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షను నిర్వహించాలని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించాలని ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ,విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేందుకు పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని ఎలక్ట్రానిక్ పరికరానలు తీసుకురాకుడదని సమావేశంలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు. సమావేశంలో ఎగ్జామినేషన్ సూపరిటెం డెంట్ రవి.ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు లైజన్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఎగ్జామినేషన్ సూపరింటెండెంట్ రవి, ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు లైజన్ అధికారులు పాల్గొన్నారు.

# నగరంలో గోడలపై పోస్టర్లు అతికిస్తే చర్యలు తప్పవు

## జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్



(విశాఖపట్నం - ప్రభాతవార్త)

అతి సుందర నగరంగా కీర్తించబడుతున్న మహా విశాఖ నగరంలో నగర గోడలపై, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై, రోడ్డు విభాగినిలపై, డస్ట్ బిన్నులపై, ప్రజా ఆస్తులపై పోస్టర్లు అతికించినా, పెయిం టింగ్‌లు, ఇతర వ్రాతలు వ్రాసినట్లయితే, సంబంధిత సంస్థలు, ఆర్గనైజేషన్‌లపై ప్రజా ఆస్తులకు భంగం వాటిల్లుతున్న దృష్ట్యా జీవీఎంసీ తగుచర్యలు చేపడుతుందని జీవీఎంసి చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో విశాఖ నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ సభ్యులు, మత సంబంధ సంస్థలు, ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సభ్యులతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం విశాఖ నగరాన్ని సుందర నగరంగా, పరిశుభ్ర నగరంగా ఇతర నగరాలకు సూచిస్తుందని, విశాఖ నగరానికి నిత్యం సందర్శకు లు, పర్యాటకులు సందర్శిస్తున్నారని, జీవీఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చించి నగర సుందరీకరణ పనులను చేపట్టి నగరాన్ని ఆకర్షణీయంగా జీవీఎంసీ తీర్చిదిద్దుతోందన్నారు. నగరంలో పలువురు విచ్చలవిడిగా గోడలపై, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై, రోడ్డు విభాగినిలపై, డస్ట్ బిన్నులపై, ప్రజా ఆస్తులపై వ్యాపార సంబంధిత, మత సంబంధిత, వినోద సంబంధిత సంస్థలు పోస్టర్లు అతికిస్తూ, పెయింటింగులు, రాతలు వ్రాసి, అనధికారిక హోర్డింగులు, ఫ్లెక్సీలు, డిజిటల్ బ్యానర్లతో నగరాన్ని అశుభ్రపరుస్తున్నారన్నారు. నగరంలో ఎలక్ట్రికల్ ఫోల్స్‌పై సెప్టిక్ క్లీనర్ ఫోన్ నెంబర్లు అసహ్యంగా రాసి ఉంటున్నాయని వాటిని నిరోధించవలసిన అవసరం ఉందన్నారు. 1997 యాక్ట్ ప్రకారం నగర సుంద రీకరణకు ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం 1 లక్ష రూపాయలు వరకు జరిమానా విధించబడునని సిసిపి తెలిపారు. నగరంలో వ్యాపార, విందు, వినోద, మత సంబంధిత ప్రకటనలకు, ప్రచారాలకు ప్రత్యామ్నాయంగా ఎఫ్ఎం రేడియోలు, కేబుల్ టీవీలు, ప్రైవేట్ ఏజెన్సీల హోర్డింగులు, సినీ స్లైడ్స్, వార్తాపత్రికలు, సోషల్ మీడియా ద్వారా ప్రకటన లను చేసుకునేందుకే ఈ అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగిందని సిసిపి తెలిపారు.విశాఖ నగర పరిశుభ్రత, సుందరీకరణ దృష్ట్యా, తమ వంతు బాధ్యతగా ప్రింటింగ్ ప్రెస్ ఆర్గనైజేషన్స్, విద్యాసంస్థలు, మతపరమైన సంస్థలు, ఇతర వ్యాపార సంస్థల యాజమాన్యాలు ఇటువంటి పోస్టర్లు అతికించకుండా వ్రాతలు వ్రాయడం, అనధికారిక హోర్డింగ్లు, బేనర్లు ప్రదర్శించకుండా విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని సిసిపి వారికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పోస్టర్లు ప్రింట్ చేసేవారు వారి ఫోన్ నెంబర్లు సంస్థ పేర్లు తప్పనిసరిగా పోస్టర్లో పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో సిపి దొర, డిసిపి పద్మజ, డిసిపిలు ఎసిపిలు, టిపిఒలు, వార్డు ప్లానింగు సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# అద్భుతమైన ఎత్నిక్, సాంప్రదాయ ప్రింట్స్ ఎక్స్ పో

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త



హ్యాండ్ లూమ్ ఇండియా ఎక్స్ పో వారు విశాఖపట్నంలోని హోటల్ గ్రీన్ పార్క్, వాల్తేరు మెయిన్ రోడ్ నందు మే నెల 24 వతేదీ నుంచి 28వ తేదీ వరకు 5 రోజులు పాటు పలు రంగులు, డిజైన్స్ వస్త్రాలు, ఉపకరణాలు విస్తృత శ్రేణిలో ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దీనిని షాపర్స్ పాలిట ప్యారడైజ్ అనటంలో అతిశయోక్తి లేదు. ఈ ఎక్స్ పో నందు షాపర్స్ తమకు కావలసిన వివిధ రకాల చీరలు, సల్వార్లు, టాప్స్, లెనిన్‌తో సహా సంస్కృతి సంప్రదాయతలను ప్రతిబిం బించు వస్త్రాలను కొనుగోలు చేయవచ్చును. ఈ ఎక్స్ పో నందలి విభిన్న స్టాల్స్ వద్ద విస్తృతమైన అద్దకం, ప్రింటెడ్, లేదా ఎంబ్రాయిడరీ, పోచంపల్లి కలంకారి చీరలు నుండి సాంప్రదాయ కోల్‌కతా లేదా భాగల్‌పూరి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్, బనారస్ పట్టు చీరలు వగైరా వంటివి ప్రతి ఒక్కరికి అవసరమైన ఏదో ఒకటి ఈ ప్రదర్శనలో మీకు లభిస్తుంది. రేషం పల్లూతో నేసిన మట్కా సిల్క్ బైలూమ్ చీరలుగా పేరొం దినవి పశ్చిమ బెంగాల్ కళాత్మకతను ప్రదర్శిస్తాయి. అలాగే విభిన్నమైన స్టయిల్ నకు ప్రాధాన్యతను ఇచ్చేవారి కోసం మల్బరీ సిల్క్ లేదా చందేరి చీరలు పాట్లీ పల్లూ, కలంకారి ప్రింట్స్‌లో మధ్యప్రదేశ్ వారి స్టాల్స్‌లో లభిస్తాయి. సాంప్రదాయతను ఇష్టపడే వారి కోసం పోచంపల్లి కాటన్, ఉప్పాడ, వెంకటగిరి పట్టుచీరలు అలాగే కాంచీపురం నుండి వచ్చిన బంగారు లేదా వెండి జరీ చీరలు ఈ ఎక్స్ పో నందు అందుబాటులో ఉంచారు. జైపూర్ నుంచి దుపట్టాలు, సల్వార్ మెటీరియల్, కుర్తీలు, రాజస్థాన్ నుండి కోటా డోరియా, ఉత్తరప్రదేశ్ నుండి బనారస్ జమదాని, జమావార్, చికాన్ ఇంకా అనేకం ఈ ప్రదర్శన లో చోటుచేసుకున్నాయి. కాశ్మీర్ షాల్స్, స్టోల్స్, బంధేజ్, బంధాని వస్త్రాలు కూడ ప్రత్యేకతను కోరు కునే వారి కోసం ఇక్కడ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో ఇంటికి కావలసిన బెడ్ షీట్లు, రాజస్థాన్ తలపాగాలు ఆకర్షణీయ రంగులలో లభిస్తాయి. ఈ ప్రదర్శనలో పురుషులు కోసం ప్రత్యేకంగా కాటన్ షర్టులు అందుబాటులో ఉంచామని, ఈ ప్రదర్శన ఈనెల 28వ తేదీ వరకు ప్రతి రోజూ ఉ.11గం. నుంచి రా.9గం. వరకు ఉంటుందని, చెల్లింపులు కోసం అన్ని రకాల యుపిఐ, డెబిట్, క్రెడిట్ కార్డులు స్వీకరిస్తామని, దేశం నలుమూలలు నుండి తెచ్చిన విభిన్న సంస్కృతి సాంప్రదా యాలను ప్రతిబింబించు అన్ని రకాల వస్త్రాలను ఒకేచోట సందర్శించి తమకు నచ్చినవి కొనుగోలు చేయవలసినదిగా నిర్వాహకులు కోరుచున్నారు.

# నక్కపల్లిలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

నక్కపల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త



నక్కపల్లి సత్యసాయి భజన మండలి ఆధ్వ ర్యంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణం లో గల స్వామి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మజ్జిగ చలివేంద్రాన్ని శుక్ర వారం ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన ఈ మజ్జిగ చలివేంద్రం కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కక్కిరాల సురేష్ ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతి రహదారిపై వెళ్లే ప్రయాణీకులకు ఈ మజ్జిగ చలివేంద్రం ఎంతో ఉపయోగపడింది. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు నున్న విశ్వేశ్వర రావు, కొత్త రాము, నవర నూకరాజు శర్మ, నున్న కాశీ విశ్వనాథ్, బండారు రాజేశ్వరరావు తోపాటు ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కొత్త సందీప్‌లు, అకేటి ఈశ్వరరావు ఉన్నారు.

**అక్రమ కట్టడాలు, అనుమతులు లేని నిర్మాణాలకు మహా విశాఖ నగర పాలక సంస్థ యంత్రాంగం అండ మెండుగా ఉంటోంది. టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. వీరికి తోడు కొందరు ప్లానింగ్ సెక్రటరీలు కుమ్మక్కై అనుమతులు లేకుండా భవన నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతుంటే అధికారులకు కాసుల వర్షం కురుస్తోంది.**

# అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టేది..!

విశాఖపట్నం -ప్రభాతవార్త

మహా విశాఖనగరంలో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ చక్రం తిప్పుతున్నారు. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. తర్వాత మళ్లీ యధావిధిగా నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలోని ముఖ్యంగా జోన్-2 పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు పెరుగుతుంది. కొందరు అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు అవినీతికి చిరునామాగా తయారయ్యారు. ప్లానింగ్ అప్రూవల్ చేయడానికి మొదలు అదనపు అంతస్తులు కట్టేంత వరకు సదరు అవినీతి ఉద్యోగులు అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నట్లు అందరికి తెలిసిన బహిరంగ సత్యమే. జోన్-2 పరిధిలోని 39వ సచివాలయ పరిది కొమ్మాది దగ్గర రిక్షా కాలనీలో భారీ ఎత్తున అక్రమ నిర్మాణం జరుగుతుంది. దాదాపు 2 వేల గజాల విస్తీర్ణంలో జరుగుతున్న ఈ నిర్మాణం వెనుక పెద్ద అవినీతే దాగి ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నిర్మాణం జరుగుతున్న స్థలంలో సగకి పైనే ప్రభుత్వ స్థలం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి తాము కొనుగోలు చేసుకుని నిర్మాణం చేస్తున్నట్లు సదరు భూమి యజమాని చెప్పడం పలు సందేహాలను రేకెత్తిస్తుంది. జీవీఎంసీకి చెల్లించాల్సిన భారీ పన్నును కూడా ఎగ్గొట్టినట్టు ప్రచారం జరుగుతుంది. సుమారు కోటి రూపాయలు పన్ను రూపంలో జీవీఎంసీకి చెల్లించాల్సి ఉండగా సగం మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. తద్వారా జీవీఎంసీ ఆదాయానికి గండి పడినట్టే అవుతుందని ప్రజలు అంటున్నారు. ఇకపోతే జీవీఎంసీ 6వ వార్డు, కార్ షెడ్ ప్రాంతంలో జాతీయ రహదారికి ఆనుకుని ఓ కమర్షియల్ నిర్మాణం జరిగింది. ఓటైల్స్ షోరూంకు సంబంధించిన షాపులను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. దీనికి గాను సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లానింగ్ సెక్రటరీలకు భారీ ఎత్తున ముడుపులు అందినట్లు ప్రచారం జరుగుతుంది. లేకపోతే కళ్లకు కట్టినట్టుగా అక్రమ నిర్మాణం జరిగినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడమే నిదర్శనమని అందరూ అంటున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే జోన్-2లో ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. అలాగే రూరల్ తహశీల్దార్ కార్యాలయంకి ఎదురుగా ఇందిరా నగర్, భూమాత వెనుక ఒక అక్రమ నిర్మాణం జరుగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా అదనపు ఫ్లోర్ నిర్మిస్తున్నారు. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అక్రమ నిర్మాణాలకు నోటీసులతో సరి!**

అక్రమ నిర్మాణ నోటీసులు అభాసుపాలవుతున్నాయి. టౌన్ సిబ్బంది అక్రమ నిర్మాణాలు జరిగే చోటుకి వెళ్లి... సదరు నిర్మాణానికి సంబంధించిన యజమానికి కాకుండా గోడలకు, బేస్‌మెంట్లను, షెడ్లకు నోటీసులు అంటించి వస్తున్నారు. నగరంలోని దాదాపు అన్ని జోన్లలో ఇదే పరిస్థితి ముఖ్యంగా జోన్-2 పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలు చక్రం తిప్పుతున్నారు. అందిన కాడికి దండుకొంటూ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోన్-2 పరిధిలోని 6వ వార్డులో ఒ అక్రమ నిర్మాణానికి సదరు టౌన్ ప్లానింగ్ అధికారులు అండగా నిలబడడం ఆశ్చర్యం కలిగిస్తుందని స్థానికులు అంటున్నారు. టీడీఆర్ చెల్లించకుండానే అదనపు ఫ్లోర్స్ నిర్మించడం జోన్-2 అధికారుల అవినీతికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి. సద్రూ అక్రమ నిర్మాణానికి తూతూ మంత్రంగా నోటీసులు జారీ చేశారే తప్ప చర్యలు మాత్రం తీసుకోలేదు. అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాల్సిన టౌన్ ప్లానింగ్ ఏసిపి శాస్త్రి అలాగే టీపిఓ వరప్రసాద్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ చీఫ్ సిటి ప్లానర్ సురేష్ కుమార్ జోన్-2లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రశాంత వాతావరణంలోఓట్ల లెక్కింపు ప్రక్రియ

## అభ్యర్థులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త



ప్రశాంతతకు మారుపేరైన విశాఖపట్నం జిల్లాలో సార్వత్రిక ఎన్నికల-2024 పోలింగ్ ప్రక్రియ సజావుగా శాంతియుత వాతావరణంలో జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ.మలికార్జున పేర్కొన్నారు. దీనికి అన్ని వర్గాల ప్రజలు, నాయ కులు, అభ్యర్థులు పూర్తిస్థాయిలో సహకరించారని గుర్తు చేశారు. ఇదే విధమైన సహకారాన్ని కౌంటిగ్‌ప్రక్రియ నిర్వహణలో కూడా అందించాలని అభ్యర్థులను జిల్లా కలెక్టర్ కోరారు. అందరి సహకారంతో జూన్4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు యంత్రాంగం తరపున పటిష్ట ఏర్పాటుల చేస్తున్నామని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, కౌంటింగ్ ప్రక్రియ తదితర అంశాలపై చర్చించే నిమిత్తం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పోటీ చేసిన అభ్యర్థులతో శుక్రవారం ఉదయం ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాల్లో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై మాట్లాడారు.

**పోస్టల్ బ్యాలెట్లతో కలిపి జిల్లాలో 71.2 శాతం, పార్లమెంటులో 72.3 శాతం పోలింగ్...**

విశాఖపట్నం జిల్లా ఓటర్లు గతం కంటే ఈ సారి మరింత ఉత్సాహం కనబరిచారని, తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 20,12,373 మంది ఓటర్లు ఉండగా, 14,09,316 (70.03 శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని మరొక 23,981 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 71.2 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 19,27,303 మంది ఓటర్లు ఉండగా 13,70,484 (71.11) మంది ఓటు వేశారని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 22,454 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో మొత్తం 72.3 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు.

**31వ తేదీ లోగా కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు అందించాలి...**

జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాజకీయ పార్టీల నుంచి భాగస్వామ్యం కానున్న కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను ఈ నెల 31వ తేదీ లోగా నిర్ణీత నమూనాలు అందజేయాలని కలెక్టర్ సూచించారు. 18సం.లు దాటిన వారిని మాత్రమే రిఫర్ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థలు, కార్పొరేషన్లు ఇతర మార్గాల ద్వారా ఆదాయం పొందుతున్న వారు ఏజెంట్లుగా ఉండేందుకు వీలు కాదని, ఆ మేరకు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ వివరాలను సమర్పించాలని అభ్యర్థులకు సూచించారు. అధికారికంగా గుర్తింపు పొంది, ఐటి కార్డులు పొందిన ఏజె ంట్లకు లెక్కింపు ప్రారంభం కావడానికి గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు.

**జూన్ 2న స్ట్రాంగ్ రూముకు సర్వీస్ పోస్టల్ బ్యాలెట్లు తరలింపు..**

ఉద్యోగులు, ఇతరులు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్లను ఇప్పటికే గుర్తించిన స్ట్రాంగ్ రూములో భద్రపరిచామని, సర్వీసు ఓటర్ల నుంచి పోస్టల్ ద్వారా వస్తున్న ఓట్లను ఆయా ఆర్వోల పరిధిలో భద్రపరుస్తున్నామని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జూన్ 2న అభ్యర్థుల సమక్షంలో మెయిన్ స్ట్రాంగ్ రూములకు వాటిని తరలిస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ జరుగుతుందని అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఉదయం 8గం. నుంచి కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కింపు**

ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని ఈఈఈ బ్లాక్ సెమినార్ హాలులో, తొలి అంతస్తు రూం నెం.4లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. భీమిలీ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ న్యూక్లాస్ రూం కాంప్లెక్సులో గ్రౌండ్ ఫ్లోర్ రూం నెం5లో అక్కడ పోలైన పార్లమెంటు ఓట్ల లెక్కింపు అదే బిల్డింగ్ రూంనెం.7లో జరుగుతుందన్నారు. తూర్పు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ న్యూక్లాస్ రూం కాంప్లెక్సులోని మొదటి అంతస్తు రూం నెం.9లో, పార్లమెంటు ఓట్ల లెక్కింపు రూం. నెం 10లో జరుగుతుందని పేర్కొన్నారు. దక్షిణ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కంప్యూటర్ సైన్స్ బ్లాక్‌లో ఈ క్లాస్ రూంలో, పార్లమెంటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ అదే బ్లాక్‌లోని కంప్యూటర్ ఆర్గనైజేషన్, అండ్ ఆర్కిటెక్చరల్ ఎంబైడెడ్ సిస్టం ఐఓటి ల్యాబ్‌లోని మొదటి అంతస్తు రూం. నెం.2లో జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఉత్తర నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ న్యూక్లాస్ రూం కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తు రూం.నెం.1లో పార్లమెంటు ఓట్ల లెక్కింపు అదే బిల్డింగ్‌లోని మొదటి అంతస్తు రూం నెం.5 లో నిర్వహిస్తామని వెల్లడించారు. పశ్చిమ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ బ్లాక్ సెమినార్ హాలులో, పార్లమెంటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ అదే బ్లాక్‌లోని రూం నెం.3లో జరుగుతుందన్నారు. గాజువాక నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కెమికల్ ఇంజనీరింగ్ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్ మొదటి అంతస్తులోని డ్రాయింగ్ హాలులో, పార్లమెంటు ఓట్ల లెక్కింపు మొదటి అం తస్తులోని సెమినార్ హాలులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఎస్.కోట నియోజకవర్గ పరిధిలో విశాఖ పార్లమెంటుకు పోలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయనగరం జిల్లాలోని లెండి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# కొండవీటి జ్యోతిర్మయి ఉచిత ధార్మిక సేవలకు విజిజిఎస్ఎస్ అభినందనలు

జగదాంబ, మే 24,ప్రభాతవార్త



భక్తిసంగీత గాయనీ కొండవీటి జ్యోతిర్మయి కి విశాఖ గాయనీ, గాయకుల సాంస్కృతిక సంఘం (విజిజిఎస్ ఎస్) తరుపున భయ్యా శ్రీనివాస్,భూపతి రావు, పట్టం వెంకటేష్, కృష్ణంరాజు, నాంచారయ్య, వెంకట్, యంవి ఆర్ కలిసి జ్యోతిర్మయి చేస్తున్న ఉచిత ధార్మిక సేవలకు, అందరికి ఉచితంగా అన్నమయ్య సంకీర్తనలు నేర్పించి ఆధ్యాత్మిక విశ్లేషణ అందించిన కారణంగా ఆవిడకు ఉడతా భక్తిగా విశాఖ గాయనీ, గాయకుల తరుపున కొంత నగదు అందచేసారు. ఈ ఐదురోజులు తన వంతుకృషి చేసిన దుర్గా పండాకు ఆలయ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు అల్లర్లు ప్రేరేపిస్తే చర్యలు తప్పవు...!

**ఎటపాక సీఐ రామారావు - కూనవరం, విఆర్‌పురం మండలాల - రాజకీయ ప్రముఖులతో ప్రత్యేక సమావేశం**

కూనవరం, మే 24, ప్రభాతవార్త :



ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు కాని అనంతరం గాని రాజకీయ కక్షలతో అల్లర్లు ఎవరైనా ప్రేరేపిస్తే చట్ట ప్రకారం చర్యలు కఠినంగా ఉంటాయని ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.రామారావు అన్నారు. అల్లూరిజిల్లా కూనవరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రోజున కూనవరం, విఆర్‌పురం మండలాల రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఈ రెండు మండలాల పరిధిలో ఎటువంటి ఎన్నికల ఘర్షణలు జరగలేదని, ఇదే శాంతియుత వాతావరణంలో ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు కూడా ఉండాలని ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కూడా అన్నారు.అలాగే విజయోత్సవాలు, ఊరేగింపులు, బాణాసంచా పేల్చడం వంటి వాటిపై నిషేదం ఉన్నదని అందుకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కూనవరం ఎస్సై శ్రీనివాస్, విఆర్‌పురం ఎస్సై నాగరాజు పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నిర్మల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కూనవరం, విఆర్‌పురం మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం, సిపిఎం, జనసేన, బిజెపి తదితర పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పదోతరగతి పాఠ్యపుస్తకాలు సిద్ధం

**28 వేల నోట్‌పుస్తకాలు : మండల విద్యాధికారి టి.సూరయ్యరెడ్డి**

రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార్త




మండల విద్యాశాఖ కార్యాలయానికి పదోతరగతి పాఠ్యపుస్తకాలు వచ్చాయని రాజవొమ్మంగి మండల విద్యాధికారి..2 టి.సూరయ్యరెడ్డి తెలిపారు. సింగిల్ రూళ్ళు, బ్రాడ్‌రూళ్ళు, తెల్ల పేపరు నోట్ పుస్తకాలు, గ్రాప్‌లు కలిపి 28 వేల 858 మంది నోట్‌పుస్తకాలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.పదోతరగతి పది రకాల విభాగాలుగా 5,440 పాఠ్యపుస్తకాలు రాగా వాటిని భద్రపర్చామన్నారు. ఇంకా ఇతర తరగతులు పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో యంఇఒ .2 తూము సూరయ్యరెడ్డి, సిఆర్పీలు శ్రీనివాస్, విష్ణువర్ధన్, ఆదినారాయణరెడ్డి, సతీష్, మంగరాజు, సిబ్బంది సుజాత, ఉష, అటెండర్ ఏసుబాబు పాల్గొన్నారు.

## 20 గ్రామాల్లో దోమలు మందు పిచికారీ పూర్తి

**45 రోజులు పిదప రెండో విడత ప్రారంభం : సబ్‌యూనిట్ ఆఫీసరు చీడిపల్లి ప్రసాద్**




రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార్త

2022..23సం.లో మలేరియా కేసు లు ఎక్కువగా నమోదై ఎంపిక చేసిన 20 గ్రామాల్లో దోమలు మందు పిచికారీ శుక్రవా రంతో పూర్తి అయ్యినట్లురాజవొ మ్మంగి మండల మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసరు చీడిపల్లి ప్రసాద్ తెలిపారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గనోరే, జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, ఏయంఒ శ్రీనివాసరాజు వారి ఉత్వర్డులు ప్రకారం పిచికారీ నిబంధనల ప్రకారం జరిగిందన్నారు. మరలా ఇదే 20 గ్రామాల్లో రెండో విడతదోమలమందు పిచికారీ జరుగుతుందని ప్రసాద్ వెల్లడించారు. మూడు పిహెచ్‌సిల వైద్యులు పిచికారీని నిరంతరం పర్యవేక్షించారని అన్నారు. జెడ్డంగి పిహెచ్‌సి పరిధిలో ఒకుర్తి, బోర్నగూడెం, దుర్గానగర్, పెదరెల్లంగిపాడు, జి.శరభవరం, మారేడుబాక, లాగరాయి పిహెచ్‌సి పరిధిలో మొల్లిమెట్ల, కింద్రకాలనీ, అనంతగిరి, చీడిపాలెం, దోనెలపాలెం, బోనంగిపాలెం, గడుఒకుర్తి, లాగరాయి గ్రామాలు, రాజవొమ్మంగి పిహెచ్‌సిలోగల కొండపల్లి, దాకరాయి, డి.మల్లవరం, తంటికొండ, గింజర్తి, రాజవొమ్మంగి గ్రామాల్లో పిచికారీ అయినట్లు వివరించారు. మూడు పిహెచ్‌సిల పరిధిలో 2,150 గృహాల్లో గల 6,485 గదుల లోపల భాగం పిచికారీ చేయించామని ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 15 తేదీ ఒకుర్తి గ్రామంలో పిచికారీ ప్రారంభమైందని అన్నారు.జూన్ ఒకటో తేదీ నుండి గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో పిచికారీ జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో డా.యామిని ప్రియ, డా.నాగార్జున, డా.సుష్మ, డా.కె.ఉషశ్రీ, డా.నాగార్జున వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## క్షయవ్యాధి బారినపడకుండా 78 మందికి ముందస్తు వ్యాక్సిన్ : డా.కె.ఉషశ్రీ

రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార్త

లాగరాయి పిహెచ్‌సి పరిధిలో గల మూడు సచివాలయాల వద్ద క్షయ వ్యాధి బారినపడకుండా 78 మందికి ముందస్తు వ్యాక్సిన్‌ను వేయడం జరిగిందని డా.కె.ఉషశ్రీ తెలిపారు. ఈకార్యక్రమంలో డా.కె.ఉషశ్రీ, డా.నాగార్జున, సిహెచ్‌ఒ దైవకృపాచార్యులు, ఎఎన్‌ఎమ్‌లు డి.మంగరాజు, కె.వెంకటలక్ష్మి, డి.కృష్ణవేణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## 'ఎన్నికల'నియమావళి అతిక్రమిస్తే చర్యలు..!

**కొయ్యూరు సిఐ పి.వెంకటరమణ, మంపఎస్ఐ లోకేష్‌కుమార్**

కొయ్యూరు, మే24, ప్రభాతవార్త



ఎన్నికల నియమావళి నిబంధనలకు విరుద్ధంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠినచర్యలు తప్పవని కొయ్యూరు సిఐ వెంకటరమణ, మంప ఎస్ఐ లోకేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని రేవళ్లు, ఆర్,కంఠారం గ్రామాల్లో పర్యటించి గ్రామస్థులతో ప్రత్యేకసమావేశాలు నిర్వహించి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ-ఎన్నికల్లో వివిధ ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతుండటంతో ముందస్తు చర్యల్లోభాగంగా 144సెక్షన్ అమల్లో ఉన్నందున జిల్లాఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలమేరకు జూన్4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతిభద్రతల విఘాతం కలగకుండా సహకరించాలని గ్రామస్థులను కోరారు. ఓట్ల లెక్కింపు అనంతరం గెలిచిన అభ్యర్థులకుగాని, వారి మద్దతుదారులకుగాని ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు, మందుగుండు సామాగ్రితో నిర్వహించే సంబరాలకు ఎటువంటి అనుమతి లేదని, అలాగే సభలు, సమావేశాలు నిర్వహణ ఇక కూడా అనుమతిలేదని స్పష్టంచేసారు. అలాగే కౌంటింగ్‌రోజు గ్రామస్థులు పాడేరు వెళ్లడానికి వీల్లేదన్నారు. ఎవరి గ్రామాల్లో వారుండాలని తెలియపరిచారు. ఈ ఆదేశాలు బేఖాతరుచేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠినచర్యలు తప్పవని సిఐ,ఎస్ఐలు హెచ్చరించారు.

## ప్రత్యేకావసరాల చిన్నారులను గుర్తించేందుకే 'సిడబ్ల్యుఎస్ఎన్' సర్వే

**పరిశీలించిన జిల్లాసహితవిద్యా సమన్వయకర్త కొమ్ముభాస్కర్రావు**

కొయ్యూరు, మే24, ప్రభాతవార్త



0-18సం.లలోపు బడిలోచేరని ప్రత్యేకావసరాలుగల విద్యార్థులను గుర్తించి, తదుపరి వారిని బడిలో చేర్పించేదకే సిడబ్ల్యు ఎస్ఎన్ సర్వే లక్ష్యమని జిల్లాసహితవిద్యా సమన్వయకర్త కొమ్ముభాస్కర్రావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మండల ఐఈఆర్‌పి వర్సన్ ఎస్.రాజు, బి.గౌరీశంకర్, చందు గతకొన్నాళలుగా మండలంలోని గ్రామాల్లో సిడబ్ల్యుఎస్ఎన్ సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సర్వేకార్యక్రమాన్ని శుక్రవారం సమన్వయకర్త కొమ్ముభాస్కర్రావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని బూదరాళ్లపంచాయితీ గ్రామంలో బుద్ధిమాంద్యం వైకల్యంగల వెలుసూరికిరణం వివరాలను సేకరించారు. సర్వేజరుగుతున్నతీరుపట్ల ఆయన సంతృప్తి వ్యక్తంచేసారు. మండల లక్ష్యమేలందరూ ఆ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని, ఎటువంటి సందేహం ఉంటే మండల భవితసెంటర్ ఐఈ రిసోర్స్ పర్సన్స్‌ని సంప్రదించాలని ఆయన సూచించారు.

## కరూర్ వైశ్యాబ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

జగదాంబ, మే 24, ప్రభాతవార్త

కరూర్ వైశ్యాబ్యాంక్ (కెవిబి) ఆయోధ్యలో కొత్తశాఖ ప్రారంభించినట్లు బ్యాంక్ చైర్మన్ డా.మీనా హేమచంద్ర ఈ శాఖని ప్రారంభించారు.ఆయోధ్యశాఖ, ఈ బ్యాంకుకు ఉత్తరప్రదేశ్‌లో 7వ శాఖ, అలాగే బ్యాంక్ తాలూకు ఢిల్లీ విభాగంలో 35వ శాఖఅవుతుంది. ఈ సందర్భంగా బ్యాంక్ఎండి.బి.రమేష్‌బాబు మాట్లాడుతూ రిటైల్, వ్యాపార బ్యాంకింగ్ ఉత్పత్తులు, థర్డ్‌పార్టీ ద్వారా ఇన్సూరెన్స్ ఉత్పత్తులతో సహా ఈ శాఖ పూర్తిస్థాయి బ్యాంకింగ్ సర్వీసులు అందిస్తుందని తెలిపారు.ఖాతాదారుల సౌకర్యార్థం ఈ శాఖకు ఒక ఎటిఎం, క్యాష్ డిపాజిట్‌మెషిన్, పాస్‌బుక్ ప్రింటర్లను కూడా ఏర్పాటుచేసామన్నారు.రూ.2024 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ 39కొత్త శాఖలు తెరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు మరో వంద కొత్త శాఖలను తెరవాలని ప్రతిపాదనలు ఉన్నాయన్నారు.

## పాడేరులో టిడిపి, రాష్ట్రంలో కూటమి గెలుపుతథ్యం

**మండల తెలుగుదేశంపార్టీనేతల ధీమా**

కొయ్యూరు, మే24, ప్రభాతవార్త



జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి నిబట్టి పాడేరులో టిడిపి, రాష్ట్రంలో కూటమి గెలుపుతథ్యమని స్పష్టమవుతోందని మండల టిడిపినేతలు గొలిసింగిసత్య నారాయణ, కొర్రరామమూర్తి, వై.వరహాల బాబు, పోటు కూరిస న్యాసిరావు ధీమా వ్యక్తంచేసారు. శుక్రవారం ఇచ్చిన ఒక ప్రక టనలో ఇలా పేర్కొన్నారు. పాడేరు నియో జకవర్గంలో టిడిపికి ఓటేసేందుకు ప్రజలు ఎగబడ్డా రన్నారు. కొయ్యూరు మండలంలో పోలైన 29001ఓట్లలో సుమారు 16వేల ఓట్లు టిడిపికి వస్తాయన్నారు. వైసిపిపాలనపై ప్రజలు విరక్తి కనబర్చినట్టు పోలింగ్‌సరళిబట్టి వ్యక్తమైందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్న ఆశ సామాన్యప్రజల్లో కనిపించిందన్నారు. ఉద్యోగులు సైతం వైసిపిపాలనతో విసిగిపోయి ఉన్నారని తెలిపారు. కౌంటింగ్ జరగడమే తరువాయి టిడిపి,బిజెపి,జనసేన కూటమి అధికారంలోనికి రావడం ఖాయమన్నారు.

## గీతం ప్రవేశ పరీక్ష గ్యాట్ నిర్వహణ

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ ఫార్మశీ ఆర్కిటెక్చర్ మేనేజ్‌మెంట్, సైన్స్, లా నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2024)ను ఆదివారం దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. ప్రవేశపరీక్షలో లభించిన మార్కులు ఆధారంగా వివిధ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు ఈసందర్భంగా రిజిస్ట్రార్ వెల్లడించారు.క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందజేస్తున్నామని తెలిపారు. గీతం విద్యార్థులలో నైపుణ్యం పెంచడ ంతో పాటు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడానికి విదేశీ విద్య అవకాశాలను పెంచుకోవడానికి పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి తగిన శిక్షణ అందించేందుకు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను (జిసిజిసి)ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. కాగా ఈ ఏడాది గీతంలో ప్రవేశాలకు అనూహ్య స్పందన లభించింది.

## యువతను ప్రోత్సహిస్తూ నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఏపీ

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త



యువతలో ఉన్న కళప్రతిభను ప్రోత్సహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా యువతను ప్రోత్సహించే విధంగా నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి కళలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ దిశగా యువతను నడిపించడానికి వారిలోని ప్రతిభను ప్రోత్సహించడానికి తొలి ప్రయత్నంగా దీనిని చేపడుతున్నా మన్నారు. ఫైనల్ కార్యక్రమాన్ని విశాఖలో నిర్వహిస్తామన్నారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు మాట్లాడుతూ ఎంటర్‌టైన్‌మెంట్ క్యాబ్ నెట్ వర్క్స్ సంస్థతో సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు జూనియర్ సీనియర్‌గా రెండు విభాగాలుగా మూడు అంశాలు మ్యూజిక్, డాన్స్ ఆర్ట్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా అన్ని వయసుల వారు ఈకార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎటువంటి ప్రవేశరుసుము లేకుండాఈ అన్ని వయసుల వారు ఈకార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నా మన్నారు.నటుడు షాహిద్ అబ్దుల్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో దీనిని నిర్వహిస్తున్నామని ఏపీలో జూన్ 15వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అనుమతిస్తామని, తెలంగాణకు జూన్ 17వరకు రిజిస్ట్రేషన్‌లు ఆన్‌లైన్‌లో జరుపుతామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి విజేతలుగా నిలిచిన వారికి ఫైనల్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. విద్యార్థులు వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్ విజయ్‌మోహన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో టాలెంట్ హంట్ చేసే విధంగా నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఏపీ కార్యక్రమం చేపడుతున్నా మన్నారు. కళలకు నిలయంగా నిలచే ఏయూ దీనిలో భాగమవుతుందని చెప్పారు.

## యుఎస్‌డి 5 ట్రిలియన్లను అధిగమించిన ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీ

**లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్**

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

ఎన్ఎస్ఈలో భారతీయ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ యుఎస్‌డి 5ట్రిలియన్లను అధిగమించింది. అదేరోజున నిఫ్టీ 50ఇండెక్స్ ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 22,993ని తాకింది నిఫ్టీ 500 ఇండెక్స్ కూడా ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 21,505.25ని తాకింది. ఈక్విటీ మార్కెట్‌లో ఈ వృద్ధి కేవలం పెద్ద క్యాపిటలైజ్డ్ స్టాక్‌లకు మాత్రమే పరిమితం కాదని సూచిస్తుంది భారతీయ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రయాణం యుఎస్‌డి 2 ట్రిలియన్ వరకు సుమారు 46 నెలలు పట్టగా యుఎస్‌డి నుంచి యుఎస్‌డి 4ట్రిలియన్ చేరేందుకు 30నెలలు పట్టింది. తాజా యుఎస్‌డి 1 ట్రిలియన్ చేరుకోవడానికి అదనంగా 6నెలలు మాత్రమే పట్టింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రకారం టాప్ 5 కంపెనీలుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్,హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, భారతీయ ఎయిర్‌టెల్ నిలిచాయి గత 10సంవత్సరాలలో నిఫ్టీ 50ఇండెక్స్ 13.4శాతం రాబడిని అందించింది. అదే సమయంలో నిర్వహణలతో దేశీయ మ్యూచువల్ ఫండ్ ఆస్తులు ఏప్రిల్ 2014చివరి నాటికి రూ. 9.45ట్రిలియన్ల నుంచి ఏప్రిల్ 2024 చివరి నాటికి రూ. 57.26ట్రిలియన్ల 506శాతం పెరిగాయి. 2024చివరికి 16.1ట్రిలియన్లను 345శాతం వృద్ధితో పెరిగింది. ఎన్ఎస్ఇ చీఫ్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీరామ్‌కృష్ణన్ మాట్లాడుతూ ప్రగతిశీల నియంత్రణ కార్యాచరణతో క్యాపిటల్ మార్కెట్ వ్యవస్థకు మద్దతు ఇచ్చినందుకు నేను భారత ప్రభుత్వానికి సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్‌ఆఫ్ బోర్డు ఆఫ్ ఇండియా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ధన్యవాదాలు తెలిపారు. దాదాపు 6నెలల అతి తక్కువ సమయంలో మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో తాజా యుఎస్‌డి 1 ట్రిలియన్ పెరుగుదల రాబోయే సంవత్సరాల్లో భారత ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూపుతుంది.

## ఎన్డీఏ కూటమికే ప్రజలు పట్టం:

**టిడిపిరాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు**

పాడేరు,మే24,ప్రభాతవార్త:



రాష్ట్రంలో తెలుగుదేశం,జనసే,బిజెపి కూటమి అధికారంలోకి రావడం ఖాయమని వైసిపి ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజలు విసుగుచెంది జరిగిన ఎన్నికల పోలింగ్‌లో ప్రజలంతా ఎన్డీఏ కూటమి ఎంపి,ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసారని వచ్చే నెల 4వ చతేదీన ప్రజా తీర్పు వెల్లడికానుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు ధీమా వ్యక్తం చేసారు.రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని వైఎస్ జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసారని నాగరాజు అన్నారు.అరకు పార్లమెంట్ ఎంపి స్థానాన్ని కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని నాగరాజు ధీమా వ్యక్తం చేసారు.ఎన్నికల ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లిన ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని ఇప్పటికే సాగనంపారని అధికారికంగా వచ్చే నెల 4వ తేదీన రానుందనిఅన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం. జనసేన,బిజెపి కూటమి ఘనగ విజయం సాధించి ప్రజా ప్రభుత్వాన్ని టిడిపి అధినేత నారాచంద్రబా బునాయుడు ముఖ్యమంత్రి హోదాలో ప్రారంభించనున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు స్పష్టం చేసారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొర్రా విజయరాణి పాల్గొన్నారు.

## 26న నీట్, జేఈఈ ఫౌండేషన్ కోర్సుల స్కాలర్షిప్ టెస్ట్

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త




ఈనెల 26న తేదీన ఆకాష్ ఎడ్యుకేషన్‌ల్ సర్వీసెస్ లిమిటెడ్ ఇనిస్టెంట్ అడ్మిషన్ కంస్కాలర్షిప్ టెస్ట్‌ను ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు ఆకాష్ విద్యా సంస్థలు సౌత్ ఇండియా చీఫ్ ఎకడమిక్ బిజినెస్ హెడ్ ధీరజ్ కుమార్ మిశ్రా తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఉదయం ద్వారాకానగర్ మెయిన్ బ్రాంచ్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పైగా ఆకాశ్ విద్యాసంస్థల కోర్సులో చేరి అత్యుత్తమ ఫలితాలు సాధించారని వెల్లడించారు. విశాఖలోని తమ మెయిన్ బ్రాంచ్ ద్వారకానగర్ సహా గాజువాక మధురవాడలో కూడా ఈ పరీక్ష 26వ తేదీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి నుంచి 12వతరగతి వరకు చదివే విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొని 90శాతం వరకు ఫీజులో రాయితీ పొందవచ్చును అన్నారు. డిఫెన్స్ పర్సన్స్ అదేవిధంగా టెర్రరిజం ఎఫెక్ట్ వ్యక్తులకు సంబంధించిన వారికి అదనంగా 10శాతం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు ఉత్తమ ర్యాంకులు సాధించే స్థితిలో ఆకాష్‌తో తమ ప్రయాణం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మూర్తి అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ బ్రాంచ్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేపల లారీ బోల్తా సిబ్బందికి స్వల్ప గాయాలు

ఆనందపురం, మే 24, ప్రభాతవార్త



మండలంలోని సొంత్యాం వద్ద ఆరు లేన్ల రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున చేపల లోడుతో వెళ్తున్న లారీ డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీ సిబ్బందికి స్వల్ప గాయాలు కాగా తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది డ్రైవర్ నిద్ర పోవడం వలనే ప్రమాదం సంభ వించినట్లు పోలీసులు భావిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా నారాయణ పురం నుంచిఒ చేపల లోడుతో బయలుదేరిన లారీ సొంత్యాం వద్దకు చేరుకునే సరికి అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కి బోల్తా పడింది. దీంతో లారీ బాడీ నుంచి క్యాబిన్‌తో పాటు చేపల లోడు వేరు పడి దూరంగా ఎగిరి పడింది. డ్రైవర్ క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగ ప్రాణ నష్టం జరగలేదు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నగరంలో గోడలపై పోస్టర్లు అతికిస్తే చర్యలు తప్పవు

**జివిఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్**

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త



అతి సుందరం నగరంగా కీర్తించదుతున్న విశాఖనగరంలో నగర గోడలపై విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లపై రోడ్డు విభాగినిలపై డస్ట్ బిన్నులపై ప్రజా ఆస్తులపై పోస్టర్లు అతికించినా పెయింటింగ్‌లు ఇతర వ్రాతలు వ్రాసినట్లయితే సంబందిత సంస్థలు ఆర్గ నైజేషన్ లపై ప్రజా ఆస్తులకు భంగం వాటిల్లు తున్న దృష్ట్యా జీవీఎంసీ తగు చర్యలు చేపడుతుందని జివిఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు జివిఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో విశాఖ నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ సభ్యులు మత సంబంద సంస్థలు ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం విశాఖ నగరాన్ని సుందర నగరంగా పరిశుభ్ర నగరంగా ఇతర నగరాలకు సూచిస్తుందని విశాఖ నగరానికి నిత్యం సందర్శకులు పర్యాటకులు సందర్శిస్తున్నారని జీవీఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చించి నగర సుందరీకరణ పనులను చేపట్టి నగరాన్ని ఆకర్షణీయంగా జివిఎంసీ తీర్చిదిద్దుతోందన్నారు. నగరంలో పలువురు విచ్చలవిడిగా గోడలపై విద్యుత్ స్తంబాలు ట్రాన్స్ఫార్మర్లపై రోడ్డు విభాగినిలపై డస్ట్ బిన్నులపై ప్రజా ఆస్తులపై వ్యాపార సంబందిత మత సంబందిత వినోద సంబందిత సంస్థలు పోస్టర్లు అతికిస్తూ పెయింటింగులు రాతలు, వ్రాసి అనధకారిక హోర్డింగులు, ఫ్లెక్సీలు డిజిటల్ బ్యానర్లతో నగరాన్ని అశుభ్రపరుస్తూన్నారన్నారు. నగరంలోఎలక్ట్రికల్ పోల్స్‌పై సెప్టిక్ క్లీనర్ ఫోన్ నెంబర్లు అసహ్యంగా రాసి ఉంటున్నాయని వాటిని నిరోధించవలసిన అవసరం ఉందన్నారు. 1997యాక్ట్ ప్రకారం నగర సుందరీకరణకు ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం 1లక్ష రూపాయలు వరకు జరిమానా విధించబుడునని సిసిపి తెలిపారు.నగరంలో వ్యాపార విందు వినోద, మత సంబందిత ప్రకటనలకు ప్రచారాలకు ప్రత్యామ్నాయంగా ఎఫ్ఎం రేడియోలు కేబుల్ టీవీలు, ప్రైవేట్ ఏజెన్సీల హోర్డింగులు సినీ స్లైడ్స్ వార్తాపత్రికలు సోషల్ మీడియా ద్వారా ప్రకటనలను చేసుకునేందుకే ఈ ఆవగాహన కార్యక్రమంచేపట్టడం జరిగిందని సిసిపి తెలిపారు. పరిశుభ్రత సుందరీకరణ దృష్ట్యా తమ వంతు బాధ్యతగా ప్రింటింగ్ ప్రెస్ ఆర్గనైజేషన్స్ విద్యాసంస్థలు మతపరమైన సంస్థలు ఇతర వ్యాపార సంస్థల యాజమాన్యాలు ఇటువంటి పోస్టర్లు అతికించకుండా వ్రాతలు వ్రాయడం అనధికారిక, హోర్డింగ్లు, బేనర్లు ప్రదర్శించకుండా నగర అభివృద్ధికి సహకరించాలని సిసిపి వారికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పోస్టర్లు ప్రింట్ చేసువారు వారి ఫోన్ నెంబర్లు సంస్థ పేర్లు తప్పనిసరిగా పోస్టర్లో పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో సిపి దోర, డిసిపి పద్మజ, డిసిపిలుఎసిపిలు, టిపిఒలు, వార్డు ప్లానింగు సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలి!

**పచ్చిరొట్టవిత్తనాలతో భూమిసారవంతం-ఎఒ ఉమాదేవి**

కొయ్యూరు, మే24, ప్రభాతవార్త



ఖరీఫ్‌సీజన్‌కు సంభంధించి రైతులు విధిగా వరివిత్తనాలను శుద్ధి చేసుకోవాలని, అలాగే పచ్చిరొట్ట విత్తనాలతో సాగుభూములు సారవంతం అవుతాయని మండల వ్యవసాయాధికారిణి ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని రావణాపల్లి రైతు భరోసాకేంద్రంలో మండలవ్యవసాయశాఖ సిబ్బందితో ఆమె సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎఒ ఉమాదేవి మాట్లాడుతూ-విత్తనశుద్ధి చేసుకోవడం వలన పంటలు సస్యరక్షణ అవుతాయన్నారు. ఖరీఫ్‌సీజన్‌కు సంభంధించి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించాలని రైతుభరోసాకేంద్ర సిబ్బందికి సూచించారు. అలాగే రైతులుకూడా ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలను సద్వినియోపర్చు కోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

## 1.27 రోజుల్లో డెత్ క్లెయిమ్‌లను సెటిల్ చేసిన ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్

విశాఖపట్నం,మే 24 ప్రభాతవార్త

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ యొక్క క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తి ఆర్థిక సంవత్సరం 2024 లో 99.17 శాతం గా ఉంది. ఇది పరిశ్రమలో అత్యుత్తమమైనదనీ ఆ సంస్థ చీఫ్ ఆపరేషన్స్ అధికారి అమిష్ బంకర్ చెప్పారు. నిజమైన డెత్ క్లెయిమ్‌ను సెటిల్‌చేయడానికి తీసుకున్న సగటు టర్నరౌండ్ సమయం కేవలం 1.27 రోజులు, 2024 తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కంపెనీ మొత్తం రూ.1,867 కోట్లు డెత్ క్లెయిమ్‌లుగా చెల్లించిందన్నారు. ఆర్థిక సంవత్సరం 2024 మొదటి త్రైమాసానికి (క్యూ1)కి కంపెనీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తి 97.94 శాతం ఆర్థిక సంవత్సరం 2024 రెండవ త్రైమాసానికి (క్యూ2)కి ఇది 98.14 శాతం ఆర్థిక సంవత్సరం 2024మూడవ త్రైమాసానికి (క్యూ3) ఇది 98.52 శాతం గా వుందన్నారు. క్లెయిమ్‌లను పరిష్కరించడంలో కంపెనీ స్థిరత్వాన్ని ఇది ప్రదర్శిస్తుందనీ, హక్కుదారులు లేదా నామినీలు తమ క్లెయిమ్‌లను సౌకర్యవంతంగా చేసుకునేందుకు వాట్సప్ కంపెనీ మొబైల్ యాప్ వంటి డిజిటల్ టచ్‌పాయింట్‌లను ఉపయోగించుకోవచ్చేనన్నారు. సులభంగా పద్ధతిలో క్లెయిమ్‌లను నమోదు చేయడం తో పాటుగా వాటిని ట్రాక్ చేయడానికిఉపయోగించవచ్చునని అలాగే కంపెనీ క్లెయిమ్ సంబంధిత డాక్యుమెంట్ల కోసం హోమ్ పికప్ కూడా అందిస్తుందనీ చెప్పారు.

## ఎల్గి పీఎం అయిల్- లూబ్రికేటెడ్ స్క్రూ కంప్రెసర్‌లు తీసుకువచ్చిన ఎల్గి

విశాఖపట్నం,మే 24 ప్రభాతవార్త

ప్రముఖ ఎయిర్ కంప్రెసర్ తయారీదారులలో ఒకటైన ఎల్గి ఎక్విప్‌మెంట్స్ తమ ఈజీ సిరీస్ శ్రేణికి అప్‌గ్రేడ్ చేస్తూ ఈజి పిఎం (పర్మనెంట్ మాగ్నెట్) ఆయల్ -లూబ్రికేటెడ్ స్క్రూ ఎయిర్ కంప్రెసర్‌లు పరిచయం చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది 11-45కే డబ్ల్యూ నుండి అందుబాటులో ఉంటాయి. అత్యాధునిక ఈజిపిఎం 15శాతం వరకు మెరుగైన సామర్థ్య లాభాలను అందించనుండటంతో పాటుగా మెరుగైన ఎఫ్ఎడీ ,ప్రతి కస్టమర్‌కు 16శాతం ఉచిత ఎయిర్ డెలివరీ అందిస్తుంది. 80శాతం లోడ్ సామర్థ్యం కంటే తక్కువ పనిచేసి అనేక కంప్రెసర్‌ల మాదిరిగా కాకుండా, 100 శాతం లోడ్ పరిస్థితులలో కూడా వివిధ లోడ్ సామర్థ్యాలలో సాటిలేని జీవిత చక్ర విలువలను అందించే అత్యుత్తమ పనితీరు శక్తి సామర్థ్యాన్ని అందించడానికి ఈజి పిఎం సీరీస్ రూపొందించబడింది. ఈజీ పిఎం సీరీస్ వినియోగదారులకుశక్తి వినియోగాన్ని తగ్గించడానికి దాని ఫలితంగా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి రూపొందిచబడిన తెలివైె ఫీచర్ల శ్రేణిని అందిస్తుంది. అధిక సామర్థ్యం గల డ్రైవ్ సిస్టమ్ ,ఎల్గిఎయిర్ ఎండ్‌ల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ప్రొప్రైటరీ అల్ట్రా -ఎఫిసియెంట్ ఐఇ5 ప్లస్ శాశ్వత మాగ్నెట్ సింక్రోనస్ మెటరును కలిగి ఉంది. ఈమోటర్ సామర్థ్యాలు 96.5 శాతం ,97.6 శాతం మధ్య ఉండటం తోపాటుగా ఐఇ 5 స్టార్ స్థాయిల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి.


## న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు విశాఖపట్నం జిల్లాలో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తివున్న యువకులకు న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది.

**అభ్యర్థులకు కావలసిన అర్హతలు**

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- ఇంటర్ లేదా డిగ్రీ
- స్థానికంగా నివాసం
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు**

చోడవరం, మాడుగుల, స్టీల్‌ప్లాంట్, పెదగంట్యాడ, ఆనందపురం, ఎన్ఎడి, పెందుర్తి, అడవివరం, విశాఖపట్నం సిటీ

అర్హులైన అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో 27-05-2024 సోమవారం ఉదయం 10 గంటలకు వార్త యూనిట్ కార్యాలయం, విశాఖపట్నంలో జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు, ఎస్.ఎస్.సి., ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో హాజరుకాగలరు.

**'వార్త' కార్యాలయము**

డోర్ నెం.50-1-16/10/బి
దుర్గాగణపతి గుడి వెనుక, గవర్నమెంట్ మున్సిపల్ స్కూల్ ఎదురుగా
సీతంపేట, విశాఖపట్నం -530016, ఫోన్ : 9848306312



## రైల్వే ట్రాక్ ఇబ్బందులు

డుంబ్రిగుడ రూరల్, మే 24, ప్రభాతవార్త

అరకు పాడేరు ప్రధాన రహదారిలో కురిడి సమీపంలో గల రైల్వే ట్రాక్ వద్ద రైల్వే గేటు మరమ్మతులు కావడంతో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, శుక్రవారం వరకు వారోత్సవానికి వెళుతున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. సుమారు గంటపాటు వాహన సదకులు ఆగిపోవడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. రైల్వే గేటు వేరేచోట, ఫ్లైఓవర్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు, ఇబ్బందులు లేకుండా ఉంటుందని వాహన చోదకులు కోరుకుంటున్నారు. రైల్వే అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని వాహన చోదకులు ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

## మన్యంలో భారీ వర్షం

డుంబ్రిగుడ, మే 24, ప్రభాతవార్త



మన్యంలో శుక్రవారం వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం తెలుస్తుంది. శుక్రవారం అరకు వారపు సంతకు వచ్చిన గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు వర్షం పడడంతో అటు వ్యాపారులు, ఇటు ప్రజలు ఫీవర్ ఇబ్బందులకు గురి అయ్యారు. దూర ప్రాంతమైన కంత్రిగూడ, గుంటగన్నెల, ఆ ప్రాంత ప్రజలందరూ ఇబ్బందులకు గురయ్యారు. నిత్యావసర సరుకులు కొనుక్కోకుండా తిరుగు ప్రయాణం సాగించారు.



## విద్యార్థుల చదివే ముఖ్యం

### కోసం కూడా ఎంపీపీ పాఠశాల హెచ్ఎం విలియం కేరి

డుంబ్రిగుడ రూరల్, మే 24, ప్రభాతవార్త

మండలంలోని పించుముండ పంచాయితీ కోసోం గూడ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శుక్రవారం సెలవుల్లో భాగంగా విద్యార్థులు విద్యను మర్చిపోకుండా ఉండేందుకు ఇంటింటికి వెళ్లి విద్యా నేర్పిస్తూ ఎలా చదువుకుంటున్నారో తెలుసుకొని విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా పట్ల శ్రద్ధ వహించుకొనే లాగా తీర్చిదిద్దడమే నా ఉపాధ్యాయుడు వృత్తి అని ఆయన అన్నారు. ఈ సెలవుల్లో విద్యాబోధన కుంటు పడకూడదని గ్రామీణ సందర్శించి ఇంటింటికి వెళ్లి విద్యాబోధనపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నామని ఆ పాఠశాల హెచ్ఎం విలియం కేరి శుక్రవారం పాత్రికేయులకు తెలిపారు.

## ముస్లిం రిజర్వేషన్లపై కలకత్తా హైకోర్టు తీర్పు హర్షణీయం

అనకాపల్లి, మే 24, ప్రభాతవార్త




ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ చెల్లదంటూ కలకత్తా హైకోర్టు తీర్పును ఇవ్వడంపై బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఓబిసి మోర్చ జిల్లా అధ్యక్షులు కంచి పాటి వెంకట సన్యాసి రావు అధ్యక్షతన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పరమేశ్వరరావు అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించింది కానీ మత ప్రాతిపదికన కాదని అన్నారు. బీజేపీ పార్టీ మత రిజర్వేషన్‌లను ఎప్పటినుంచో వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజలను ఆకట్టుకోవాలని మత రిజర్వేషన్లకు పాల్పడటం తగదన్నారు. అలాంటి వారికి కలకత్తా హైకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు కంచిపాటి వెంకట సన్యాసిరావు, రాష్ట్ర ఓబీసీ మోర్చ సెక్రెటరీ కర్రి రామకృష్ణ, జనరల్ సెక్రెటరీ యర్రా అచ్చం నాయుడు, ఓబీసీ మండల అధ్యక్షులు కోసూరి మోహన్‌రావు, బీజేపీ నాయకులు కొండబాబు మాస్టారు పాల్గొన్నారు.

## ఘనంగా జార్జ్ క్లబ్‌లో యోగ ద్వితీయ వార్షికోత్సవాలు

అనకాపల్లి, మే 24, ప్రభాతవార్త



స్థానిక జార్జి క్లబ్‌లో యోగా ద్వితీయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భారత స్వాభిమాన ట్రస్ట్, పతాంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మ నాయుడు సారధ్యంలో రెండు సంవత్సరాలుగా ఎందరికో ఆరోగ్యాన్ని పెంపొందిస్తూ జిల్లా వ్యాప్తంగా పలు సెంటర్లు ఏర్పాటు చేసేందుకు గాను అందరిచే యోగా చేద్దాం రోగాలు లేకుండా జీవిద్దాం అనే సంకల్పంతో రాందేవ్ బాబా ఆశీస్సులుతో ఇప్పటికే 80 మంది సహ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి ఉన్నారు. జిల్లాలో పలు సెంటర్ల ద్వారా మరింత యోగాని అందరికీ దగ్గర చేసేందుకు అనకాపల్లి జార్జి క్లబ్ నందు నిరంతర యోగ శిక్షణ తరగతులు ప్రతిరోజు జరుగుతున్నాయి. ద్వితీయ సంవత్సర వేడుకల్లో భాగంగా యోగా గురువు నాయుడు మాట్లాడుతూ మూడు రోజులు కార్యక్రమాల్లో భాగంగా 24న జల యోగ కార్యక్రమం శారదా నగర్‌లో గల ఈశ్వర్ స్విమ్మింగ్ పూల్ నందు శ్వాసపై ధ్యాస పెంపొందించేందుకు జలాశనాలు నిర్వహించడం జరిగిందన్నారు. 25న యోగపై నగర సంచరణ యోగాతో శరీరము ఆయుధం అయితే ఆరోగ్యం జీవితకాలం బానిస అవుతుంది దీనిపై పట్టణ ప్రధాన కోడలినందు ఆరోగ్యం పెంపొందించుకునే విధంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. 26న పూజ్య స్వామి రిత్ దేవ్ మహారాజ్, పతంజలి యోగపీట్ హరిద్వార్, జొన్నలగడ్డ శ్రీనివాసులు ఏపీ భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షులు, ప్రముఖులు విచ్చేస్తున్నారు అన్నారు. వార్షికోత్సవ కార్యక్రమం సాయంత్రం 5గం.లకు గాయత్రీ, మృత్యుంజయ హోమం మహిళలచే యోగాసనాల ప్రదర్శన, యోగా విశిష్టత గూర్చి వివరించి పలు అనారోగ్య సమస్యలకు ఏ ఆసనాలు బాగా అనుకూలం మంచి ఫలితాలను ఇస్తాయో వాటిపై వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జార్జ్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి బివిఎంకె జోగి నాయుడు, బుద్ధ కాశీ విశ్వనాథ్, వి.చంద్రశేఖర్, బీమర్శెట్టి శ్రీనివాసరావు, జె.మంగయ్య, కెవివి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కొల్లాపల్లి ప్రకాశరావుబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, మల్ల నరసింగరావు, కర్రి గంగాధర్, వంశీధర్, రోహిణి (మహిళా యోగా), రవణమ్మ, అన్ని ప్రాంతాల యోగ సాధకులతో పాల్గొన్నారు.

## రాజ్యలక్ష్మి అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

భీమునిపట్నం, మే 24, ప్రభాతవార్త



కోరాడ పంచాయితీ గెద్ద పేట గ్రామంలో వెలిసిన శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి పండుగ ఉత్సవాలు శుక్రవారంతో ముగిసినవి కనివిని ఎరుగని రీతిలో అమ్మవారి పండుగ జరిగింది. అమ్మవారి పండుగను చూచుటకు చుట్టుపక్కల గ్రామాల నుండే కాక జిల్లాలు రాష్ట్రాలు దాటి ఉన్న చుట్టాలు వచ్చి పండుగలో పాల్గొని అమ్మవారి దర్శనాలు చేసుకున్నారు సుమారు పండుగ రోజులలో లక్ష మంది భక్తులు వచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు ఈ రాజ్యలక్ష్మి అమ్మవారికి గెద్ద పేట వాస్తవ్యులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యుద్ధ ప్రసాద్ తన సొంత నిధులను వెచ్చించి అమ్మవారికి రెండు కేజీల 300 గ్రాములతో రూ.2 లక్షల 25 వేల ఖర్చుతో అమ్మవారికి వెండి కిరీటమును చేయించి బహూకరించారు. ఈ కిరీటం అమ్మవారి తలపై ఉంచారు. ఆదేవిధంగా అమ్మవారి గుడికి శోభాయ మాయంగా వేసే రంగులకు రూ.25వేలను తన సొంత నిధులు ఇచ్చుట జరిగినది.

## బడి బయట గల దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు, నమోదు

భీమునిపట్నం, మే 24, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు వారి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బడి బయట ఉన్నటు వంటి 0 నుండి 18 సం.ల మధ్య వయస్సు కలిగిన 21 రకాల వైకల్యాలు గల దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు మరియు బడిలో వారి నమోదు కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లా సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త వారి ఆదేశాల ప్రకారం పద్మనాభం మండలంలో కూడా ప్రత్యేక ఉపాధ్యాయులు ద్వారా మే నెల 1వ తేదీ నుండి ఈ గుర్తింపు కార్యక్రమం జరుగుచున్నది. ఈ కార్యక్రమం జరుగుతున్న తీరును మండల విద్యాశాఖాధికారి పొన్నగంటి రమణ సామయ్యవలస, మునివానిపాలెం గ్రామాల్లో పర్యవేక్షించడం జరిగినది. ఈ క్రమంలో దివ్యాంగ విద్యార్థులకు మండల కేంద్రంలో గల భవిత కేంద్రాల ద్వారా అందజేయబడుతున్న చదువు వలన కలిగే ప్రయోజనాలు, ఫిజియోథెరపీ సేవలను, ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపకార వేతనాలు మరియు రాయితీలను గురించి వారి తల్లిదండ్రులకు తెలియజేసారు. ఈ సర్వేలో ఇప్పటివరకు 12 మందిని గుర్తించడం జరిగినది. ఈ సర్వే జూన్ నెల 9వ తేదీ వరకూ కూడా జరుగుతుంది. అనంతరం వీరందరికీ ప్రభుత్వ పాఠశాలల నందు ప్రవేశాలు కూడా కల్పించారు. నేటి సర్వేలో మండల విద్యాశాఖాధికారితో పాటుగా ప్రత్యేక ఉపాధ్యాయులు హెచ్.రాజకుమార్, ఎం.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో మాతృ మరణాల మీద సమీక్ష



పీఎం పాలెం, మే 24, ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్, విశాఖపట్నం వారి ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విశాఖపట్నం కార్యాలయంలో సమావేశ మందిరం నందు డా.పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, విశాఖ పట్నం వారి అధ్యక్షతన మాతృ మరణాల మీద సమీక్ష జరిగింది. నాలుగు నెలలకు గాను 7 మాతృ మరణాలు సంభవించాయి. ఫిబ్ర వరి నెలలో చెంగల రావు పేట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో 1, మార్చి నెలలో సొంట్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిదిలో 1, ఏప్రిల్ నెలలో జ్ఞానపురంలో 1, పెందుర్తిలో 1, నరవ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో 1, మే నెలలో ఆదర్శనగర్‌లో 1, రైల్వే న్యూ కాలనీలో 1 మొత్తం 7 మాతృ మరణాలు సంభ వించాయి. డా.పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, విశాఖపట్నం వారు మాట్లాడుతూ మొత్తం 7 మాతృ మరణాలపై సమీక్ష చేసి సంబందిత వైద్యాధికారులను, ఎఎంఎంను సమీక్షించి మాతృ మరణాలు సంభవించడానికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఇకముందు మాతృ మరణాలు జరగ డానికి వీలు లేదని ఎఎన్ఎం నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఎవరైనా గర్భిణులు అస్వస్తతకు గురైనప్పుడు సంబంధిత వైద్య ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులను వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్లి వైద్యం చేయించాలని ఇకముందు మాతృ మరణాలు జరగకూడదని ఆదేశించారు. డా.రమేష్ కిషోర్, డా.పూర్ణం ద్రబాబు, డా.ఎస్.జీవనరాణి, జయదేవి, డా.పి.ఉషాప్రసాద్, గైనకాలజిస్ట్, డా.శ్రీదేవి, గైనకాలజిస్ట్, డా.జి.వి. గణేష్, ప్రొఫెసర్, ఏనాస్తీషియా, డా.ఆర్.డి.ఎన్ శ్వేత అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.వి.సి.శ్రీని వాసరెడ్డి, జనరల్ మెడిసిన్, బి.నాగేశ్వరరావు, డెమో, డా.బి.ఉమావతి, విమెన్ హెల్త్ ఆఫీసర్, డా.ఎస్ సిబి నాయుడు, మెడికల్ ఆఫీసర్, బ్లడ్ బ్యాంకు, ఐ.మనోరమ, వి.త్రినాధరావు, జిల్లా మేనేజర్, 108, మెడికల్ ఆఫీసర్స్, నాగభూషణం, వైద్యాధికారులు, ఎఎన్ఎం, ఎంపిహెచ్ఎస్ ప్రైవేటు హాస్పిటల్ డాక్టర్స్, పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు విజయవంతం చేయడానికి సహకరించండి

### రిటర్నింగ్ అధికారి, జె.సి.భావనా పశిష్ట్

పాడేరు,మే24,ప్రభాతవార్త



వచ్చే నెల 4న స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ని విజయవంతంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలని పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి భావనా వశిష్ట్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు పక్కాగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎవరు ఉల్లఘించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించమని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చిన కౌంటింగ్ ఏజెంట్ బయటకు వెళితే తిరిగి రావడానికి అనుమతించడం జరగదన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ కౌంటింగ్కు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉంటుందని విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేదించడం జరిగిందన్నారు. ఎక్కడా గుంపులు, గుంపులుగా జనం ఉండకూడదని చెప్పారు. ఐదుగురు మించి ఉంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. విజయోత్సవ ర్యాలీలకు ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు మంజూరు చేయబడవని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు హింసను ప్రేరేపించకూడదన్నారు. ఓట్లు లెక్కింపు రోజు ఎటువంటి క్రాకర్స్ కాల్చడం, లౌడ్ స్పీకరుల ఏర్పాటు చేయడం నిషేధించామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రానికి ఒక కిలోమీటరు వరకు ఎటువంటి డ్రోన్లు ఎగరవేయ కూడదన్నారు. ఎన్నికల అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగిన ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామన్నారు.

### ఓటు లెక్కింపుకు నిర్దేశించిన ప్రవేశ మార్గాలు నుండి మాత్రమే ప్రవేశం...

అరకు అసెంబ్లీ నియోజక వర్గం, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని స్థానిక ఎంపిడి ఓ కార్యాలయం జంక్షన్ నుండి వచ్చే మార్గంలో డిగ్రీ కళాశాలకు పవేశం కల్పిస్తామన్నారు. పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం, అరకు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు, ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి కళాశాలకు చేరుకోవడానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపి రామదాసుకు ఆరోగ్యశాఖ నోటీసులు



### అల్లూరి క్లినిక్ సీజ్ చేసిన ఉన్నతాధికారులు

గొలుగొండ, మే 24, ప్రభాతవార్త

ఏఎల్‌పురంలో ఆర్ఎంపీ వైద్యుడు రామదాసుకు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారు. కృష్ణాదేవి పేట వైద్యాధికారి హరిప్రవిణ్ ద్వారా అల్లూరి క్లినిక్‌కి శుక్రవారం నోటీసు జారీచేశారు. నోటీసులు అందించిన వెంటనే క్లినిక్‌ను కూడా సీజ్ చేసినట్లు డాక్టర్ తెలిపారు. ఆర్ఎంపి వైద్యానికి మించి వైద్యం చేస్తున్నట్లు, ఇటీవల ఇక్కడ వైద్యం పొంది మరణించిన అంశంపై కూడా పూర్తిస్థాయి విచారణతో కూడిన నివేదికను జిల్లా ఉన్నతాధికారి డిఎంఎన్‌హెచ్‌ఓకు అందిన తుది నివేదిక ఆధారంగా శుక్రవారం ఈ ఆదేశాలు విడుదలయ్యాయని డాక్టర్ హరి ప్రవీణ్ తెలిపారు. ఇకపై క్లినిక్ తెరవకూడదని వైద్యం చేయరాదన్నారు. రామదాసుకు ఉన్నతాధికారులు అందించిన నోటీసులు అందజేస్తూ ఈ హెచ్చరికలు చేశారు. ఆర్.ఎం.పి వైద్యం పేరుతో అంతకుమించి ఇక్కడ వైద్య నిర్వహించడం విచారణలో తేటతెల్లమైందన్నారు. ఇదే తీరుగా ఆర్ఎంపీ వైద్యులు వ్యవహరిస్తే మరిన్ని చర్యలు తప్పవని, ఏదైతే అర్హత కలిగి ఉన్నారో అంతవరకు ప్రాథమిక వైద్యం అందించవచ్చని అన్నారు. అలా కాకుండా క్లినిక్లు ఏర్పాటు చేసి బెడ్ వైద్యం నిర్వహించిన ఎడల పూర్తిస్థాయి చర్యలు ఉంటాయని తెలిపారు. మరిన్ని క్లినిక్లపై త్వరలో విచారణ కొనసాగిస్తామని హద్దు మీరి రోగుల ప్రాణాలను పణంగా పెట్టవద్దన్నారు. అలాగే ఈ నోటీస్‌పై ఎటువంటి ప్రతివాదన వినిపించాలన్న ఉన్నతాధికారుల వద్ద తగిన ఆధారాలతో నిరూపించుకోవచ్చు అన్నారు.

## పెంచిన విద్యుత్ చార్జీల సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలి

గాజువాక,మే 24,ప్రభాతవార్త




విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉక్కు నగరంలో నివాసముంటున్న కార్మికులపై పెంచిన విద్యుత్ ఛార్జీల సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డా.బి.గంగారావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ప్రధాన పరిపాలన భవనం ఎదుట అక్రమంగా పెంచిన కరెంటు చార్జీల అమలు నిలుపు చేయాలని, సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని ప్రధాన డిమాండ్లతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పెద్దఎత్తున కార్మికులు తమ నిరసనను తెలిపారు. ఈ ధర్నాను ఉద్దేశించి 78వ వార్డు కార్పొరేటర్ డా.బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం ఏకపక్షంగా పెంచిన విద్యుత్ చార్జీల అమలు నిలుపు చేయాలని, దీని మీద ఇచ్చిన సర్క్యులర్ ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ నగరంలో గల ఏ పరిశ్రమ టౌన్ షిప్‌లలో లేని విధంగా స్టీల్ యాజమాన్యం కార్మికులపై విద్యుత్ భారాలను మోపుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇటువంటి అనాలోచిత చర్యలను తక్షణం ఉపసంహరించుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వైటి దాస్, సిఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి డి.సురేష్ బాబు, స్టీల్ సిఐటియు నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, గంగాధర్, పుల్లారావు, మరిడయ్య, శ్రీనివాస్ రెడ్డి, బిఎన్ మధుసూదన్, రాజు, అప్పలరాజు, లోకేష్, రాజారావు, పృథ్వీ, చారి, చిరంజీవి, శ్రీనివాసరాజు తదితరులతోపాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో యువ కార్మికులు పాల్గొన్నారు.

## కార్మికులపై కక్ష సాధింపు చర్యలు సరికాదు

### ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

గాజువాక,మే 24,ప్రభాతవార్త




విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు సరికాదని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రగతి కోసం ఎంతో శ్రమిస్తున్న కార్మిక వర్గంపై యాజమాన్యం దాడులు సరికాదన్నారు. ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్లో పరిస్థితులు ఉన్నాయన్నారు. వామపక్షాల యూనియన్లు ప్లాంట్లో గుర్తింపు యూనియన్లోకి వచ్చిన తరువాత కార్మిక వర్గానికి తీవ్ర ఇబ్బందులు వచ్చాయన్నారు. అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ కార్మిక సంక్షేమంపై యాజమాన్యంను ఏనాడు ప్రశ్నించలే దని, ఇటీవల ఇచ్చిన జీతాల విషయంలో కూడా యాజమాన్యంపై ఇంటక్ తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చిందన్నారు. ఇంటక్ హయంలో అమల్లో ఉన్న కార్మిక సంక్షే మాలను నేడు కుట్రపూరితంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. కార్మిక సంక్షేమ విషయంలో ఇంటక్ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎన్.రాజు, గొందేశి ప్రభాకర్రెడ్డి, కొమ్ము ప్రసాద్, డి.మోహన్, సీహెచ్.సుదర్శనం, ఎ.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రిన్సెస్ ఆఫ్ ఇండియాకు అబినందనల వెల్లువ

### -క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ ఆధ్వర్యంలో సత్కారం

గాజువాక,మే 24,ప్రభాతవార్త



అలరించే అభినయాలతో అందరి హృదయాలను ఆకట్టుకొని బుడిబుడి అడుగులు వేసే వయసులోనే బంగారు కిరీటాలను కైవసం చేసుకుంటున్న జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ విజేత, ఇండియా ప్రిన్సెస్ చిన్మికకు అన్నివర్గాల నుంచీ అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పలువురు కళాకారులు, స్వచ్ఛంద సేవకుల నుంచి అభినందనలు అందుకున్న చిన్నారి చిన్మికను క్లాసిక్ ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఓ ప్రయివేటు హోటల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా క్లాసిక్ ఎంటర్‌టైన్‌మెంట్స్ వ్యవస్థాపకురాలు నందిని మాట్లాడుతూ చిన్న వయసులోనే విశేష ప్రతిభాపాఠవాలను ప్రదర్శిస్తూ పాల్గొన్న ప్రతీ పోటీలోనూ విజయడంకా మోగిస్తున్న చిన్మిక అభినందనీయురాలని అన్నారు. తమ సంస్థలో తర్ఫీదు పొందిన చిన్మిక జాతీయ స్థాయిలో తన సత్తాచాటి అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం తమకు గర్వకారణం అని అన్నారు. అనంతరం చిన్నారి తల్లి హారిక దంపతులు మాట్లాడుతూ మొదటినుంచీ తమ కుమార్తె ఆసక్తి చూపిస్తున్న అంశాలలో తాము ప్రోత్సాహం అందిస్తూవచ్చామని అన్నారు. వజ్రానికి సానపెట్టినట్లుగా తమ కుమార్తెలోని ప్రతిభకు మెరుగులుదిద్ది తన విజయంలో కీలకంగా వ్యవహరించిన క్లాసిక్ ఎంటర్టైన్మెంట్స్ ప్రతినిధులు అనితా పట్నాయక్, నందిని గొళ్ళూరి, రోహిత్ సువ్వాడ అదేవిధంగా తమకు అన్ని విధాలుగా సహకరించి చిన్నారిని ప్రోత్సహించిన కిందర్ జాయ్ పాఠశాల ప్రిన్సిపల్ అనిత లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారుల చిన్నారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కాశీలో అన్నపూర్ణ విశ్వనాధుని దర్శించుకున్న కెఎన్ఆర్ కుటుంబ సభ్యులు



గాజువాక, మే 24, ప్రభాతవార్త

యూపీ రాష్ట్రం కాశీలో శ్రీ కాశీ విశ్వనాథ్, శ్రీ అన్నపూర్ణా మాత ఆలయం గర్బ గుడిలో గాజువాక బిజెపి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కుటుంబ సభ్యులు జ్యోతి సాహితి చిరులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం పరమ పవిత్రమైన గంగా నదిలో స్నానమాచరించి కాశీ విశ్వనాధునికి అభిషేకం అనంతరం అన్నపూర్ణా మాత గర్బ గుడిలో ప్రత్యేక పూజలో పాల్గొన్నామని చెప్పారు.

## కృష్ణాదేవిపేట రేంజ్‌కు ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి

### బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ అబ్దుల్ రాహూఫ్

గొలుగొండ, మే 24, ప్రభాతవార్త



అటవీ శాఖలో ఐఎఫ్ఎస్ అధికారిగా ఉమ్మడి విశాఖ జిల్లాలో శిక్షణ పొంది నర్సీపట్నం అటవీ డివిజన్ కృష్ణాదేవిపేట రేంజ్‌కి ట్రైన్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ అబ్దుల్ రాహూఫ్, కృష్ణదేవిపేట రేంజ్ అధికారి వెంకట్రావు తో కలిసి రాహూఫ్ రేంజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను 2022లో ఐఎఫ్ఎస్‌కు ఎంపికై రెండేళ్ల శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. అటవీ పరిరక్షణ, సంపద కోల్పోకుండా ఈ శిక్షణ కాలంలో తన వంతు కృషిగా విధి నిర్వహణలో కొనసాగుతానన్నారు. రేంజ్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో సందర్శించి హద్దులను తెలుసుకొని స్థానిక పరిస్థితులను అధ్యయనం చేస్తానని ఆయన అన్నారు. అలాగే రేంజ్ కార్యాలయంలో ఉన్న సిబ్బంది వారి విధులు ప్రస్తుత స్థితి అన్నిటిపై స్థానిక రేంజ్ అధికారి వెంకట్రావుతో మాట్లాడి తెలుసుకుంటానని అన్నారు. ఇప్పటికే విశాఖపట్నం అనకాపల్లిలో ఉన్నతాధికారుల వద్ద రెండు సంవత్సరాలు పాటు శిక్షణ తీసుకున్నానని తెలిపారు. ట్రైనింగ్ కాలంగా కృష్ణా దేవి పేట రేంజ్ కు తనను నియమించారని అన్నారు. ఆయన వెంట రేంజ్ అధికారి వెంకట్రావుతో పాటు సెక్షన్ అధికారి సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

## 57 వాహనాలను సీజ్ చేసిన దేవరాపల్లి పోలీసులు

అనకాపల్లి, మే 24, ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ కే.వీ.మురళీకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి సబ్ డివిజన్, కే కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.సిహెచ్. స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఎస్సై డి.నాగేంద్ర, అనకాపల్లి సబ్ డివిజన్ పోలీసు సిబ్బంది దేవరాపల్లి మండలం, ఎస్సీ కాలనీ, గొల్ల వీధి, గాలి వీధి కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 55 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు మొత్తం 57 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు సంబంధిత గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అనుమానస్పద ప్రాంతాల్లో ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనరాదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. అనకాపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యలమంచిలి, మే 24, ప్రభాతవార్త



యలమంచిలి జాతీయ రహదారి కొక్కిరాపల్లి గ్రామ శివారులోగల తురంగలపాలెం రోడ్డు పక్కన చెరువులో గుర్తుతెలియని మృతదేహాన్ని కనుగొన్నట్లు రూరల్ ఎస్సై సింహాచలం తెలిపారు. మూడు నాలుగు రోజుల క్రితం ఊరు పేరు తెలియని సుమారు 30 నుండి 35 సంవత్సరాల మధ్య వయసుగల పురుషుడు చోడి చెరువులో పడి మునిగిపోయి చనిపోయి ఉన్నాడని తెలిపారు. కావున మీ గ్రామంలో ఈ మధ్యకాలంలో తప్పిపోయి ఉన్నట్లయితే పై ఫోటోల గల పురుషుడు శవం గుర్తించి యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలియ జేయగలరని కోరారు. క్లూస్ టీం బృందం వచ్చి వివరాలను సేకరిస్తున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

## ఏఎల్ పురంలో చెరువును తలపిస్తున్న బస్‌స్టాండ్

గొలుగొండ, మే 24, ప్రభాతవార్త

ఎఎల్ పురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపిస్తుంది. చిన్నపాటి వర్షం పడినా మొత్తం నీటితో నిండి ప్రయాణికులు బస్సు దిగడానికి కానీ, ఎక్కడానికి కానీ కాలు మోపకుండా మొత్తం నీరుతో నిండిపోతుంది. శుక్రవారం కురిసిన వర్షానికి కాంప్లెక్స్ ఆవరణ మొత్తం నీటితో నిండిపోయింది. ఈ రోజే కాదు గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిత్యం ప్రయాణీకులు అధికమించి తమ గమ్యాలకు చేరుకునే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఇక్కడ సౌకర్యాలపై దృష్టి చారించకపోవడం కేవలం తాత్కాలిక ఉపశమనం కలిగించేలా ఏడాదిలో ఒకటి రెండు సార్లు తేలికపాటి చర్యలు చేపట్టడంతో చేతులు దులుపుకుంటున్నారు. బస్సులు నిలిచే ఆవరణ మొత్తం పెద్ద భారీ గోతులుగా మారి వర్షం నీరు రోజులు తరబడి నిలిచిపోతుంది. పడిననీరు బయటికి వెళ్లే మార్గం లేకపోవడంతో కాంప్లెక్స్ లోనే కెర్లుతూ ప్రయాణికులను అవస్థలకు గురిచేస్తుంది. అధికారులు తీరుపై ప్రయాణీకులు, స్థానిక దుకాణదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆవరణను సరిచేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## రాజకీయాలకన్న స్నేహం గొప్పదని ఇతరులకు ఆదర్శంగా నిలవాలి

### ఎటపాక సిఐ డి.రామారావు పిలుపు

వి.ఆర్.పురం, మే 24,ప్రభాతవార్త



వి.ఆర్.పురం మండలంలో ఎలాంటి గొడవలకు తావు లేకుండా సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తీరు సంతృప్తి నిచ్చిందని, ఎన్నికలకు సహ కరించినట్లుగానే, నాలుగవ తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాలను ముగించి, రాజకీయాల కన్న స్నేహం గొప్పదని ఇతర ప్రాంతాల వారికి ఆదర్శంగా నిలవాలని ఎటపాక సిఐ రామారావు స్దానిక ప్రధాన రాజకీయ పార్టీల నేతలకు పిలుపు నిచ్చారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన, అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఈ సందర్భంగా సిఐ రామారావు ప్రత్యేక కృత్ఞతలు తెలిపారు. శుకృవారం కూనవరంలోని వి.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో, నాల్గవ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడిని పురస్కరించుకొని, అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో, సిఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికలు, ఫలితాల సందర్భంగా జరిగే ఘటనలకు సంభందించి నమోదయ్యే, కేసుల పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. కేసుల్లో ఇరుకున్నా వారికి ఆ ప్రభావం భవిషత్ సాంతం వేంటాడుతుందని సిఐ స్పష్టం చేశారు. ఫలితాల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా, ఘర్షణలకు పాల్పడిన, గొడవలకు పురిగొల్పినా, అట్టి వారిపై ఖఠినమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది, ప్రధాన రాజకీయ పార్టీలు వైసీపీ మాదిరెడ్డి సత్తిబాబు, బొడ్డు సత్యనారాయణ, సిపిఎం పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, టీడీపీ వాళ్ళ రంగారెడ్డి, బురకా కాన్నారావు, జనసేన ములకాల సాయికృష్ణ, బీజేపీ ముత్యాల రాంబాబు తదితర నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

## నేత్ర శస్త్ర చికిత్సలు కోసం 40 మందిని తరలింపు

కురుపాం, మే 24, ప్రభాతవార్త



నేత్రశస్త్ర చికిత్సల కోసం 40 మందిని తరలించినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు గనేష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కురుపా, గుమ్మలక్ష్మీపురం మండలం పరిధిలో ఉన్న సచివాలయాల ఉన్న గ్రామాలలో గతంలో నిర్వహించిన కంటి వెలుగు వైద్య శిబిరంలో ముఖ్యమంత్రి నేత్ర వైద్య కేంద్రంలో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షలలో కేటారాక్ట్ (అంతర కుసుము) టెరిజియం (కొయ్యకండ) ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికత్సలు కోసం కురుపాం సామాజిక ఆరోగ కేంద్రం నుంచి పుష్పగిరి కంటి ఆసుపత్రి విజనగరంకి 40 మందిని తరలించి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్ల జోళ్లు, మందులు, సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలకు వెళుతున్న రోగులకు పలు సూచనలు, జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మాలాంటి పేదలకు కంటి చూపును తప్పించే బాధ్యతగా తీసుకుని దగ్గరుండి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ధన్యవాదాలు తెలిపారు. కంట వైద్య సహాయకులు మౌఇక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులు బడిబాట పట్టేలా ఇంటింటి సర్వే

రామభద్రపురం, మే 24, ప్రభాతవార్త



మండల పరిధిలోని దివ్యాంగులను బడికి వెళ్లేలా సమగ్ర శిక్షణాభియాన్, స్థానిక భవిత కేంద్రం ఆద్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం స్థానిక మండల పరిధిలోని గిరిజన గ్రామాల్లో సర్వే చేపట్టారు. జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశాలతో మండల విద్యాశాఖాధికారులు ఎ.తిరుమల ప్రసాద పెంటయ్య పర్యవేక్షణలో చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపట్టారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో చేరని దివ్యాంగులు, వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సేకరిస్తున్నారు. చదువు వల్ల ప్రయోజనాలు దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాలపై పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.

## గుర్తు తెలియని మృతదేహం

మెంటాడ, మే 24, ప్రభాతవార్త



మండలంలోని చింతలవలస గ్రామాన్ని అనుకున్న మామిడి తోటలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఆంధ్ర ఎస్.ఐ బి.దేవి తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు ఎలా మృతి చెందిన విషయం తెలియరాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను పరిశీలించిన వ్యవసాయాధికారి

పాచిపెంట, మే 24, ప్రభాతవార్త



మండలంలోని ఖరీఫ్ 2024 సీజన్‌కు సంబందించిన విత్తనాలు ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయాధికారి కె.తిరు పతిరావు పరిశీలించారు. మండలంలోని పనుకువలస, పికోనవలస రైతుభరోసా కేంద్రాలలో పరిధిలోగల అందుబాటులో ఉన్న రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం సాగుభూమి ఆరోగ్యాన్ని పెంచడానికి అవసరమయ్యే పచ్చిరొట్ట విత్తనాలు జిలుగులు 36 క్వింటాళ్ళ కట్టెజనుము 34 క్వింటాళ్ళఉ పిల్లి పెసర రెండు క్వింటాళ్ళు రైతు భరోసా కేంద్రాలలో సిద్దంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం రావాల్సిన రైతులకు డిక్రుషిలో రిజిస్ట్రేషన్ చేసి అందించడం జరుగుతుందన్నారు. రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఎ.ఎ.వినోద్‌కుమార్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల ముందే ఏర్పాట్లు పూర్తి కావాలి

### ఎన్నికల ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు

విజయనగరం, మే 24, ప్రభాతవార్త ప్రతినిధి




ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఆయా శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, సకాలంలో పూర్తి చేసే విధంగా అన్ని వసతులతో లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. లెండి కళాశాలలో చీపురుపల్లి, గజపతినగరం, రాజాం, నెల్లిమర్ల, ఎస్.కోట అసెంబ్లీ



నియోజకవర్గాలు ఓట్లు లెక్కింపు జరుగుతుందని, జెఎన్‌టియులో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలు ఏర్పాట్లు చేస్తాయన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, మూడు రోజులు ముందుగానే లెక్కింపు గదుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ రోజు ఉదయం ఆరు గంటలకే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకుంటారని, వారికి చక్కని అల్పాహారం, భోజన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్టమైన బారికేడింగ్ వ్యవస్థాను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పాత్రికేయుల కోసం రెండు చోట్ల రెండు మీడియా సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిలోనూ లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. అవసరమైనప్పుడు తమ వారికి సమాచారం అందించేందుకు పబ్లిక్ కమ్యూనికేషన్ గదులను ఏర్పాటు చేయాలని, అక్కడ మాత్రమే సెల్‌ఫోన్‌లో మాట్లాడానికి అనుమతి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్.డి అనిత, వివిధ విభాగాల నోడల్ అధికారులు, వేదికల ఇన్‌చార్జిలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జూన్ 4వరకు 144 సెక్షన్

పాచిపెంట, మే 24, ప్రభాతవార్త



వచ్చే నెల 4వరకు ఎన్నికల కోడ్ కారణంగా 144 సెక్షన్ నడుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పాచిపెంట ఎస్.ఐ పి.నారా యణరావు అన్నారు. శుక్రవారం మండలంలో గల పూడి గ్రామాన్ని ఎస్.ఐ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిమిత్తం వాగ్వాదాలకు దిగి ఘర్షణలు గొడవలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్.ఐ సూచించారు. జూన్ 4వరకు గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండాలని ఎన్నికలు కోడ్ సమయంలో కేసు నమోదు అయితే చాలా ఇబ్బందులు పడతారని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఫైబర్ క్లయిమ్, రోడ్డు భద్రత నియమాలు, ఫోక్స్ దిశ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు స్వచ్ఛందంగా నాటుసారా, గంజాయిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

## రాయితీపై విత్తనాలు పంపిణీ

దత్తిరాజేరు, మే 24, ప్రభాతవార్త



మండలంలోని 17 రైతు భరోసా కేంద్రంలో రైతులకు కావాల్సిన విత్తనాలు అందు బాటులో ఉంచడం జరిగిందని వ్యవసాయ అదికారి అనురాధ అన్నారు. ఖరీఫ్ 2024 పంట కాలానికి సంబందించిన రైతులకు సాగు నిమిత్తం అవసరమయ్యే రాయితీ విత్తనాలు పచ్చిరొట్ట వేరుశెనగ జిలుటు వరి విత్తనాలు యాభై శాతం రాయితీపై రైతుభరోసా కేంద్రంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వీటిని రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆర్‌బికె కేంద్రాల్లో యూరియా 27 టన్నులు డిఎపి 22 టన్నులు పోటాస్ 30 టన్నులు పంపిణీ సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లీలా కృష్ణ రైతులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ

పార్వతీపురం, మే 24, ప్రభాతవార్త



సాధారణ ఎన్నికల ఓట్లు లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా కలెక్టర నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఉద్యాన కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగు నియోజకవర్గాల పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపుతో పాటు బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన ఏర్పాట్లను, వసతుల కల్పనకు శుక్రవారం సూచనలు చేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల లెక్కింపు ప్రక్రియ పూర్తికి అవసరమైన ఐరన్ మెస్ బారికేడింగ్ ఏర్పాటును చూశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్ ఏజెంట్లు వచ్చే మార్గం, ఎన్నికల సిబ్బంది వచ్చే వెళ్ళే మార్గాలను సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. లెక్కింపు కేంద్రంలో రిటర్నింగ్ అధికారి టేబుల్, లెక్కింపు టేబులేల ఏరాప్టట్లు, గాలి, వెలుతురు వసతి తదితర అంశాలపై నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారికేడింగ్ పటిష్టంగా ఉండేలా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అరుకు పార్లమెంటరీ సహాయ రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక, పాలకొండ, సాలూరు, కురుపాం, పార్వతీపురం శాసన సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, శుభం బన్సల్, సి.విష్ణుచరన్, వి.వి.రమణ, కె.హేమలత, డిఆర్ఒ జి.కేశవనాయుడు, కంట్రోల్ రూమ్ ఎస్.డి.ఆర్,సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 27న విజయనగరంలో విద్యా సదస్సు

గరివిడి, మే 24, ప్రభాతవార్త




కామ్రేడ్ కోరెడ్ల శేషగిరి వర్ధంతి సందర్భంగా ఈ నె 27న విజయనగరంలో విద్యా సదస్సు స్మారకోపాన్యాసం నిర్వహిస్తున్నట్లు గరివిడి మండల యూటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే మండల విదా ్యశాఖాధికారి పి.రామారావు, ఇతర అధికారులు, సిబ్బందికి కార క్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మీసాల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ జగనే సీఎం..! : మంత్రి బొత్స

విజయనగరం, మే 24, ప్రభాతవార్త ప్రతినిధి



మళ్ళీ జగనే సీఎం అని మంత్రి బొత్స సత్యనారాయణ పునరుద్ఘాటించారు. ఈమేరకు సమయం, తేదీ, వేదికను కూడా నిర్ణయించేశామని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 9వ తేదీన జగన్ విశాఖలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో రెండోసారి వైసీపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఐదేళ్ళు తమతో మమేకమైన జగన్ మళ్ళీ సీఎం కావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకున్నారని బొత్స వ్యాఖ్యానించారు. అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో జగన్ ప్రజారంజక పాలన అందించారన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చడంతో పాటు విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలతో విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చారన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా అవినీతి రహిత పాలన అందించారు కాబట్టే జగన్ మళ్ళీ సీఎం అవ్వాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకున్నారని బొత్స పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో కూడా గత ఎన్నికల్లో లాగానే తొమ్మిదికి తొమ్మిది అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ మీద టీడీపీ చేస్తున్న ఆరోపణలకు సంబంధించిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ అవన్నీ ఓడిపోతామనే అక్కసుతో చేసే ఆరోపణలని కొట్టిపారేశారు.

## కౌంటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని నమూన్

శ్రీకాకుళం, మే 24, ప్రభాతవార్త




కౌంటింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన, పట్టు కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా వచ్చే నెల 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, విధి విధానాలపై అంబేద్కర్ ఆడిటోరియంలో కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు, మైక్రో అబ్జర్వర్‌లు, కౌంటింగ్ అసిస్టెంట్లు తదితర సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన అధికారులు అందరినీ ఈ సందర్భంగా అభినందించారు.



అదే స్ఫూర్తితో కౌంటింగ్ విజయవంతం చేయాలని కోరారు. ఖచ్చిత మైన, సమర్ధవంతమైన ఓట్ల లెక్కింపునకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో సిబ్బందిని సన్నద్ధం చేయడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) లెక్కింపుకంటే ముందుగా పోస్టల్ బ్యాలెట్ పేపర్ల లెక్కింపు జరుగుతుందని, కౌంటింగ్ రోజు జరిగే సంఘటనల క్రమాన్ని వివరించారు. అందుకు తగ్గట్టుగా ఈ ప్రక్రియ కోసం సమగ్రంగా సన్నద్ధం కావాలని అన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్లకు నమ్మకం కలిగించే వరకూ ఓపికగా ఉండాలన్నారు. కౌంటింగ్ పూర్తి అయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా పూర్తి పారదర్శకంగా వ్యవహరించాల న్నారు. మాస్టర్ ట్రైనర్లు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ అవగాహన కల్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, మాస్టర్ ట్రైనర్లు కిరణ్, ఎన్.బాలాజీ, మెప్మాపీడీ కిరణ్‌కుమార్, శేషగిరి, జిల్లా వ్యాప్తంగా 350 మంది వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతి

ఆముదాలవలస, మే 24, ప్రభాతవార్త



ఆముదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన సిఆర్‌పిఎఫ్ జవాన్ పేడాడ రాజగోపాలరావు హైదరాబాద్‌లో అనారోగ్యం కారణంగా గురువారం మరణించారు. ఆయన పార్ధీవ దేహాన్ని సంబంధిత బెటాలియన్ సిబ్బంది శుక్రవారం కొర్లకోటకు తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఆముదాలవలస ఎస్సై, సర్పంచ్ ప్రతినిధి ఎస్.అప్పలనాయుడు, తక్షణ సహాయం కింద 50వేలు రూపాయలు ఆ కుటుంబానికి అందించారు. మృతుడికి భార్య చాందిని, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు.

## సిమ్స్ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన కీర్తన, దీపిక

సంతబొమ్మాళి, మే 24, ప్రభాతవార్త



సీమ్స్ ఒలింపియాడ్ సంస్థ (హైదరాబాద్) విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి ప్రతిభ పరీక్షలో సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం ఉన్నత పాఠశాలకు చెందిన సీడీ కీర్తన, ఇప్పిలి దీపిక సత్తా చాటారు. 8వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో 30, 34 ర్యాంకులు మరియు జోనల్ స్థాయిలో 12, 16 ర్యాంకులు సాధించారు. వీరు నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసాపత్రాలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం కోట చైతన్య తెలిపారు. ఈసందర్భంగా వీరిని అభినందిస్తూ మరిన్ని ప్రతిభా పరీక్షలలో పాల్గొని ఇంకా మెరుగైన ఫలితాలు సాధించి మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకు రావాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు



భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, మార్కండేయులు, కృష్ణవేణి, రోజాలు అభినందనలు తెలిపారు.

శ్రీకాకుళం వార్త



## ప్రత్యేక అవసరాలు పిల్లలు గుర్తింపు కోసం స్పెషల్ డ్రైవ్

సంతబొమ్మాళి, మే 24, ప్రభాతవార్త



సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు మే నుంచి జూన్ 9 వరకు సంతబొమ్మాళి మండలంలో ప్రతి గ్రామంలో ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు పాఠశాలలో నమోదు చేయుట కోసం స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎంఈఓలు చిన్నవాడు, అర్జునుడు అన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా వెంకటాపురం గ్రామంలో ఎంఈఓలు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా వార మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐఈఆర్‌టిలు సర్వే నిర్వహించి ఇటువంటి పిల్లలను గుర్తించి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడిలో చేర్పించి వారికి అవసరమైనటువంటి అన్ని రకాల సేవలను భవిత కేంద్రాల ద్వారా అందించవల్సిందిగా ఐఆర్‌పిలను సూచించడం జరిగింది. అలాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులతో కూడా ఇటువంటి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించవల్సిందిగా తల్లిదండ్రులకు తెలియజేయడం జరిగింది.

## మార్మోగిన జీవన సత్సంగ సమావేశం

రేగిడి, మే 24, ప్రభాతవార్త



మండలంలోని రేగిడి దత్తాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు కిమిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి ప్రధాన వక్తగా పాలకొండ సత్యసాయి ప్రతినిధి ఎన్.వి.రమణ అలాగే పార్వతీపురానికి చెందిన కె.రామ్మోహనరావు కోటబొమ్మాళి మండలం రేగులపాడు గ్రామానికి చెందిన జి.మోహనరావు మాస్టారు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా పాలకొండ సత్యసాయి ప్రతినిధి ఎన్.వి.రమణ మాట్లాడుతూ కోరికలు తీరితే ఆనందం లభిస్తుందని అందరూ అనుకుంటారని కోరికలు తీరే కొద్దీ ఒకదానికొకటి పెరుగుతూనే ఉంటాయని కోరికలు తీరితే ఆనందం లభించదని కోరికలు ఆరితేనే ఆనందం లభిస్తుందని అన్నారు. అలాగే పక్షికి రెండు రెక్కలు ఉన్నప్పుడే ఆకాశంలో హాయిగా విహరించగలదని అలాగే ప్రేమ, సేవ అనే రెక్కలతోనే మానవుడు ఉన్నత స్థాయికి చేరుకోగలడని ప్రేమ లేని సేవలకు ప్రయోజనం లేదని అలాంటిది అసలు సేవే కాదని అన్నారు. పార్వతీపురానికి చెందిన రామ్మోహన్ మాస్టర్ భగవద్గీతలోని ముఖ్య ఘట్టాలను విశ్లేషించారు. కోటబొమ్మాళికి చెందిన మోహనరావు రామాయణ మహాభారత, భగవద్గీతలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ జాయింట్ సెక్రటరీగా చిన్నారావు

కోటబొమ్మాళి / సంతబొమ్మాళి, మే 24, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ జాయింట్ సెక్రటరీగా సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన చింతాడ చిన్నారావును హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆలిండియా నేషనల్ ప్రెసిడెంట్, పౌండర్ బి.అయ్యప్ప, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఇన్వెస్టిగేషన్ పోర్ట మెంబర్ లఖినేని శ్రీధర్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ పోర్ట్ మెంబర్ పి.హరీష్‌లు నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నారావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారావు నియామకం పట్ల బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు, కాంగ్రెస్ రాష్ట్ర పరిశీలకులు చింతాడ దిలీప్, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు అప్పారావు, ఎఎంసి చైర్మన్ రామిరెడ్డి, సర్పంచ్ చింతాడ శ్రీనివాస్‌లు అభినందనలు తెలిపారు.

## కాలువలో పూడికతీత

సంతకవిటి, మే 24, ప్రభాతవార్త



మండలంలో మండవ కురిటి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పోతురాజుపేట యాలజీపేట అన్నమరాజపురంలో శుక్రవారం నుంచి కాలువలో పూడికతీతలు మండవ కురిటి గ్రామసర్పంచ్ బత్తుల నారాయణమ్మ, ప్రతినిధి జ్యోతిశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. కాలువల్లో ఉన్న చెత్తా చెదారం తీయడం జరిగింది.

## దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్ర నిర్మాణంకు విరాళం

సంతకవిటి, మే 24, ప్రభాతవార్త



సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమం ప్రాంగణంలో నిర్మాణం జరుగుతున్న దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్రం నిర్మాణంకు ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి, హరి పురం, బొడ్డకాలి, మండపల్లి, రత్తకన్న, కొళిగాం గ్రామ ప్రజలు, యువకులు గురు వారం 40వేలు రూపాయలను విరాళంగా అందజేశారు. ఆశ్రమ వృద్ధుల అన్నదాన సేవార్థం 250 కేజీల బియ్యాన్ని వీతరణ చేశారు. దాతల దాతృత్వానికి, గ్రామ యువకుల చేయూతకు సీతయ్య ఫౌండేషన్ నిర్వాహకులు గుల్ల రమేష్, మోహనరావులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉపాధి ఉద్యోగులు తమ వృత్తి ధర్మాన్ని ప్రేమించాలి

### రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్

ఆముదాలవలస, మే 24, ప్రభాతవార్త




ఉపాధిహామీ పథకంలో ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ ధర్మాన్ని ప్రేమించాలని అప్పుడే నాణ్యమైన స్థిరాస్తులను ప్రజలకు అందించగలమని గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎపీడీలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు ఉపాధిని చూపించడంతో పాటు స్థిరాస్తులు సృష్టించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యంగా తెలిపారు. ఖర్చు చేసిన ప్రతి పైసా పూర్తిస్థాయిలో సద్వినియోగం అయ్యేలా సిబ్బంది ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చెరువులు మరియు కాలువల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యతను తగ్గించి భూగర్భ జలమట్టాన్ని పెంపొందింపజేసే ఖండిత కందకాలు, ఫారం పాండ్ సరిహద్దు కందకాలు, వృత్తాకార కందకాలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ వంటి ఇతర పనులకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. అదే విధంగా చెరువుల్లో మెరక భాగాల్లో ఫిష్‌పాండ్‌ల పనులు చేపట్టడం ద్వారా కూలీలకు అధిక ఉపాధి పని దినాలు కల్పించడంతో పాటు ఆయా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చుతుందన్నారు. ఈ పనులు చేపట్టడం వలన వచ్చే ప్రయోజనాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఉద్యోగులను కోరారు. చెరువుల్లో పూడికతీత పనులను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేశామని ఆయన స్పష్టం చేశారు. కూలీలకు కొలతల మేరకు పనులు చేపట్టడంపై సాంకేతిక సలహాలను ఇవ్వడం ద్వారా గరిష్ట వేతనం అందే విధంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. సిబ్బందికి సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో పర్యటించి ప్లాంటేషన్, చెరువు పూడిక తీత పనులు, ఫారంపాండ్ తదితర పనులను జాయింట్ కమిషనర్ పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూప రాణి, విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీలు పి.రాధ, మురళీకృష్ణ, శైలజ, లోకేష్, కార్యాలయ సూపరింటెండెంట్ మురళీధర్, జిల్లాలోని అన్ని మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్, పాక్ మధ్య హై వోల్టేజ్ మ్యాచ్



## టిక్కెట్ ధర కూడా హై రేట్
## ఒక్కోటి రూ.16.65 లక్షలు

**న్యూ ఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎదురు చూస్తున్న భారత్, పాక్ మధ్య హై వోల్టేజ్ క్రికెట్ మ్యాచ్‌కు సమయం దగ్గర పడుతోంది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) టీ 20 వరల్డ్ కప్-2024 టోర్నీ జూన్ 1 నుండి ప్రారంభం కాబోతోంది. అమెరికా, న్యూజిలాండ్ దేశాలు వీటికి ఆతిథ్యం ఇస్తున్నాయి. ఈ వరల్డ్ కప్ టోర్నీకై 20 దేశాలకు చెందిన క్రికెట్ టీమ్‌లు పోటీ పడుతున్నాయి. అయితే ఈ మొత్తం టీ 20 టోర్నమెంట్‌లో ఇండియా, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే పోటీకి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. భారత్, పాక్‌లోనే కాకుండా యావత్ ప్రపంచ ప్రపంచ ద్యాప్తంగా ఉన్న క్రికెట్ ఫ్యాన్స్ మధ్య అప్పుడే ఉత్కంఠ రేపుతోంది. జూన్ 9వ తేదీన న్యూయార్క్‌లో జరగనున్న ఈ హై టెన్షన్ మ్యాచ్‌ను చూసేందుకు క్రికెట్ అభిమానులు అప్పుడే క్యూ కడుతున్నారు. న్యూయార్క్‌లోని నాసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ రెంటి జట్ల మధ్య వార్ జరగనుంది. ఈ నేపథ్యంలో భారత్, పాక్ మధ్య జరిగే మ్యాచ్‌ను క్యాష్ చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతుండటం వివాదాస్పద మవుతోంది. అమెరికాలో క్రికెట్‌ను ప్రోత్సహించడం కంటే ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ లాభాలకు ప్రాధాన్యత ఇస్తోందనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. భారత్, పాక్ జట్ల మధ్య మ్యాచ్ నాసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆ రోజు జరిగే క్రికెట్ మ్యాచ్ టికెట్ ధరలు అందుబాటులో లేనంతగా నిర్ణయించడంతో వివాదం ప్రారంభమైంది. ఈ స్టేడియంలో డైమండ్ క్లబ్ విభాగంలో ఒక్కో సీటుకు 20000 డాలర్లకు విక్రయిస్తున్నారు. అంటే శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో ద్రవ్య మారకం విలువ ప్రకారం భారత్ కరెన్సీలో ఒక్కో టిక్కెట్ రేట్ అక్షరాలా 16 లక్షల 65 వేల 743 రూపాయలకు విక్రయించడంతో క్రికెట్ అభిమానులు షాక్ అవుతున్నారు. కాగా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ప్రకారం, భారత్, పాక్ మధ్య జరిగే టికెట్ ధరలు సోల్డ్ అవుట్‌లో 300 నుండి 10000 డాలర్లు (రూ.24,986 నుండి రూ.8,32,866) వరకూ ఉన్నాయి. అయితే ఇటీవలే అమెరికా టుడే నివేదిక ఈ టిక్కెట్ల రీసేల్ ధరలు బాగా పెరిగాయని పేర్కొంది. కాగా భారత్ వరల్డ్ కప్ జర్నీని జూన్ 5న న్యూయార్క్‌లోని నాసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఐర్లాండ్ జట్టుతో జరిగే మ్యాచ్‌తో ప్రారంభిస్తోంది. ఇదే వేదికపై 9వ తేదీన పాకిస్థాన్‌ను ఢీ కొట్టబోతోంది. అలాగే 12వ తేదీన ఆతిథ్య అమెరికా జట్టుతోను, గ్రూప్ ఏలో ఫైనల్ మ్యాచ్ 15వ తేదీన కెనడాతో టీమిండియా తలపడనుంది.

# ఆర్చరీ వరల్డ్ కప్ సెమీ ఫైనల్స్‌లో ప్రధమేశ

**న్యూ ఢిల్లీ:** ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 2లో ఇండియా యంగ్ ఆర్చర్ ప్రథమేశ్ జ్వకర్ సెమీ ఫైనల్స్‌లోకి చేరుకున్నాడు. దక్షిణ కొరియా లోని యెంచియోన్‌లో జరుగుతున్న వరల్డ్ ఆర్చరీ కప్ స్టేజ్ 2లో ప్రపంచ ర్యాంకర్‌కు షాక్ ఇచ్చాడు. మెన్స్ కాంపౌండ్ క్వార్టర్ ఫైనల్లో 146-145తో ఆస్ట్రేలియాకు చెందిన 2021 వరల్డ్ ఛాంపియన్ నికో వీనర్‌ను ఓడించాడు. అభిషేక్ వర్మ రెండో రౌండ్‌లోనే ఓడగా, ప్రియాన్ష్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. ఇక విమెన్స్ కాంపౌండ్ క్వార్టర్ ఫైనల్లో స్టార్ ఆర్చర్ జ్యోతి సురేఖ 142-145తో కొలంబియాకు చెందిన సారాలోపేజ్ చేతిలో పరాజయం చెందింది. మెన్ రిక్వర్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్, తరుణ్ దీప్, మినాల్ చౌహాన్‌తో కూడి ఇండియా తొలి రౌండ్‌లోనే 3-5 తో కెనడా చేతిలో చిత్తయింది.




# మలేసియా మాస్టర్స్‌లో అస్మితా సంచలనం



**న్యూ ఢిల్లీ:** మాలేషియా మాస్టర్స్‌లో ఇండియా యంగ్ షట్లర్ అస్మితా చాలిహా సంచలన విజయం సాధించింది. కౌలాలంపూర్‌లో జరిగిన విమెన్స్ సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ అష్మితా 21-19, 16-21, 21-12తో అమెరికాకు చెందిన 10 ర్యాంకర్, మూడోసీడ్ బీవెన్ జాంగ్‌ను ఓడించింది. దీంతో అష్మితా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మరో మ్యాచ్‌లో పీవీ సింధు 21-13, 12-21, 21-14తో కొరియాకు చెందిన సిమ్ యు జిన్‌పై చెమటోడ్చి నెగ్గింది. ఇక విమెన్స్ డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ 18-21, 22-20, 14-21తో చైనీస్‌తైపీకి చెందిన సంగ్ షుయో యున్-యు చెన్ యు చేతిలో ఓడారు. అలాగే సిమ్రాన్ సింగి-రితికా 17-21, 11-21తో మలేషియాకు చెందిన పియర్లీ టాన్-తిన్నా మురళీధరన్ చేతిలో పరాజయం పాలయ్యారు. మెన్స్ సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్-సాయి ప్రతీక్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి-సుమిత్‌రెడ్డి ఇంటిదారి పట్టారు.



# ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌కు భారత్ జట్టు ఖరారు

**న్యూ ఢిల్లీ:** ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా భారత్ కువైట్‌తో తలపడనుంది. జూన్ 6వ తేదీన జరిగే ఈ క్వాలిఫయర్స్‌లో పాల్గొనే భరత్ ఫుట్ బాల్ జట్టు ఖరారైంది. భారత్ ఫుట్ బాల్ టీమ్ హెడ్ కోచ్ ఇగోర్ స్టిమాక్ 27 మంది ప్లేయర్లతో కూడిన జట్టును శుక్రవారం ప్రకటించారు. గోల్ కీపర్లుగా గురుప్రీత్ సింగ్ సంధు, అమ్రీందర్ సింగ్, విశాల్ కైత్, డిఫెండర్లుగా అమీ రణవాడే, అన్వర్ అలీ, జే గుప్తా, లాల్చుంగ్నుంగా, మెహతాబ్ సింగ్, నరేంద్రర్, నిచల్‌పూజారి, రాహుల్ భేకే, సుభాసిష్ బోస్, మిడ్ ఫీల్డర్లుగా అనిరుధ్ థపా, బ్రాండన్ ఫెర్నాండెజ్, ఎడ్మండ్ లాల్రిండికా, జీక్సన్ సింగన తౌనోజమ్, లాలియాన్జువాలా చాంగ్టే, లిస్టన్ కొలాకో, మహేష్ సింగ్ నౌరెమ్, నందకుమార్ సేకర్, సహల్ అబుద్దల్ సమద్, సురేష్ సింగ్ వాంగ్జామ్, ఫార్వర్డ్‌లుగా డేవిడ్ లాల్లన్‌సంగా, మన్వీర్ సింగ్, రహీమ్ అలీ, సునీల్ ఛైత్రి, విక్రమ్ పర్తాప్ సింగ్ ఉన్నారు. కాగా పార్థివ్ గొగోయ్, మహమ్మద్ హమ్మద్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరంగా ఉండనున్నారు. వీరితో పాటు ఫుర్బా లాచెన్పా, ఇమ్రాన్ ఖాన్, జితిన్‌లకు ఈ జట్టులో చోటు దక్క లేదు. క్వాలిఫయర్స్‌లో తర్వాతి రౌండ్‌కు చేరుకోవాలంటే కువైట్‌పై గెలవడం భారత్‌కు కీలకం కానుంది. అలాగే ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నట్లు భారత్ ఫుట్ బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి ఇప్పటికే ప్రకటించారు.

## సిమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆరుగురికి 18 పతకాలు



**హైదరాబాద్:** ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆరుగురు 18 పతకాలు కైవసం చేసుకున్నారు. పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ స్విమ్మింగ్ పూల్ నందు నిర్వహించిన ఈ పోటీల్లో 55-59 విభాగంలో పి.లక్ష్మికి 3 గోల్డ్, ఒక సిల్వర్, 70-74 విభాగంలో జి మోహన్‌బాబు ఒక రజతం, 4 కాంస్యం, 50-54 విభాగంలో ఎన్ శ్రీనివాసులవర్మ 3కాంస్యం, 55-59 విభాగంలో పి శ్రీనివాస్ ఒక గోల్డ్, 2 కాంస్య, 35-39 విభాగంలో టి వెంకట వినోద్ ఒక కాంస్యం, 65-69 విభాగంలో ఎ సురేంద్రమోహన్ ఒక కాంస్యం సాధించారు.

# అనిల్ అంబానీకి ఢిల్లీ మెట్రో నోటీసులు..

**ముంబై, మే 24:** భారతదేశపు ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ తమ్ముడు అనిల్ అంబానీ కష్టాలు తీరే సూచనలు కనిపించడం లేదు. కోట్ల రూపాయల నోటీసుపై అనిల్ అంబానీ మరోసారి టెన్షన్ పడాల్సిన పరిస్థితి నెలకొంది. రూ.2,599 కోట్ల భారీ మొత్తాన్ని చెల్లించాలంటూ అనిల్ అంబానీకి చెందిన ఓ కంపెనీకి తుది నోటీసు అందిందని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఇంత భారీ మొత్తాన్ని తిరిగి ఇవ్వడానికి వారికి 15 రోజుల సమయం మాత్రమే ఉంది. మీడియా నివేదికల ప్రకారం, డిఎంఆర్‌సి రిలయన్స్ ఇన్‌ఫ్రా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ (డిఎఎంఇపిఎల్)కి నోటీసు పంపింది. ఇందులో ఎస్‌బిఐ ప్రైమ్ లెండింగ్ రేటు ప్లస్ 2శాతం చొప్పున వడ్డీతో సహా రూ.2,599 కోట్ల వాపసు అడిగారు. దీని చెల్లింపు 15 రోజుల్లోగా జరగాలి. చెల్లించకపోతే, డిఎంఆర్‌సి కోర్టు ధిక్కారానికి అనిల్ అంబానీ డిఎఎంఇపిఎల్‌పై చట్టపరమైన చర్య తీసుకుంటుంది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన మెట్రో డివిజన్‌కు అనుకూలంగా మధ్యవర్తిత్వ తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. పేటెంట్ చట్టవిరుద్ధమని పేర్కొంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం, 'డిఎంఆర్‌సి డిపాజిట్ చేసిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. పిటిషనర్ తీసుకున్న బలవంతపు చర్యలో భాగంగా చెల్లించిన ఏదైనా మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ లైన్ డిజైన్, ఇన్‌స్టాలేషన్, కమీషన్, ఆపరేషన్, మెయింటెనెన్స్ కోసం డిఎంఆర్‌సి, డిఎఎంఇపిఎల్ ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ లైన్ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి సెక్టార్ 21 ద్వారక వరకు వెళుతుంది. 30యేళ్ల కాలానికి ఈ ఒప్పందం కుదిరింది.




అనిల్‌అంబానీ డిఎఎంఇపిఎల్ అన్ని సిస్టమ్‌పనులకు బాధ్యత వహించింది. కాగా సివిల్ నిర్మాణాల నిర్మాణ బాధ్యతను డిఎంఆర్‌సి చేపట్టింది. 2012లో, వయాడక్ట్ వద్ద గుర్తించబడిన సమస్యలకారణంగా డిఎఎంఇపిఎల్ కార్యకలాపాలను నిలిపివేయాలనినిర్ణయించింది. ఈ వ్యవహారానికి బాధ్యులైన డిఎంఆర్సీకి ఆయన నోటీసులు పంపారు. ఆ సంవత్సరం తర్వాత డిఎఎంఇపిఎల్ రద్దు నోటీసును జారీచేసింది. దీంతో అధికారులు 2012 నవంబర్‌లో తనిఖీలు నిర్వహించారు. నోటీసు ప్రకారం, డిఎంఆర్‌సి యాక్సిస్ బ్యాంకు లిమిటెడ్‌కి వ్యతిరేకంగా ప్రాథమిక తీర్పు వెలువడినప్పుడు దాని ఎస్క్రో ఖాతాలో రూ.2,599 కోట్లు జమ చేసింది. ఇప్పుడు డిఎంఆర్‌సి ఈ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని కోరింది.

## హెచ్‌పిఇ ఆస్తులు కొనుగోలు చేస్తున్న హెచ్‌సిఎల్ టెక్..

**ముంబై, మే 24:** దేశంలో మూడో అతిపెద్ద ఐటి కంపెనీ అయిన హెచ్‌సిఎల్ టెక్ రానున్న రోజుల్లో భారీ డీల్ కుదుర్చుకునే అవకాశంఉంది. కంపెనీ ఈ ప్రతిపాదిత ఒప్పందం హ్యూలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజ్ (హెచ్‌పిఇ)తో ఉండనుంది. ఈ డీల్‌లో హెచ్‌సిఎల్ హ్యూలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ గ్రూప్ ఆస్తులను కొనుగోలు చేయనుంది. ఈ ప్రతిపాదిత ఒప్పందం గురించి హెచ్‌సిఎల్ టెక్ స్టాక్ మార్కెట్‌కు తెలియచేసింది. రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం ఈ డీల్ నగదు రూపంలో ఉంటుంది. ఇది 225 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1,870 కోట్లతో పూర్తవుతుంది. ఈ ఒప్పందం ప్రకారం హెచ్‌సిఎల్ టెక్ హ్యూలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ ఆస్తులను కొనుగోలు చేస్తుంది. ఈ ఒప్పందం కింద దాదాపు 1500 మంది ఉద్యోగులు, 700 మంది అపాచీ కాంట్రాక్టర్లను కూడా పొందనున్నారు. ఉద్యోగులు, కాంట్రాక్టర్లు స్పెయిన్, ఇటలీ, ఇండియా, జపాన్, చైనా, అమెరికా, ఆసియా పసిఫిక్ ప్రాంతం మొదలైన వాటిలో పనిచేసిన వారు ఉన్నారు. ఈ ప్రతిపాదిత డీల్‌లో షేర్ల కొనుగోలు ఉండదు. అయితే ఇందులో మేధోపరమైన ఆస్తుల డీల్ ఉంటుంది. ఈడీల్‌ను పూర్తి చేయడానికి వివిధ రెగ్యులేటరీ అనుమతులు అవసరమని హెచ్‌సిఎల్ టెక్ చెబుతోంది. కంపెనీ ఈ డీల్‌ను వచ్చే 6నుంచి 9 నెలల్లో పూర్తి అవుతుందని పేర్కొంది. ఈ డీల్ హెచ్‌సిఎల్ టెక్ టెలికమ్యూనికేషన్ వ్యాపారాన్ని పెంచుకుంటోంది. ఇప్పటికే కంపెనీ టెలి కమ్యూనికేషన్ వ్యాపారం దాని ఆదాయాలకు గణనీయంగా దోహదపడుతోంది. టెలికమ్యూనికేషన్, మీడియా, పబ్లిషింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారం మార్చి 31తో ముగిసిన నాల్గవ త్రైమాసికంలో హెచ్‌సిఎల్ టెక్ మొత్తం రాబడికి 11.5 శాతం అందించింది. హెచ్‌సిఎల్ టెక్ ప్రస్తుతం టిసిఎస్, ఇన్ఫోసిస్ తర్వాత భారతదేశంలో మూడవ అతిపెద్ద ఐటి సేవల సంస్థగా ఉంది.




## 6.8 లక్షల మొబైల్ నంబర్లపై టెల్కోలకు వార్నింగ్

**ముంబై, మే 24:** ఉపయోగంలోలేని, నకిలీ ధ్రువపత్రాలతో తీసుకున్న 6.8 లక్షల మొబైల్ కనెక్షన్లను ధ్రువీకరించాలని టెలికం శాఖ ఆపరేటర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మొబైల్ నంబర్లను 60 రోజుల్లోపు గుర్తించి వెంటనే రీ-వెరిఫికేషన్ చేయాలని తెలిపింది. లేదంటే వాటిని డిస్‌కనెక్ట్ చేస్తామని హెచ్చరించింది. నకిలీ ఫోన్ నంబర్లు, ఉపయోగంలో లేని కనెక్షన్లను గుర్తించడానికి టెలికం శాఖ అధునాతన ఏఐను వినియోగించినట్లు ప్రకటనలో చెప్పింది. ఏఐ విశ్లేషణలో భాగంగా ఉపయోగంలో లేనివి, నకిలీ ఐడీ ప్రూఫ్‌లతో ఉన్న దాదాపు 6.8లక్షల మొబైల్ కనెక్షన్లు గుర్తించినట్లు తెలిపింది. వెంటనే నెట్‌వర్క్ ఆపరేటర్లు వాటిని ధ్రువీకరించాలని ఆదేశాలు జారీచేసింది. ఈ ప్రక్రియ 60 రోజుల్లోపు పూర్తి చేయాలని చెప్పింది. ఒకవేళ ఆపరేటర్లు ముందుగా విధించిన గడువులోపు మొబైల్ నంబర్లను ధ్రువీకరించకపోతే వాటిని డిస్‌కనెక్ట్ చేస్తామని హెచ్చరించింది. అవసరమైతే కొందరు ఆపరేటర్లు ఈ తంతును మళ్లీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 2024 ఏప్రిల్‌లో టెలికం శాఖ 10,834 మొబైల్ నంబర్‌లపై అనుమానం వ్యక్తం చేస్తూ వీటిని రీవెరిఫికేషన్ చేయాలని తెలిపింది. వీటిలో 8,272 కనెక్షన్లు ధ్రువీకరణలో విఫలమవడంతో డిస్‌కనెక్ట్ చేసినట్లు పేర్కొంది.



# వాణిజ్యం

## బిమల్ జలాన్ సిఫార్సులతోనే ఆర్‌బిఐ భారీ డివిడెండ్..

**న్యూఢిల్లీ, మే 23:** రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వానికి భారీగా డివిడెండ్ ప్రకటించిన విషయం విదితమే. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన సెంట్రల్ బ్యాంకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి రూ.2,11 లక్షల కోట్ల డివిడెండ్ ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. అయితే ఇంత పెద్ద మొత్తంలో డివిడెండ్ ఇవ్వడానికి గల కారణాలపై దేశంలోనే అతిపెద్ద బ్యాంకు ఎస్‌బిఐ రీసెర్చ్ నోట్ విడుదల చేసింది. ప్రపంచ అనిశ్చితి ఉన్న ఈ కాలంలో ఆర్‌బిఐ హెచ్చుతగ్గులను తనకు అనుకూలంగా ఉపయోగించుకుందని ప్రభుత్వానికి నివేదిక పేర్కొంది. ఆర్‌బిఐ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్టాక్ మార్కెట్ కూడా ఎంతో ఉత్సాహంతో స్వాగతించింది. ఆర్‌బిఐ ఈ నిర్ణయం కారణంగా, ప్రస్తుత సంవత్సరంలో ఆర్థిక లోటు 30 నుంచి 40 బేసిస్ పాయింట్ల వరకు తగ్గుతుందని నమ్ముతారు. బిమల్ జలాన్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వానికి ఆర్‌బిఐ రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను అందించిందని ఎస్‌బిఐ రీసెర్చ్ అంచనా వేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రభుత్వానికి 141 శాతం ఎక్కువ డివిడెండ్ ఇవ్వాలని ఆర్‌బిఐ నిర్ణయించింది. ఆ సంవత్సరం ప్రభుత్వానికి డివిడెండ్‌గా రూ.87,416 కోట్లు ఇచ్చింది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఫారెక్స్ హోల్డింగ్ నుంచి బలమైన ఆదాయాన్ని ఆశిస్తోంది. ఈ కారణంగానే ప్రభుత్వానికి ఇంత ఎక్కువ డివిడెండ్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బిఐ ఆదాయం రూ.1.6 లక్షల కోట్లు. ఆర్‌బిఐ 2022-23లో రూ.2,35 లక్షల కోట్లు, 2023-24లో రూ.3.75 లక్షలకోట్ల నుంచి రూ.4లక్షల కోట్ల మధ్య ఆదాయాన్ని ఆర్జిస్తుందని అంచనా. విదేశీ పెట్టుబడులతో ఆర్‌బిఐ ఆదాయం పెరిగినట్లు భావిస్తున్నారు.




# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ఫ్లాట్‌గా ముగిసాయి. ఇంట్రాడేలో సరికొత్త గరిష్ఠాలను అందుకున్నాయి. సెన్సెక్స్ 75,636.5 పాయింట్ల వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరగా, నిఫ్టీ కూడా తొలిసారి 23వేలు దాటింది. ఆపై సూచీలు దిగువకు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలూ ఇందుకు కారణమయ్యాయి. చివరికి సెన్సెక్స్ 7.65 పాయింట్లు నష్టపోయి 75,410.39 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 10.55 పాయింట్లు కోల్పోయి 22,957.10 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.83.10గా ఉంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్, ఎల్‌అండ్‌టి, ఎన్‌టిపిసి, అల్ట్రాటెక్ సిమెంట్స్ వంటి షేర్లు ముఖ్యంగా లాభపడ్డాయి. ఏసియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, ఐటిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, టిసిఎస్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 80.76 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, ఔన్సు బంగారం ధర 2,340 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## ఎయిరిండియా ఉద్యోగుల జీతాల పెంపు

**ముంబై, మే 24:** టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా తన ఉద్యోగుల జీతాలను పెంచుతున్నట్లు ప్రకటించింది. పైలట్ల పనితీరు ఆధారంగా బోనస్ కూడా ఇవ్వనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం నుంచి టాటా అధీనంలోకి వచ్చిన తర్వాత సంస్థ తొలిసారిగా వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2024, ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాల పెంపు అమలవుతుందని ఎయిరిండియా సిహెచ్‌ఆర్‌ఓ రవీంద్రకుమార్ జిపి వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ, ఉద్యోగుల పనితీరు ఆధారంగా బోనస్ చెల్లిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాజా పెంపు నిర్ణయం 2023, డిసెంబరు 31 కంటే ముందు సంస్థలో చేరిన వారికి వర్తిస్తుందని కంపెనీ స్పష్టంచేసింది. సంస్థ వివరాల ప్రకారం, ఫస్ట్ ఆఫీసర్, కెప్టెన్‌ల జీతాలు నెలకు రూ.5వేల వరకు పెరగనుంది. కమాండర్ల జీతాలు రూ.11వేలు సీనియర్ కమాండర్ వేతనం రూ.15వేల వరకు పెరగనున్నాయి. జూనియర్ ఫస్ట్ ఆఫీసర్‌లకు ఎలాంటి పెంపు ఇవ్వలేదు. ఇక పనితీరు ఆధారంగా యేడాదికి గరిష్టంగా రూ.1.8లక్షల వరకు బోనస్ ఇస్తున్నట్లు కంపెనీ వివరించింది. జూనియర్ ఫస్ట్ ఆఫీసర్లకు రూ.42 వేలు, ఫస్ట్ ఆఫీసర్లకు రూ.50 వేలు, కెప్టెన్‌లకు రూ.60 వేలు, కమాండర్లకు రూ.1.32 లక్షలు, సీనియర్ కమాండర్లకు రూ.1.8 లక్షల వరకు బోనస్‌ఇస్తూ కంపెనీ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఎయిరిండియాలో మొత్తం 18వేల మంది వరకు ఉద్యోగులు పని చేస్తున్నారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.